AAloac 185

నాటకం

ప్రఖ్యా శ్రీరామమూర్తి

AAlo2c 185
H:- 73
W:- 4.8

షరో

ప్రఖ్యా శ్రీరామమూర్తి

నవోదయ పబ్లిషర్సు
విజయవాడ - 2

1

ప్రథమ ముద్రణ
ప్రచురణ నెం. 14
భాద్రపదం. 1879

హక్కులు
రచయితవి.

వెల 1-50 న. పై.

ముద్రణ:
ఆంధ్రా ప్రింటర్సు
విజయవాడ-2

పాత్రలు:

ఫణి

పద్మ

శంకరం

గజపతి

జాఫర్

జలాల్

రాంసింగ్

★

ఫ్రెడరిక్ నాట్ ఆంగ్ల రచన
ఈ నాటకానికి మాతృక.

★

ప్రప్రథమంగా ఈ నాటకం 15-6-57 న శ్రీ త్రిపురనేని గోపీచంద్ గారి అధ్యక్షతన హైద్రాబాద్, YMCA హాలులో ప్రదర్శించబడినది.

నాటి నటవర్గం

ఫణి	:	ఎం. వి. చలపతిరావు
పద్మ	:	ఆర్. ఉషాబాల
శంకరం	:	వి. వి. సీతారామమూర్తి
గజపతి	:	శ్రీహరిమూర్తి
జాఫర్	;	జి. బి. ఆర్. ప్రసాద్

ప్రదర్శకులు:

చంద్రకళామందిర్, హైద్రాబాద్.

ప్రదర్శకులకు -

ఏ నాటకమైనా - నాటకం అంటే అది ముఖ్యంగా దృశ్యం కనక-ఆ నాటకం విజయవంతం కావడానికి ప్రదర్శకుల బాధ్యత చాలా వుంటుంది.

అందులోకూడా నాటకాన్ని బాగా అర్థంచేసుకోవడం పాత్రాను గుణ్యంగా నటించడం ఒక యెత్తు-ఆ నాటకాని కవసరమైన టెక్నికల్ యెఫెక్ట్స్ విజయవంతంగా నిర్వహించడం ఒకయెత్తు.

నటన వ్యక్తిగతమైన ప్రజ్ఞమీద ఆధారపడివుంటుంది. ఇతరుల సూచనలు సలహాలు దర్శకత్వమూ దానిని సానపెట్టగలవేగాని నటుల్ని 'తయారు' చేయలేవు. అందుకోసం ఆ విషయం నటీనటులకే వదిలేస్తాను

కాని ఈ నాటకంలో ఫణి పాత్రను మటుకు నటులకు పరిచయం చెయ్యాలనిపిస్తోంది. అతను సామాన్యుడు కాడు చాలా విలక్షణమైన వ్యక్తి. అతని కిప్పుడు ఆలోచనలేగాని ఉద్రేకాలు లేవు - మరగకాగిన మనసతనిది. పాత సంగతులు తలచుకున్నప్పుడు గాని పాత గొడవలు చెప్తున్నప్పుడు గాని ఏదో cynical amusement తప్ప మరేవిధమైన భావోద్రేకం వుండదు మనిషిలో. కాకపోతే - అవతలమనిషికి హత్తుకు పోయేట్టు చెప్తాడు - అందు కవసరమైన ట్రిక్కులన్నీ ప్రయోగిస్తాడు. గజపతి ఫణి వుద్దేశం తెలిసి వెళ్ళిపోతానని బయలుదేరినప్పుడు ఫణి హఠాత్తుగా సరళ వ్యావహారికం లోంచి జటిల గ్రాంధికంలోకి ఒక్క దూకు దూకుతాడు - ఏంలేదు - వొట్టి ట్రిక్కు ! జోడుగుళ్ళ బారుతుపాకి పేల్చినంత పనైంది ! వెళ్ళేవెళ్ళే గజపతి ఏం అర్థంకాక తెల్లబోయి

నిర్ఘాంతుడై నిలబడిపోతాడు. అలాగే మరో ఉదాహరణ: మూడో అంకంలో అతను శంకరాన్ని తెగనాడే సన్నివేశంలో కూడా శంకరం ఊహాశక్తికి ఆశ్చర్యపడటం తప్ప ఫణికి అతనిమీద ద్వేషభావం వెనకటి కంటే ఏం ఎక్కువకాలేదు. తిట్టకపోతే బాగుండదు కనక తిట్టాడు. ఇదీ ఫణి తరహా.

అసలీ నాటక ఇతివృత్తం ఒకానొక నేరము - దాని పరిశోధనా పరిణామము. ఇలాంటి 'క్రైమ్' నాటకాలు రక్తికట్టించాలంటే-ప్రదర్శన విజయవంతం కావాలంటే సక్రమమైన శిక్షణ, విరివిగా అభ్యాసాలు అవసరం. ప్రతి అడుగు, ప్రతి కదలిక ప్రతి పలుకూ సార్థకంగా వుండాలి. సాత్త్వికం, ఆంగిక అభినయం, సంభాషణల ఉచ్చారణ - అన్నీ కూడా ఈ 'క్రైమ్' నాటకాల ముఖ్య లక్షణమైన 'సస్పెన్స్'కు దోహదాలుగా వుండాలి. ఈ సస్పెన్స్ క్షణక్షణం మరో మెట్టెక్కుతూ ప్రేక్షకులలో ఉత్కంఠ కలిగిస్తూ వారి హృదయాలను కలచివేయాలి కథా కథన రీతి, సంఘటనల సన్నివేశాల తీరు ఉత్కంఠోత్పాదకంగానే వున్నా ప్రదర్శనలలో కూడా దానికి ఇతోధిక బలం ఇవ్వడానికి కొన్ని కొన్ని టెక్నికల్ ఎఫెక్ట్స్ ఇవ్వాల్సి వుంటుంది.

ఈ నాటకంలో ఇవ్వాల్సిన ఎఫెక్ట్స్ అన్నీ ఎక్కడికక్కడ కూలంకషంగా వివరింపబడే వున్నాయి. వీటిలో చాలాభాగం ముఖ్యంగా ధ్వనికి (Sound) సంబంధించినవి:

వీధిగటు తెరచిన కిటికీ చప్పుడు - వరండాలో అడుగుల అలికిడి - తాళంలో చెవిపెట్టి తిప్పిన శబ్దం - రంగస్థలంమీదిపాత్ర టెలిఫోన్‌లో మాట్లాడుతూండగా అవతల మనిషి జవాబులుకూడా ప్రేక్షకులకు వినిపించడం ....

మొదటి మూడూ ఫరవాలేదుగాని చివరి ఎఫెక్టే కొంచెంకష్టం. ఆ ఎఫెక్ట్ జయప్రదంగా తీసుకురావాలంటే స్టేజిమీద ఒక డమ్మీ టెలిఫోన్. నేపథ్యంలో రెండు కనెక్టెడ్ టెలిఫోన్లు కావాలి. లోపలి టెలిఫోన్లు నిజంగా వర్కింగ్ ఆర్డర్‌లో వుండాలన్నమాట. ఒక ఫోన్‌వద్ద

ఒక కార్బన్ మైక్ కూడా వుండాలి. స్టేజిమీది పాత్ర డమ్మీ ఫోన్‌లో పిలవంగానే నేపథ్యంలోని పాత్ర ఒకఫోన్ యెత్తి (అప్పుడే లోపలి రెండో ఫోన్ రిసీవరుకూడా మరోమనిషి యెత్తి పట్టుకుని వుండాలి) మౌత్ పీస్‌లోకి సమాధానం చెప్తాడు. ఆ సమాధానం (లోపలేవున్న) రెండో ఫోను రిసీవరులోంచి బైటికి వస్తుంది. ఆ రిసీవరును కార్బన్ మైక్ ముందుపెడ్తే ఆ సమాధానం - అంటే సమాధానంచెప్పే మనిషి కంఠస్వరం - టెలిఫోన్‌లో మాట్లాడేటప్పుడు సర్వసామాన్యంగా సంభవించే మార్పులన్నీపొంది ప్రేక్షకులకు మైక్‌లోంచి వినిపిస్తుందన్నమాట. ఇలా చేయగలిగితే sound effeets అన్నీకూడా అద్భుతంగా నిర్వహింపబడినట్లే.

కాని ఇంత శ్రమ, బాదరబందీ పెట్టుకోవడాని కవకాశం లేకపోతే ఫోన్‌లోంచి వినిపించాల్సిన సంభాషణలు నేపథ్యంలోని మైక్ ముందు నిలబడి చెప్పించవచ్చు. లేదా ఫోన్ సంభాషణలన్నీ కుదించి రంగస్థలంమీది పాత్రచేతనే చెప్పించినా తీరిపోతుంది. ఇదీ ఒక పద్ధతే.

—రచయిత.

ఈ నాటకాన్ని ప్రదర్శించాలంటే పబ్లిషర్స్
పేరిట రచయితకు వ్రాసి లిఖితానుమతి
పొందవలెను.

తప్పొప్పుల పట్టిక

పేజీ	పంక్తి	తప్పు	ఒప్పు.
6	13	ఎడమప్రక్క మూల	కుడిప్రక్కమూల
		కుడిప్రక్కన	ఎడమ ప్రక్కన
10	4	లేదనుకుం	లేదనుకుంటాను-
	7	అన న్నా	అనుకున్నా-
17	7	శంకరం	శంకరం వంక
30	17	బ్రాంచీ	బ్రాందీ
31	20	ప్పాడు	ప్పాడు !
		కాతోద్ధూత	కాలోద్ధూత
32	2	మరీ	మరి
	3	సక్షుభిత	సంక్షుభిత
33	5	ఏంచేస్తానో	ఏంచేస్తూనో
	19	రాయ్ ఘుర్	రాయ్ గిరి
34	18	అస లీమా బీబీ	ఆ సలీమాబీబీ
35	5	చేస్తావ్ ?	చెప్తావ్ ?
59	18	వుత్తరం	వుత్తరంతీసి
73	17	ముందుకు	ముందుకే
82	4	గాదా ?	గదా ?
90	10	uidieulous	ridiculous
94	21, 22	'May I?' అనే	మాటలు జాఫర్ అనాల్సినవి.

ఫణి

ఒకటో అంకం

సమయం ; ఒక బుధవారం సాయంత్రం 6-30 అయింది.

స్థలం : హైద్రాబాదు - ఖైరతాబాద్‌లో కొత్తగా కట్టిన ఎపార్ట్‌మెంట్ హౌస్ (Aparatment house) - కింద ఫణిభూషణరావు వుంటున్న భాగంలో హాలు.

ప్రేక్షకులకు ఎదురుగ్గా 'వరండాలోంచి హాలులోకి వచ్చే ద్వారం' వుంది. దీనికి యేల్‌టైప్ తాళం (Yale Type Lock) బిగించి వుంటుంది· ఈ 'హాలువాకిలి' తెరిచినప్పుడు అవతల వరండాలో పై అంతస్తుకు తీసుకుపోయే మెట్ల వరుసలోనివి మూడు నాలుగు మెట్లు ప్రేక్షకులకు కనిపిస్తూంటాయి;

హాలులో కుడివైపున తోటలోకి పోయే గుమ్మం - దానికి తెరలు- (అవతల చిన్న టెర్రేస్) - ఆ గుమ్మంముందే హాలుకి అడ్డంగా ఒక కుర్చీ, టేబులు, దానికింద చిత్తుకాగితాల బుట్ట వుంటాయి. టేబులుపైన టెలిఫోను, టేబులులైటు, డైరీ, ఇంకేవో ఒకటి రెండు పుస్తకాలు, ఏష్‌ట్రే (ashtray), బంగారపు సిగరెట్‌కేస్ వుంటాయి.

ఎడమవైపున పడకగదిలోకి ఒకటి; భోజనాలగదిలోకి మరొకటి- రెండు గుమ్మాలుంటాయి. ఈ రెండుగుమ్మాలకి మధ్య రెండు బ్రాకెట్

లైట్లు (Bracket Lights) గోడకు బిగించి వుంటాయి. వాటికి కొంచెం దిగువగా చిన్న షెల్ఫుమీద అలారం గడియారం ఒకటుంది.

హాలు వాకిలికి అటూ యిటూ రెండు గోడ అల్మైరాలు - ఒక దాంట్లో పుస్తకాలు, పాత న్యూస్‌పేపర్లు వగైరా వుంటాయి. రెండో దాంట్లో రెండు అరల్లో ఫణి నాటకాల్లో గెల్చిన బహుమానాలు - షీల్డులు కప్పులు, కాస్కులు (Casks) మేకప్‌బాక్సు ఒకటీ వుంటాయి. కింది అరలో పద్మ అల్లికదారాల బుట్ట వుంటుంది. బుట్టమూత సరిగావేసి వుండదు. అందులోంచి బైటికి వేలాడుతూ రిబ్బన్లు, పూలు, చిన్నఅల్లిక గుడ్డ కనిపిస్తుంటాయి. అందులోనే ఒకకత్తెర, రంగుదారాల బంతులు కూడా వుంటాయి.

మిగతా ఫొటోలతోబాటు ఫణి మేకప్‌లో వుండగా తీయించుకున్న ఫొటోలుకుడా కొన్ని గోడలకు తగిలించి వుంటాయి.

హాలులో ఎడమప్రక్క మూల కోట్‌స్టాండ్ - కుడిప్రక్కన మధ్యగా సోఫాసెట్టు, టీ పాయ్ వున్నాయి.

పైకప్పునుంచి మూడు బల్బుల చాండిలీర్ (Chandelier) కూడా ఒకటి వ్రేలాడుతూంటుంది. దీనికి, బ్రాకెట్‌లైట్స్‌కు వేర్వేరు స్విచ్‌లు-రెండూ హాలు గుమ్మంపక్కనే వున్నాయి. టేబుల్‌లైట్ స్విచ్ దానికే వుంటుంది.

తెర లేచేసరికి హాలువాకిలి మూసివుంది. ఇంకా బాగా పొద్దు కూకలేదు - హాలులో లైట్లేవీ వేసిలేవు. పద్మ, శంకరం మాట్లాడుకుంటూ వుండగా క్రమంగా సంధ్యవెల్తురు సన్నగిలుతూంటుంది. పద్మ శంకరానికి కాఫీకప్పు అందిస్తోంది.

శంకరం : ఏడాదైంది పద్మా మనిద్దరం కలుసుకుని- కదూ ?

పద్మ : ఆఁ ఆఁ-అవును—
[ఎవరికోసమో నిరీక్షిస్తున్నట్టు మధ్య మధ్య హాలు గుమ్మంకేసి చూస్తూంటుంది]

ఏం చేస్తున్నావ్ ఇన్నాళ్ళమట్టీ ?

శంక : ఏముందీ—
[పద్మ మధ్యలోనే లేచి హాలుగుమ్మం తలుపు తెరిచి తొంగి చూసి మళ్ళీ తలుపేసి వచ్చి కూర్చుంటుంది.]

పద్మ : ఆఁ-....ఎవరో వస్తున్నట్టైతేనూ వారేమోనని చూశాను....ఊఁ—
ఏమిటి-ఎలా వున్నావ్-ఏంచేస్తున్నావ్ ?

శంక : చేసేందుకేముంది ఖూనీలు తప్ప। ఈయేడు యాభై అరవై ఖూనీలైనా జరిగివుంటాయి మన చేతిమీదుగా. అంతకంటే పనేముంది మనకి।

పద్మ : (నవ్వుతూ) అబ్బ-నెలకి నాలుగైదు ఖూనీలే। అవునుగాని ఇంతమందిని చంపడానికి నీకు బుద్ధెలా పుడుతుంది శంకరం ?

శంక : ఎలా బుద్ధిపుడితే అలానే। కొంతమందిని మేడ మూడో అంతస్తుమీది కెక్కించి తోస్తాను. కొంతమందిని కొండమీంచి పొరబాటున పడదోస్తాను. ఒక్కోసారి విషంపెట్టీ, రివ్వాల్వరుతో కాల్చీ, బాకుతో పొడిచీ, కంఠం పిసికీ, దిండు మొహంమీద నొక్కి ఊపిరి సలపకుండా చేసీ—ఓహ్—ఒకటేమిటి—ఎన్ని విధాల ప్రాణాలు తియ్యడాని కవకాశంవుంటే అన్నివిధాలానూ।

పద్మ : నిజంగా నీ వూహాశక్తి—

శంక : ఊహ !....హుఁ—నెలకి నాలుగుసార్లు ఈ చెత్త రాయాల్సి వచ్చినప్పుడు మనం 'ఊహించడం' అంటూ ఒక టుంటుందా ? ఊహించడాని కసలు టైం వుంటుందా !

పద్మ : ఐతే అంతా సద్యస్ఫూర్తి అన్నమాట !

శంక : స్ఫూర్తీ లేదు కీర్తీ లేదు-ఏదో కడుపు కక్కుర్తి !

పద్మ : అసలు నీకీ ఐడియాలన్నీ ఎలా వస్తాయి శంకరం ?

శంక : దాందేముంది ? రోజూ పేపర్లో ఎవడో ఒకడి హత్య కనిపిస్తూనే వుంటుందా-పోతే పోలీస్ కేసులూ, ఇతర్లు రాసిన పుస్తకాలూ బోలెడున్నాయి ఇన్స్పిరేషన్‌కి !

పద్మ : ఎప్పుడూ సొంతంగాని రాయనన్నావు నాతో ఓసారి ?

శంక : నీతో పరిచయమైన కొత్తల్లో చెప్పివుంటా నలా.

పద్మ : ఐనా వారానికోసారి సొంతంగా ఆలోచించి రాయడం ఎవరి తరంలే! ఒక్కోసారి అసలు ఆలోచనలే తట్టవనుకుంటాను.

శంక : అంత పరిస్థితికూడా ఒక్కోసారి వస్తూనే వుంటుంది. అలాంటప్పుడు మా అవ్వ పోపుల పెట్టె తీస్తాను.

పద్మ : అదేమిటి ?

శం : ఆ తాతలనాటి పెట్టెలో మూడు డబ్బాలుమాత్రం మిగిలివున్నాయి 'ఎవర్ని' 'ఎలా' 'ఎందుకు' అని మూడు చీట్లు మూడింటిమీదా అతికించి వుంచాను.

పద్మ : అంటే ?....'ఎందుకు' అంటే——?

శంక : 'ఎందుకు' అనేది హత్యాకారణాన్ని సూచిస్తుంది. దాన్నే 'The Big why' అంటారు పాశ్చాత్య పత్తేదార్లు. అసలు 'కారణం' అంటూ ఒకటి వుండాలి తెలుసా హత్యకి ? ఐదే ఐదు ముఖ్యకారణాలున్నాయి. ప్రపంచంలో ఎక్కడ ఏ హత్య జరిగినా వీటిల్లో ఏదో ఒకటి కారణం కాక తప్పదు. ఒకటి భయం—రెండు ఈర్ష్య—మూడు ధనం—నాలుగు ప్రతీకారవాంఛ—ఐదు తను ప్రేమించేవారిని రక్షించాలనే ఆకాంక్ష. ఈ ఐదూ

ఐదు కాగితం ముక్కలమీద రాసి మడతపెట్టి ఆ 'ఎందుకు' అన్న డబ్బాలో పడేసి కళ్ళు మూసుకుని ఏదో కాగితం తీస్తాను.

పద్మ : ఇదేం రచనయ్యా బాబూ! మరీ ఇంత లాటరీ పద్ధతైతే మంచి సాహిత్యం ఎలా వస్తుందీ ?

శంక : సాహిత్యపు విలువలు ఎవరిక్కావాలి పద్మా యిప్పుడు ? నాటకం ఎంత బాగున్నా దానిమీద వాళ్ళకి ఎంత అకుంఠిత విశ్వాస మున్నా రచయిత ప్రార్థించి ప్రాధేయపడి యాచిస్తేగాని ఈ మహా మహా డైరక్టర్లు ముట్టుకోని నాటకాలూ, పబ్లిషర్లు పబ్లిష్ చెయ్యని నవల్లూ రాసేదానికంటే మనకిదే లాభసాటిగా వుంది.
[వీధిగేటు తెరిచిన కిర్రుచప్పుడు. పద్మ లేచివెళ్ళి హాలు తలుపు తెరిచి చూస్తుంది; మళ్ళీ తలుపువేసి వస్తూ—]

పద్మ : తొందరగా వచ్చేస్తే బాగుండును. ఎప్పుడు సినిమా కెళ్దామను కున్నా ఏదో అవాంతరం వచ్చిపడుతూనే వుంటుందాయనకు.... అన్నట్టు—ఆయనరాకముందే నీతో ఓసంగతి చెప్పాలి శంకరం—

శంక : ఏమిటది ?

పద్మ : మనిద్దరికీ పరిచయ మున్నట్టుకూడా ఆయనకి తెలీదు....ఇందాక నువ్వు ఫోన్ చేసినప్పుడు మద్రాసులో మా అన్నయ్య స్నేహి తుడవనీ నాటకాలూ నవల్లూ రాస్తూంటావనీ చెప్పాను.

శం : అవునూ. అందులో అబద్ధం ఏంలేదుగా !

పద్మ : [పద్మ ఏదో బాధతోనో బిడియంతోనో చెప్పలేక చెప్పలేక చెప్తుంది]....మా యిద్దరిమధ్యా ఇప్పుడు గొడవలుకూడా యేం లేవు.... ....

[శంకరం మాట్లాడకుండా ఆమె ముఖంలోకి చూస్తూంటాడు. పద్మ తలవంచుకుంటుంది—]

చాలా హాయిగా వుంటున్నాం....నామాట జవదాటడం లేదాయన ....ఇంతకంటే నే కోరదగిందికూడా ఏంలేదు........

శంక : (కొస్త వెటకారంగా చిరునవ్వుతో) ఊఁ....నేను కోరదగింది కూడా ఇహనేం లేదనుకుం

పద్మ : ఇంకోసంగతి శంకరం—

శంక : (ప్రశ్నార్థకంగా చూస్తాడు.)

పద్మ : అదసలు మర్చేపోదామనే అను న్నా—

శంక : సరే-ఇప్పుడు చెప్దామనుకున్నావుగా-చెప్పు.

పద్మ : నాకు కొన్ని వుత్తరాలు రాశావు నువ్వు. జ్ఞాపకం వుందా ?

శంక : రాశాను.

పద్మ : ప్రతి వుత్తరం చదవగానే భద్రంగా పెట్టెలోపెట్టి తాళంవేసే దాన్ని. ఒక్కటితప్ప !

శంక : చాలా దారుణంగా రాసివుంటానది. చింపి పారేశావా ?

పద్మ : లేదు. ఆపనిచేసినా బాగుండేది. ఎక్కడికెళ్ళినా నాతోకూడా తీసుకుపోయేదాన్ని. వీలుచిక్కినప్పుడల్లా ఓసారి చదువుకునే దాన్ని. ఓనాడు నేనూ వారూ అజంతా వెళ్దామని బయలుదేరాం. ప్లాట్‌ఫారంమీద రైలుకోసం వెయిట్ చేస్తూండగా నా hand bag పోయింది. ఆ వుత్తరంకూడా అందులోనేవుంది.

శంక : ఆఁహాఁ....ఎక్కడ ఇది ?

పద్మ : హైద్రాబాదు స్టేషనులోనే. ఆ పక్కన కూల్‌డ్రింక్సు షాపులో వదిలేశానేమో ననుకున్నా. వెళ్ళి చూశాగాని ఎక్కడా కనిపించ లేదు.

శంక : మరి దొరకనేలేదా ?

పద్మ : రైలు పట్టాల పక్క దొరికిందని వారం పదిరోజుల తర్వాత లాస్ట్ ప్రాపర్టీ ఆఫీసువాళ్ళు పంపించారు. కాని అందులో వుత్త రంమాత్రం లేదు. ఆతర్వాత వారం పదిరోజులకి పోస్టులో ఓ ఉత్తరం వచ్చింది. టైప్‌చేసివుంది. అది రాసినవాళ్ళ సంతకం లేదు.

శంక : ఊఁ....?

పద్మ : ఆ పోయిన వుత్తరం కావాలంటే నేనేం చెయ్యాల్సిందీ రాశా రందులో.

శంక : ఏం చెయ్యాలట?

పద్మ : ఏదో అడ్రసిచ్చారు. రెండువందలు-రూపాయికాగితాల్లోనే వుం డాలట—పార్శిలుచేసి ఆ అడ్రసుకు పంపాలట. ఈ సంగతి యింకెవరికైనా చెప్తే వెంటనే ఆ వుత్తరం మావారికి చూపిస్తా మనికూడా బెదిరించారు.

శంక : ఇంకా వుందా ఆ వుత్తరం నీ దగ్గర ?

(పద్మ తల వూపుతుంది)

ఏదీ - ఓసారీ నన్ను చూడనీ.

[పద్మ లేచి పడకగదిలోకి వెల్తుంది శంకరం లేచి కాస్త ఆందో ళనతో అటూ యిటూ పచార్లు చేస్తూంటాడు. టేబులుమీది సిగరెట్ పెట్టెలోంచి సిగరెట్ తీసి ముట్టిస్తాడు.

ఇంతలో పద్మ పడకగదిలోంచి ఒక తెల్లనికవరు తీసుకువస్తుంది వస్తూ వస్తూ బ్రాకెట్‌లైట్స్ స్విచ్ ఆన్‌చేసి కవరు శంకరాని కిస్తుంది. అతను తీసుకుని కవరులోంచి ఉత్తరం తీసి పరిశీలిస్తాడు....]

ఊఁ....!

శంక : (కవరుమీది పోస్టుముద్రలు చూస్తూ) సీతాఫలమండిలో పోస్టు చేశారు. (మళ్ళీ వుత్తరం చదువుతాడు-) రెండువందల రూపాయి నోట్లూ కట్టగట్టి పార్సిలు చేసి S. లోడీఖాన్. కేరాఫ్ A S. రామయ్యర్, నెం. 25, సీతాఫలమండీ, సికింద్రాబాద్ అనే అడ్రసుకు పంపిస్తే మీ వుత్తరం మీకు తిరుగు టపాలో జేరు తుంది·"....డబ్బు పంపించావా నువ్వు ?

పద్మ : పంపించాను. కాని ఉత్తరం మాత్రం రాలేదు. పది పదిహేను రోజులు దానికోసం చూసి చూసి నేనే ఓ పూట ఆ అడ్రసుకు వెళ్ళాను. అదొక లాడ్జ్. ఆ పేరుగల మనిషెవరూ రాలేదన్నారు. నే పంపిన పార్సిలుకూడా ఎవరూ వచ్చి తీసుకోలేదట.

శంక : తమాషాగానే వుందే! (కవరు జేబులో పెట్టుకుంటూ) నాదగ్గర అట్టేపెడతానిది....ఫణికేం తెలీదుగా ఈ గొడవ ?

పద్మ : అమ్మో. ఆయనికి తెలిస్తే ఇంకేమైనా వుందా ? ఇంకెవళ్ళకీ కూడా చెప్పలేదు. ఇంతా చేసి వాడు డబ్బెందుకు తీసుకోలేదో నా కర్థం కావడంలేదు.

శంక : బహుశా అప్పటి కింకే దొంగతనం చేశో జైల్లోపడి వుంటాడు! మళ్ళీ నీకేం వుత్తరం రాలేదుగదా ?

పద్మ : లేదు.

శంక . ఊఁ....ఇందుకేనా యేమిటి నన్నిహ వుత్తరాలు రాయవద్దన్నావ్.

పద్మ : మరే, నిజంగా భలే భయంవేసింది. ఆ నాలుగురోజులూ కాళ్ళూ చేతులూ వణికిపోయాయి.

శంక : అసలప్పుడే నా కెందుకు రాయలే దీసంగతి ?

పద్మ : రాసి ప్రయోజనం ? అదీగాక - వెధవది రెండు వందలేగదా-అవ తల పారేస్తే పోతుంది లెమ్మనుకున్నాను.

[ఇద్దరూ కాస్సేపు మౌనం]

శంక : అసలు మనం మొదట్లో అనుకున్న ప్రకారం అప్పుడే ఏమద్రాసో బొంబాయో——

పద్మ : [అదిరిపడి] శంకరం!....వొద్దు శంకరం - మళ్ళీ ఆ పాతసంగ తులు నాకు జ్ఞాపకం చెయ్యకు....

శంక : ఎందుకని? ఈ దాగుడుమూతలు ఈ దొంగచాటు వ్యాపారంకంటె అది ఎంత మేలు ?

పద్మ : ఇహ నా జీవితంలో వాటికి చోటులేదు. అవంతా ఓ పీడకల. ఆ రోజులు మర్చిపోయి యేడాదైంది....ఈ యేడాదినుట్టీ ఆయన చాలా మారిపోయారు శంకరం....నన్నొదిలి వుండలేరు. ఆనాట కాలూ వేషాలూ అన్నీ మానేశారు. నేనంటే ఇప్పుడు ప్రాణం ఆయనకి....ఆ రాత్రి జ్ఞాపకం వుందా నీకు - తెల్లారితే నువ్వు మెడ్రాసు వెళ్ళిపోతావనంగా నీ రూముకి వచ్చాను——

శంక : అవును-ఆరాత్రి నేనెలా మర్చిపోగలను ? ఫణి మనకు చాలా సహాయంచేశాడుకూడానూ తనకేదో నాటకం రిహార్సల్సు వున్నా యని వెళ్ళిపోయి !

పద్మ : వెళ్ళిపోయారు. కాని మళ్ళీ వెంటనే వచ్చేశారు. ఈ సంగతు లన్నీ ఎలా రాయాలో నా కర్థంకాక నీకు రాయలేదు. ఆ రాత్రి సరాసరి నీదగ్గర్నుంచి ఇక్కడకు వచ్చేశాను. సోఫాలో పడుకుని కరువుదీరా ఒక్క యేడుపేడ్చి అలానే నిద్రపోయాను. తెలివి వచ్చి కళ్ళు తెరిచి చూసేసరికి ఎదురుగుండా ఆయన నిలబడి వున్నారు. నాటకం పుస్తకం చించి పక్కన పోగులు పెట్టివుంది. ఇహ నాటకాలు మానేశాను పద్మా అన్నారు.

శంక : అదేం నాటకమో!

[పద్మ కాఫీ కప్పులు వంటయింట్లో పెట్టి వస్తుంది.]

పద్మ : అవును ముందు నేనూ నాటకమే అనుకున్నా. అబ్బ—ఆయన వెనకే కొంగు ముడేసుకుని తిరిగి తిరిగి దుంప తెగిపోయేది నాకు. అంతూపొంతూలేని నాటకాలు! కాని ఆరోజు ఆయనన్న మాట నిలబెట్టుకున్నారు. ఇంతవరకూ మళ్ళీ నాటకం వెయ్యలేదు. మర్నాడే. వెళ్ళి మంచి ఉద్యోగంకూడా సంపాదించారు శంకరం!

[ఎక్కడో క్లాక్‌టవర్ గంటలు కొడుతుంది]

శంక : సరిగ్గా....ఇవ్వాల్టికి యేడాది........

[హాలు తలుపు బీగంలో తాళంచెవిపెట్టి తిప్పిన శబ్దం. ఇద్దరూ ఇటు తిరుగుతారు. తలుపు తెరుచుకుని ఫణి లోపలికి వస్తాడు. వయస్సు 34 సం॥ మనిషిలో మంచి ఆకర్షణ వుంది. అతి చలాకీగా అతి ధీమాగా వుంటాడు ఎప్పుడూ.]

పద్మ ; అబ్బ-వచ్చారా బాబూ. ఇహ నీపూటకి రారనే అనుకుంటున్నాం....ఇంత ఆలస్యమైందేమండీ ?

ఫణి : సారీ డియర్. గుమ్మంలో అడుగుపెట్టేసరికి ఎదురుగ్గా ప్రత్యక్షమయ్యాడు మా సీనియర్ ప్రొప్రయిటరు.

[ఫణి కోటుతీసి చిలకకొయ్యకు తగిలిస్తూంటాడు. శంకరం కాస్త మొహమాటపడి ఇటు తిరిగి నిలబడతాడు]

పద్మ : వీరు....వీరేనండీ శంకర్రావుగారు—మా అన్నయ్య ఫ్రండ్—మెడ్రాసునుంచి నిన్న వచ్చారని చెప్పానూ—!

ఫణి : ఓ! వెరీ గ్లాడ్ టు మీట్ యు!

ఫ ణి

శంక : (కరచాలనం చేస్తూ) మీ పేరు నాకు తెలుసు—ఫణీ!

ఫణి : క్షమించాలిసార్ నా ఆలస్యానికి. మా పద్మ మీకేం లోపం చెయ్యడంలేదుగదా?....కాఫీ ఐనా ఇచ్చిందా?

శంక : ఓ యస్. థాంక్యూ.

[పద్మ మరో గ్లాసులో కాఫీపోసి తెచ్చి ఫణికి ఇస్తుంది]

ఫణి : ఊఁ....హైద్రాబాదెలా వుందీ?....ఇదే మొదటిసారా మీ ఠిక్కడికి రావడం?

శంక : లేదు-ఏడాది కిందటోసారి ఫ్రండ్స్‌తో కలిసివచ్చాను.

ఫణి : ఆఁ ఆఁ అవునట. పద్మ చెప్పింది. మీరు నవలా రచయితలు కూడానట?

శంక : ఖర్మగాలి నాటకాలుకూడా రాస్తూంటాను. ప్రస్తుతం రేడియోలో కథ ఒకటి చదవడానికి పిలిపిస్తే వచ్చాను.

ఫణి : ఓ-అలాగా!....ఊఁ....ఉంటారా నాలుగురోజులు?

శంక : అప్పుడే చెప్పలేనండీ. ఎల్లుండి ఈ ప్రోగ్రాం అయిపోతుంది. తర్వాత రెండు నాటికలు వ్రాసి వాళ్ళకే ఇవ్వాలి. అది కాస్తా ఐపోతే అలా అజంతా ఎల్లోరా తిరిగివద్దామని వుంది.

ఫణి : బాగానేవుంది. కాని టైమంతా ఆ అడవుల్లో కొండగుహల్లో వేస్టు చెయ్యకండి. నా వుద్దేశంలో మచ్చుకు ఒకటి చూస్తేచాలు. మొత్తం చూసినట్లే. బోటుషికారంటే మీ కిష్టమేనా?

శంక : లేదు....అంటే—

ఫణి : హుసేన్ సాగర్‌లో చిన్న దోనె తీసుకుని తెడ్లువేసుకు నడుపుతుంటే—

పద్మ : అబ్బే—అసలు నీళ్ళంటేనే భయమండీ ఇతనికి!

ఫణి : ఓహో....సరే—వూళ్ళో ఎక్కడైనా తిరగాలనిపించినప్పుడు మటుకు చెప్పండి. (పద్మతో) ఏం పద్మా, సాలర్‌జంగ్ మ్యూజియంకు తీసుకుపోతే మీ ఫ్రెండ్‌ని ?

శంక : అది నిన్ననే చూశానండీ.

ఫణి : ఓ—వాటే షేమ్ ! నాకుమటుకు అది ఎన్నిసార్లు చూసినా మళ్ళీ మళ్ళీ చూడాలనే అనిపిస్తుంది. ముఖ్యంగా నవరత్నాల పిడిగల బాకు ఒకటుంది-సురాజుద్దౌలాదట—

పద్మ : ఏమండీ మనకి టైమైపోవడంలే ?

ఫణి : ఒక చిన్న సవరణ పద్మా అనుకున్న ప్రోగ్రాంలో.

పద్మ : మీరు రావటానికి వీల్లేదని మాత్రం అనకండీ మీకు పుణ్యం వుంటుంది.

ఫణి , వచ్చిన గొడవే అది ! రేపు మా ప్రొప్రయిటరు ఢిల్లీ వెళ్తున్నాడు ఆఫీసు తాలూకు బిజినెస్ స్టేట్‌మెంట్స్ కొన్ని తయారుచేసి పొద్దున్నే అందించాలాయనకి !

పద్మ : సినిమానుంచి వచ్చిన తర్వాత చేసుకోగూడదూ ఆ పని ?

ఫణి : సారీడార్లింగ్. తెల్లార్లూ పట్టినా పట్టొచ్చు.

పద్మ : మరి....(శంకరంవంక చూస్తుంది)

శంక : పోనీ మానేద్దాం.

ఫణి : No! No! No! పొద్దున్నుంచీ ఎదురుచూస్తున్న ప్రోగ్రాం మానుకోవడం యెందుకు ? మీ రిద్దరూ వెళ్ళిరండీ.

శంక : సరదాగా అంతా కలిసి వెళ్దామనుకున్నాం అంతేగాని మిమ్మల్ని వదిలేసి పోవాల్సినంత పెద్ద సినిమా యేం కాదులేండి.

ఫణి : సీట్సుకూడా మధ్యాహ్నమే రిజర్వ్ చేశాను. ఎవళ్ళం వెళ్ళకపోతే వేస్ట్ ! ఇవిగో టిక్కెట్లు.

శంక : (కప్పిపుచ్చుకున్న ఆత్రుతతో తీసుకుంటూ) థేంక్స్.

ఫణి : నేను రాలేకపోతున్నందుకు క్షమించాలి.

శంక : మీరు రాకుండా వెళ్ళడం నాకూ ఏం బాగులేదు. కానివ్వండి ఏం చేస్తాం - వుద్యోగ ధర్మం కదా ! ఐనా మిమ్మల్ని పక్కన కూర్చోబెట్టుకు చూస్తే ఏం ప్రయోజనం -

[ఫణి వున్నట్టుండి కాస్త కొయ్యబారుతాడు]

పద్మ : (ఫణివంక శంకరం చూసి కాస్త కలవరపడి కప్పిపుచ్చుకుంటూ) అదేమిటండోయ్ - మీపక్కన కూర్చోడానిక్కూడా కొన్ని అర్హతలుండాలా యేమిటి ?

శంక : ఛా ఛా - అదికాదు నా వుద్దేశం. నాటక రంగంమీద ఇంత పేరు గడించుకున్నవార్ని రంగంమీదనే చూడాలని నా అభిలాష !

పద్మ : (నవ్వుతూ) అంతేకద !

ఫణి : (సడలి, నవ్వుతూ) నా వేషం ఎప్పుడైనా చూశారా మీరు ?

శంక : ఆ అదృష్టానికి నోచుకోలేదు. అసలు మీకు మొన్న మొన్న పరిషత్తు పోటీల్లో ప్రైజు వచ్చిందని పేపర్లలో చదివేదాకా మీరు నటులని నాకు తెలీనేతెలీదు. ఈసారి ఏదైనా ప్రోగ్రాం వున్నప్పుడు తప్పకుండా చూడాలని వుంది.

ఫణి : (నిస్పృహతో ఓసారి నిట్టూర్చి) క్షమించండి - ఆ రంగానికి స్వస్తి చెప్పాను.

శంక : అదేం ?

ఫణి : పాపం మీలాగానే నా కోసం నా నటనకోసం నా కళావైదుష్య ప్రదర్శన కోసం ఎదురుచూసే ప్రేక్షకులూ ఫాన్లూ చాలామంది వున్నారు. ఇప్పటికీ రోజు కో ఎసోసియేషను వాడు కాళ్ళావేళ్ళా

బడుతూనే వున్నాడు. ఒక్క నాటకం డైరెక్ట్ చేసిపెట్టమని! కానీ- ప్చ్....లాభంలేదు. ఆఫీల్డు వదిలేశాను....అన్నట్టు - రేపురాత్రి మీ కేమైనా ఎంగేజ్‌మెంటుందా ?

శంక : రేపు గురువారం కదూ ?....లేదు

ఫణి : ఐతే రేపు సాయంత్రమే ఇక్కడికి రండి. రేపురాత్రికి మన శిష్యులదే నాటకం ఒకటుంది. ఇక్కడ భోజనం చేసి వెళ్దాం.

పద్మ : అసలు ఈ పూటే భోజనానికి వుండమనికి బ్రతిమాలానండీ- ససేమిరా వుండనంటున్నాడు.

ఫణి : మా ఆవిడ చాలా బాగా చేస్తుందండీ వంట. ఆంధ్రప్రభ శిష్యురాలు!

శంక : ఐతే అసలు రానుబాబూ నేను.

పద్మ : అబ్బ పోండీ మీ జోక్స్‌కి వేళాపాళా లేదు.

ఫణి : మీరు రేపు తప్పకుండా రావాలి.

పద్మ : మొహమాట పడకు శంకరం.

శంక : (నవ్వుతూ) ఇంత బలవంత పెట్టించుకోవడం నా కలవాటు లేదు సరే కానీండి.

ఫణి : కాని పద్మమటుకు నాటకానికి రాదు.

శంక : అదేం మళ్ళీ ?

ఫణి : ఆవిడ వ్రతం పట్టిందిలేండి.

శంక : (పద్మతో) ఏమండీ ?

పద్మ : (నవ్వుతూ) అవును. ఆ నాటకాల వెంబడిపడి నే తిరిగిన తిరుగుడు మీకేం తెలుసు ? విసుగెత్తిపోయేది. ఓసారి వొళ్ళుమండి నాటకాలు మరి చూడనని ఒట్టుపెట్టుకున్నాను.

ఫణి : మరి మనిద్దరమే పోవాల్సి వుంటుంది. వస్తారు కదూ?

శంక : ఓయస్....కాని నాదో ప్రపోజలుంది. మీరిప్పుడు మాతో సినిమాకి రాలేకపోతే సినిమా ఆఖరయ్యే టైముకైనా హాలుదగ్గరకు రావాలి. అక్కణ్ణుంచి ముగ్గురం కలిసి తాజ్ హోటలుకు వెళ్దాం. అక్కడ డిన్నరు—ఆన్ మై ఎకౌంట్!

పద్మ : అవునండీ—ఇది చాలా బాగుంది. అప్పటికీ మీ ఆఫీసుపని కాకుంటే మళ్ళీవచ్చి చూసుకోవచ్చు. మధ్య కాస్త రిక్రియేషన్‌గా వుంటుంది కూడానూ.

ఫణి : (ఓ క్షణం ఆలోచించి) ఆల్‌రైట్!

శంక : థేంక్స్.

ఫణి : (వాచీ చూసుకుని) మరి-మీకు టైం అవుతోంది.

పద్మ : సినిమా అయిపోయేముందు ఫోన్ చేస్తాను. వెంటనే బయల్దేరి వస్తారుగా?

ఫణి : సరేనన్నానుగా. పదండి మరి-హరీయప్.

[పద్మా, శంకరం బైటకు వెళ్తారు]

ఫణి : (బైటకు తొంగిచూసి) మిస్టర్ శంకరం!

శంక : (బైటనుంచి) యస్?

ఫణి : ఆ మూడో టిక్కెట్టు వుంది చూశారూ—అదికాస్తాఅమ్మెయ్యండి రెండు డ్రింకులు తాగొచ్చు.

పద్మ : (బైటనుంచి) చాల్లే వూరుకుందురూ మీరు మరీనూ.

శంక : (బైటనుంచి) సరేలే—ఒక కప్పుకాఫీకోసం ఈ కవులుపడే కక్కుర్తి నీకేం తెలుసు! అచ్ఛా—

[ఫణి తలుపువేసి తాళం నొక్కుతాడు. గోడనున్న బ్రాకెట్ లైట్లు స్విచాఫ్‌చేస్తాడు. తోటవాకిలి తెరలు లాగి మూసేస్తాడు.

టేబుల్‌లైటు ఆన్‌చేసి టెలిఫోను వైపు తిరుగుతాడు. దానివంక ఓ క్షణం చూసి, రిసీవరు యెత్తి ఒక నంబరు డయల్‌చేస్తాడు. కొద్ది అవకాశంతో ఫోన్‌లోంచి గజపతి కంఠస్వరం వినిపిస్తుంది—]

గజ : హలో !

ఫణి : హలో-6337 ?

గజ : అవును.

ఫణి : ఆఁ—గజపతిరావుగారితో మాట్లాడాలి....

గజ : మీరు మాట్లాడుతున్నది వారితోనే !

ఫణి : ఓ-గుడీవెనింగ్ ! నన్ను మీ రెరుగరు. నాపేరు పరమేశ్వరం.... మీ కారేదో అమ్ముతారని విన్నాను....

గజ : అవును. మెర్క్యురీ '53.

ఫణి : అదే. పొద్దున గరాజ్‌లో చూశాలేండి. ధర ఎంతలో వుంది ?

గజ : ఆరువేలు.

ఫణి : ఆరువేలు !....ఓ....ఐసీ....కారైతే నాకు నచ్చిందిగాని....ధరే బాగులేదు.

గజ : నేను కొన్నప్పుడు నాకూ అలాగే అనిపించింది.

ఫణి : (నవ్వి) మరి....మన మెప్పుడు కలుసుకుందాం ?

గజ : రేపు సాయంత్రం రండీ.

ఫణి : సారీ-ఆటైము నాకు కుదరదు. (కాస్త ఆలోచించి అంటున్నట్టు) ఉఁహుఁ-లాభంలేదు. ఎల్లుండి శనివారం-అసలే కుదరదు.... పోనీ ఇవ్వాళే మా యింటికి రారాదూ మీరు ?

గజ : ఎక్కడది ?

ఫణి : ఖైర్‌తాబాద్ నేనే వచ్చేవాణ్ణిగాని కాలుకాస్త బెణికిందీ....

ఫ ణి

గజ : సరే - అడ్రసు చెప్పండి.

ఫణి : 39 A. ఫతీమా గార్డెన్స్.

గజ : 39 A. ఫతీమా గార్డెన్స్.

ఫణి : దట్స్‌రైట్. బస్‌స్టాప్ దగ్గర దిగంగానే ఎడమప్రక్కకు తిరగండి రెండు నిముషాల నడక.

గజ : సరే ఓ గంటలో వస్తాను.

ఫణి : వెరీగుడ్ (ఆదుర్దాతో) అన్నట్టు కారులో వస్తారా మీరు ?

గజ : నోసర్. పైరు ఒకటి కొత్తది వేయిస్తున్నాను....

ఫణి : ఫరవాలేదు పొద్దున చాగానే చూశాలేండి....ధరే కాస్త తగ్గిస్తే వ్యవహారాలన్నీ ఇక్కడే పూర్తి చేసుకోవచ్చు మనం.

గజ : దయచేసి ధర తగ్గించే ప్రసక్తిమటుకు తీసుకురాకండి.

ఫణి : సరే రండి.... తప్పకుండా వస్తారుగదూ ?

గజ : ఓ ఝస్.

ఫణి : గుడ్‌బై ఫర్ ది ప్రజంట్.

గజ : గుడ్‌బై (ఫోన్ పెట్టేస్తాడు)

ఫణి : (రిసీవరు దించేసి) హుం ! (పెదవి విరిచి వికృతహాసంచేస్తూ) గజపతిరావు !

[లైట్స్ ఫేడవుట్]

లైట్స్ ఫేడిన్

[సమయం సుమారొక గంటతర్వాత. గదిలో టేబుల్ లైటు వెల్తురే వుంది. స్టూలు మీద కొంచెంపెద్దసైజు చేతిరుమాళ్లు రెండు పడివుంటాయి.

ఫణి పడక గదిలోంచి పాత లెదర్ సూట్ కేస్ ఒకటి తీసుకు వచ్చి జాగ్రత్తగా గోడపక్కన పెడతాడు. చేతిరుమాళ్ళవంక ఓ క్షణం చూసి, అవి తీసి నీటుగా సోఫా చేతిమీద వుంచుతాడు. ఒకసారి తన ఎరేంజిమెంట్సు, ఎఫెక్టు చూసుకుని సంతృప్తి చెందుతాడు. తిరిగి పడకగదిలోకి వెళ్ళబోతూండగా హాలుతలుపు తట్టినశబ్దం. ఫణి ఆగి, వెనుదిరిగి, తెచ్చిపెట్టుకున్న కుంటి నడకతో వెళ్ళి తలుపు తెరుస్తాడు.
గజపతి బైట నిలబడి వుంటాడు.]

గజ : పరమేశ్వరంగారు....?

ఫణి : అవున్నేనే, మీరు గజపతిరావుగారను కుంటాను.

గజ : యస్, ప్లీజ్.

ఫణి ; లోపలికి రండీ. దిసీజ్ వెరీ గుడ్ ఆఫ్ యు. ఆ కోటు ఇలా యివ్వండీ దీనికి తగిలిస్తాను.

[గజపతి లోపలకొచ్చాడు. ఫణి అతని కోటు తీసుకుని కోట్ స్టాండ్ కు తగిలించి. హాలు తలుపు వేస్తాడు-]

ఇల్లు కనుక్కోడంలో ఇబ్బందేమైనా పడ్డారా?

గజ : అబ్బే - ఏంలేదు.

ఫణి : కూర్చోండీ.

గజ : (కాని కూర్చోడు)....మిమ్మల్నెక్కడో చూసినట్టున్నాను .... గుర్తురావడం లేదుగాని....

ఫణి : (ఖటిక్కున తలయెత్తి చూసి) మీకూ అలాగే అనిపించడం తమాషాగానే వుంది. నిజానికి గుమ్మంలో మిమ్మల్ని చూచిన క్షణంనుంచి నేనుకూడా....(గబిక్కున ఆగి) గజపతా ? నీపేరు గజపతికాదే....ఆఁ-రవీంద్రం ! రవీంద్రంకదూ నీపేరు ?

గజ : నాకంటే మంచిజ్ఞాపకమే వుందినీకు. కాని....పరమేశ్వరమా?.... ఎక్కడ మన పరిచయం ?

ఫణి ; బందరు నేషనల్ కాలేజీలో చదివావుకదూ ?

గజ : చదివానూ.

ఫణి : అవును పదిహేను సంవత్సరాలనాటి సంగతి. నీకు జ్ఞాపకం వుండివుండనులే. నువ్వు సెకండియర్‌లో వుండగా కాలేజీలో ప్రవేశించాను నేను.

గజ : ఓ-అలాగా !

ఫణి : అయితే చిన్నపార్టీ జరిగి తీరాల్సిందే ఇప్పుడు. ఏదోకాసిని కాఫీ నీళ్ళుపోసి పంపించేద్దామనుకున్నా.

[పడక గదిలోకి వెళ్ళి ఒకస్కాచ్ హ్విస్కీ బోటిల్, రెండు గ్లాసులూ పట్టుకొస్తాడు. హ్విస్కీసీసా యెత్తి చూపుతూ–] ఎలా వుంటుందిది నీకు ?

గజ : అబ్బ - దాన్ని చూపించకయ్యా - అసలు కదల్లేనిక్కణ్నుంచి. (సోఫాలో కూర్చుంటూ) అవునూ - నాకారు అమ్మేస్తున్నానని ఎలా తెలిసింది నీకు ?

[ఫణి రెండుగ్లాసుల్లోనూ హ్విస్కీపోసి సీసా టేబులుమీద పెట్టి వస్తాడు జవాబిచ్చేముందు.]

ఫణి : ముందు మూడు పెగ్గులన్నా పడందే బిజినెస్‌లోకి దిగన్నేను.

గజ : (నవ్వుతూ) తాగినా తాగకపోయినా బేరం విషయంలో మాత్రం నేను బెసకను సుమా.

ఫణి : సరిగ్గా నా తత్త్వంకూడా అదే!

[ఇద్దరూ నవ్వుకుంటారు]

గజ : ఈ మధ్యకూడా నిన్నెక్కడో చూసినట్టు జ్ఞాపకమయ్యా నాకు?

ఫణి : ఇక్కడ నేషనల్ థియేటర్లో నాటకాలేమైనా చూసేవాడివా ?

గజ : అద్గది! ఫణి-ఫణిభూషణరావు!....మరి....మరి యీ పరమేశ్వరావతారం యేమిటి ?

ఫణి : (ఎత్తిపొడుపు చూపుతో) ఈ గజపతి వేషం యేమిటి? (గజపతి కలవర పడతాడు) ఫస్టాసయిన చుట్ట లున్నాయి-కాలుస్తావా ఒకటి ?

గజ : అక్కర్లేదు. పైప్‌వుంది.

ఫణి : ఐతే ఆ అలవాటొకటి మారిందన్నమాట!

[ఫణి గోడదగ్గరకు పోయి గ్రూప్‌ఫొటో ఒకటి తీసుకు వస్తాడు]

కాలేజీలో ఎప్పుడూ స్పెన్సర్ చుట్టలు కాలుస్తూండే వాగివని నాకు బాగా జ్ఞాపకం. ఇక్కడెక్కడో నువ్వుకూడా వుండాలి. ఇదుగో-(ఫోటో అతనికి చూపుతూ) ఓల్డ్ బోయిస్ మీటింగ్ ఫొటో ఇది. ఫోటోలోకూడా ఆచుట్ట వదిలిపెట్టలేదు నువ్వు.

గజ : (నవ్వుతూ) అదే నేను వెళ్ళొచ్చిన మీటింగల్లా! అబ్బ - మరీ ఖూనీకోర్‌లా వున్నట్టున్నాను!

ఫణి : (సన్నగా నవ్వుతూ) అప్పటికింకా అంతవాడవు కాలేదనుకుంటాను. డ్రెమెటిక్ ఎసోసియేషన్‌కి ఏదో డ్రెజరర్‌వి మాత్రమే కదూ ?

గజ : ఆఁ. ఆనరరీ. దరిద్రగొట్టు వుద్యోగం.

ఫణి : అప్పుడొకసారి నాటకం వేసింతర్వాత క్యాష్ అంతా ఎవరో ఎత్తుకుపోయినట్టుకూడా జ్ఞాపకం నాకు.

గజ : అవును దగ్గిర దగ్గిర ఆరొందలు. అంతా లెక్క-బెట్టి డబ్బాలో పెట్టి కాలేజీలోనే క్లబ్‌రూంలో వుంచాను. తెల్లారేసరికి గయా మార్ !

ఫణి : వాచ్‌మేన్ కొడుకు అంజిగాడు కదూ తీసింది ?

గజ : వాడే, ఆ డబ్బాకూడా వాడి పాకవెనకాలే దొరికింది.

ఫణి : కాని డబ్బుమాత్రం దొరకలేదు.

[గజపతి అందించిన ఫొటో తీసుకుని టేబులుమీద వుంచుతాడు]

గజ : (మాట తప్పించాలని) సరేగాని - ఇప్పుడు నువ్వేమైనా నాటకాలు వేస్తున్నావా ?

ఫణి : లేదు మానేశాను....చిన్న వుద్యోగం చేస్తున్నా. నూటయాభై యిస్తారు.

గజ : అదేం ? బోలెడు టాలెంట్ వుంది - పేరు ప్రతిష్టలు సంపాదించావ్ - అమెచ్యూర్స్‌లోనే ప్రొఫెషనల్ యాక్టరువుకూడా అయ్యావ్....

ఫణి . అదో గాథ !

గజ : ఊఁ....(గదిచుట్టూ చూసి) మొత్తానికి....తాహతుకి మించిందే అయినా చాలా బాగుంది యిల్లు.

ఫణి : మా ఆవిడకు వాళ్ళ తాతగారు రాసిచ్చిపోయిన ఆస్తి వుంది. లేకపోతే రెండువేలు పోసి నీ కారెలా కొంటాననుకున్నావ్ ?

గజ : అరువేలు!....ఆస్తిమంతులు - మీకేవ(య్యా -అదృష్టవంతులు! నామటుకు నాకు రెక్కాడితేగాని డొక్కాడదు.

ఫణి : (నర్మగర్భంగా) ఎవతెనైనా ఆస్తిమంతురాల్ని చూసి పెళ్ళి చేసుకోవచ్చుగా.

గజ : (అర్థం చేసుకోక) అవును....ఆ వ్యాపారం చేసేవాళ్ళుకూడా వున్నారు.

ఫణి : (నిర్వికారంగా) నా మటుకు నేను అదే చేశాను.

గజ : (పరిహాసంగా తీసుకుని నవ్వుతూ) నువ్వు ప్రేమించి పెళ్ళి చేసుకున్న పిల్ల ఆస్తిమంతురాలు కావడం సంభవించిందనా నీ వుద్దేశం?

ఫణి : కాదు. డబ్బుకోసమే పెళ్ళి చేసుకోవాలని మొదట్నుంచీ నా అభిప్రాయం. నువ్వు చదువు మానేసి వెళ్ళిపోయాక కాలేజీలో బాగా నాటకాలేశాను. డబ్బున్న ఆడపిల్లలంతా నా చుట్టూ మూగేవాళ్ళు. నాలోనే దిలీప్‌కుమార్‌నీ నాగేశ్వరరావునీ చూసుకునేవారుకాబోలు ....తర్వాత బైట....పొరుగూళ్ళల్లోకూడా నాటకాలాడేవాణ్ణి పరిషత్తుల్లో పాల్గొన్నాను - పోటీల్లో గెల్చాను - లెక్కలేనంతమంది శిష్యుల్ని జేరదీశాను - నాదొక యుగం అన్నారు. మొత్తానికి నన్నో విశిష్ట వ్యక్తిగా చూసేవాళ్ళు....దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకుందామనుకున్నాను. ఆడపిల్లలంటే లక్ష్యంలేనట్టు నటించి వలలుపన్నే వాణ్ణి....ఓసారి ఓలక్షాధికారికూతుర్ని పట్టాను. చాలా దూరం పోయింది వ్యవహారం. మా యిద్దరి బొమ్మలూ వూళ్ళో గోడలమీదకూడా యెక్కాయి....అంతలోనే అదృష్టం తిరిగిపోయింది - మరో లక్షాధికారి కొడుకుని గుట్టుచప్పుడు కాకుండా చేసుకుంది ముండ! డబ్బుకీ డబ్బుకీ బలేలంకె!....

గజ : లేకపోతే నీ పిచ్చిగాని - నాటకాలవాళ్ళ నెవరు పెళ్ళి చేసుకుం టారు ఫణీ చూస్తూ చూస్తూ ?

ఫణి : (గిఱ్ఱున అతనివైపు తిరిగి) నేన్సు నటరాజనోయ్! నా కళకూ నా అందానికీ నా ప్రజ్ఞకూ ముగ్ధులు కానివాళ్ళెవరు? అసలు మా ఆవిడ మా ఆవిడ కాకముందు రెండేళ్ళనుంచీ నావెంటబడి తిరుగుతూండేది తెలుసా? ఎక్కడ నా నాటకంవుంటే అక్కడ ప్రత్యక్షం! నేనంటే పడి చచ్చేది!

గజ : (తానిందాక అన్నమాట పరిహాసాని కన్నట్టూ ఇంకా తానా ధోరణిలోనే వున్నట్టూ ఇకిలిస్తూ) మరి నువ్విప్పుడా కళా నాటకాలూ వదిలేశావ్ - ఆవిడింకా నిన్ను వదిలిపెట్టలేదేం?

ఫణి : అంతపనీ అయింది.

[అంతలోనే కాలినొప్పి నటిస్తూ బాధతో మళ్ళీ లేవబోతాడు]

గజ : (తనులేస్తూ) నే లేస్తాలేవోయ్ - ఏం కావాలి?

ఫణి : థేంక్స్. ఆ బోటిల్ ఇలా అందుకుంటే బాగుంటుందనుకుంటాను

గజ : తప్పకుండానూ.

[గజపతి హ్విస్కీ బోటిల్ తీసుకొచ్చి రెండు గ్లాసులూ నింపు తాడు. నింపుతున్నంతసేపూ ఫణి అతన్ని పరిశీలించి చూస్తూనే వుంటాడు.]

ఫణి : అది నీకు వినాలని వుందా?

గజ : ఏది?

ఫణి : నా భార్య విషయం. అది నన్ను వొదిలిపెట్టి వెళ్ళిపోయినంత పనీ ఎలా జరిగిందీనూ!—

గజ : నువ్వు హోస్టువి. నీయిష్టం మరి!

ఫణి : నిజం చెప్పాలంటే నువ్వు చెయ్యగలిగిన సాయం కూడా లేక పోలేదు....ఏంలేదు-మనిషికి మనిషి ఊత-అంతే !

గజ : తప్పకుండానూ.

ఫణి : నాకు పెళ్ళయింది. తర్వాతకూడా ఎడాతెరిపీ లేకుండా నాటకాలు! కొన్నాళ్ళు అదికూడా నాతోటే తిరిగింది. వెనకటిలాగే చాలా మెచ్చుకునేది. ఒక్కోసారి మేకప్ తీయనిచ్చేది కాదు. అలానే ఇంటికి పోదామనేది. నిద్రలో నన్ను పొదివి పట్టుకుని దిలీప్ దిలీప్ అనీ అశోక్ అనీ కలవరించడంకూడా రెండుమూడుసార్లు విన్నాను.

గజ : అబ్బ - మరీ ఘోరం భాయీ నువ్వు—

ఫణి : (వికారంగా శుష్కహాసంచేసి) హుఁ-....ఓ సారి ఓ నాటకంలో హీరోయిన్‌కూ నాకూ మధ్య స్కాండల్ రేగింది. అప్పట్నుంచీ నాటకాలు మానెయ్యమంది. ఇంట్లో మొగుడి పాత్ర సరిగా నిర్వాకం చేస్తేచాలు నన్నట్లు మాట్లాడేది. మాటామాటావచ్చింది. పోట్లాడుకున్నాం. దెబ్బలాడుకున్నాం. మా యిద్దరిమధ్యా ఓపెద్ద అగాధం ఏర్పడింది. చీటికి మాటికీ చూసి రావాల్సిన స్నేహితురాళ్ళు మరీ ఎక్కువయ్యారు. ఓసారి మూడురోజులు క్రమం తప్పకుండా సాయంత్రంపూట ఎక్కడికోపోయి రాసాగింది. నాలుగోనాడుదానిక్కనిపించకుండా నే వెంబడించాను. హుస్సేన్ సాగర్‌దాకా వెళ్ళి ఒకచిన్న డాబాలోకి వెళ్ళింది. ఇంటిచుట్టూ గార్డెన్-చక్కని పూలచెట్లు-చాలా రొమాంటిక్‌గా వుంది వాతావరణం....కిటికీలోంచి తొంగిచూశాను....అక్కడో అబ్బాయి వున్నాడు...బాగానేవున్నాడు....వాడూ-అదీ...ఎదురుగాకూర్చున్నా ఇద్దరూ అతికినట్లు చాలా సహజంగా కనిపించారు నాకు. ప్రేమికుల్ని గుర్తించడం చాలా తేలిక! నేను వెనక్కి తిరిగి నడవ

సాగాను. దానిమీద నేను ఎంత ఆధారపడి వున్నానో అకస్మాత్తుగా అశనిపాతంలా అర్థమైంది. అటు నాటకాల్లో నాకు పలుకుబడి వుంటంలేదు. ఇటు ఇదీ ఏ క్షణానైనా నన్ను వదిలేసి లేచిపోవచ్చు. ముందు జీవనోపాధి ఒకటి వెతుక్కోవాలి. నిజంగా ఆ క్షణంలో నేపడ్డంత భయం జీవితంలో మరెప్పుడూ ఎరగన్నేను సిటీబార్‌లోకి వెళ్ళి ఓమూల కూర్చున్నాను రమ్ చప్పరిస్తూ. వాణ్ణి ఖూనీ చెయ్యడానికి మూడురకాల ప్లాన్లు ఆలోచించాను. దాన్ని చంపేస్తే ఎలా వుంటుందా అనికూడా ఆలోచించా. అదే మంచిదని తోచింది. అది ఎలా చేయడమా అని ఆలోచిస్తూండగా తటుక్కున నా దృష్టిపథంలో ఓ మెరుపు మెరిసింది. తర్వాత కొంతసేపటికి ఇంటికొచ్చేశాను. నే వచ్చేసరికి ఇక్కడే సోఫాలో పడుకొనివుంది. ఇహ నాటకాలు మానేశాను పద్మాఅని చెప్పాను....

గజ : ఊఁ....తర్వాత ?

ఫణి : (గబిక్కున మనిషి ధోరణి మారిపోయి సోల్లాసంగా) నిజానికి ఆనాడు నేనంత ఆదుర్దా పడిపోవాల్సిన అవసరం ఏంలేదు. తర్వాత విచారిస్తే తెలిసింది-శంకరం-అతనే-ఇందాక చెప్పానూ-అతనారోజే మెడ్రాస్ వెళ్ళిపోయాడని ; కాని అక్కణ్ణుంచి పెద్ద పెద్ద వుత్తరాలు వస్తూండేవి. వారాని కొకటి· ప్రతి బుధవారమూనూ. ప్రతిదీ చదివి ఎప్పటికప్పుడు పెట్టెలోపెట్టి తాళం వేసుకునేది-ఒక్కటి మినహా. అదిమాత్రం ఎప్పుడూ తనతోనే వుంచుకునేది. వీలు దొరికినప్పుడల్లా చాటుకుపోయి చేతిసంచిలోంచి ఆ వుత్తరం తీసి చదవడంకూడా గమనించాను. ఆ వుత్తరం ఒక దయ్యంలా పట్టుకుంది నన్ను. అందులో ఏముందో తెలుసుకు తీరాలనిపించింది. చివరికి తెలుసుకున్నాను. చాలా తమాషాగా వుంది చదవడానికి.

గజ : కొత్తేశావేమిటా వుత్తరం ?

ఫణి : ఆ! కావలిస్తే అమ్ముతానని ఆకాశరామన్న వుత్తరం కూడా రాశాను పద్మకి.

గజ : అదెందుకు ?

ఫణి : దాంతోనైనా భయపడిపోయి నాతో అసలు సంగతంతా చెప్పేసి క్షమాపణ కోరుకుంటుందేమోనని!....కాని అదేం లాభం లేక పోయింది. ఉత్తరం నా దగ్గరే వుంచుకున్నాను.

[జేబులోని పర్స్ తీసి జిప్‌లాగి అందులోంచి వుత్తరం సోఫాలో పడేట్లు వొంపుతాడు. గజపతి అది తీసుకుని కవరు పరిశీలిస్తూంటాడు]

గజ : ఇంతకూ....ఇదంతా నాతో ఎందుకు చెప్తున్నావ్ ?

ఫణి : నేను నమ్మదగిన మనిషివి నువ్వొక్కడివె గనక!

[గజపతి వుత్తరం మళ్ళీ పర్సులో పెడతాడు. ఫణి జిప్‌లాగి అది మూసేస్తాడు.]

నా ఆకాశరామన్న వుత్తరం కాస్త పనిచేసినట్టే వుంది. ఆతర్వాత మరి జాబుల్లేవు ఇద్దరి మధ్యా. హుఁ....జ్ఞాపకం చేసుకుంటుంటే తమాషాగావుంది....సరిగ్గా ఇవ్వాల్టికి ఏడాదికిందట....ఆ బ్రాంచీ షాపులో....దాన్ని హతమార్చి ఆ పీడ ఎలా వదిలించుకోవడమా అని ఆలోచిస్తూ కూర్చున్నా. అసలు నిజంగా అప్పుడే చంపేసి వుండేవాణ్ణి కూడానూ నా మనసు మార్చిన మనిషొకడు నాకళ్ళల్లో పడకుండా వుంటే.

గజ : (గుండెలనిండా పీల్చిన పొగవదుస్తూ ఇటు తిరిగి పైపులోనినుసి విదిలిస్తూ) ఊఁ....ఎవరుపడ్డారు నీ కళ్ళల్లో?

ఫణి : అతనివంకే చూస్తూ క్షణిక అవకాశంతో) నువ్వు!.... నిన్ను చూశాను.

గజ : (నెమ్మదిగా ఫణివైపు తిరుగుతూ) చూస్తే? ఏమిటందులో అంత విశేషం?

ఫణి : ది కోయిన్సిడెన్స్! అంతక్రితం వారంరోజులకుముందే మన కాలేజీ ఓల్డ్‌బోయస్ మీటింగుకి ఏట్టెండయి వచ్చాను. అక్కడ నీ సంగతికూడా వచ్చింది. కాలేజీలోనుంచీ నిన్ను డిబార్ చేసిన తర్వాత యుద్ధంలోకి వెళ్లావట....అక్కడ కోర్టు మార్షలు.... ఓ ఏడాదిజైలు....అసలు కాలేజీలోకూడా అనుకునేవాళ్లం ఎప్పటి కైనా నీకుకృష్ణజన్మస్థానం తప్పదని! ఆ నాటకం డబ్బు వాటి గొడవ మూలంగానే ననుకుంటా!

ఫణి : గొడవవేముంది అందులో?

ఫణి : (నవ్వుతూ) హోరి పిచ్చిమాలోకం! ఆ డబ్బు కాజేసింది నువ్వని తెలింది యెవరికి? పాపం అంజిగాణ్ణి తలుచుకున్నప్పుడల్లా బలే జాలేస్తుంది నాకు

గజ : (లేస్తూ) ఊఁ....సంతోషం - శలవ్.

ఫణి : నిన్నిక్కడికెందుకు రప్పించానో చెప్పొద్దూమరి?

గజ : కారుకోసం కాకపోతే అనవసరం

[కోట్‌స్టాండ్ వైపు వెళ్తూంటాడు]

ఫణి : (తెచ్చిపెట్టుకున్న కుంటినడక వదిలేసి) అసలు తిరకాసంతా జరిగింది అ బార్‌లో కూర్చుని వుండగా నువ్వు నా కళ్ళల్లో పడ్డప్పుడు ప్రళయ కాతోద్ధూత పర్జన్య నిర్ఘోషం ప్రశాంతించినట్లుంది. ప్రచండవాతాహత మహావృక్ష శాఖా సంచలనం ఆగిపోయి నట్లైంది. ఒక్క క్షణం సకల చేతన వస్తుజాలం ఖటిక్కిన నిశ్చలత్వం పొందినట్లైంది. దారుణ నాగసర్ప క్షతబాధాపరితప్తుడై

గిలగిల కొట్టుకుంటున్న మనిషి కన్నుమూసి మరొక్కసారి కాళ్ళు చేతులు విదిలించి బారచాచి మరీ కదలనన్నైంది. నా కల్లోల హృదయం, సక్షుభిత మస్తిష్కం ఒక్కసారి సేదతీరినై అంతా స్ఫటికంలా స్వచ్ఛంగా నేరుగా కనిపించింది. (జేబుగుడ్డ తీసి ఫొటోమీది వేలిముద్రలన్నీ శుభ్రంగా తుడిచి గోడకు తగిలిస్తూ-తర్వాత ఏష్ట్రే. టేబులు. హిస్కీ సీసా అన్నీ జాగ్రత్తగా తుడిచి యథాస్థానాల్లో వుంచుతూ) అంతకుముందు నాలుగైదు నెలల క్రిందటే నేనూ పద్మా వీలునామాలు రాయించుకున్నాం. ఏవైనా అనుకోని ప్రాణాపాయాలు జరిగితే మాకున్న ఆస్తిపాస్తు లన్నీ మిగిలిన రెండవ మనిషికి చెందాలని! దాని ఆస్తంతా లెక్క జూస్తే అరవై డెబ్బైవేలుదాకా వుంది. నాది చూస్తే నాలుగెకరాల మెట్టదిబ్బ. అలాంటప్పుడు నేనే ఎంత తెలివితేటలు ఉపయోగించి హత్య చేసినా అంతా నన్నే అనుమానిస్తారు, హత్య జరిగే టైములో నేను మరెక్కడన్నా వుండాలి. అక్కడెక్కడో వున్నట్టు బలమైన సాక్ష్యం కావాలి నా తరఫున. ఎల్లాగా అని ఆలోచిస్తూండగా దేవుడిలా నువ్వు సాక్షాత్కరించావు. అసలు జైల్లోపడి ఇవతలకు వచ్చినవాళ్లు - అంటే, నీలాంటివాళ్లు - బైటి కొచ్చిన తర్వాత ఏమౌతారా అని చాలాసార్లు ఆలోచించే వాణ్ణి. వాళ్లకు ఉద్యోగాలు దొరుకుతాయా? పాతస్నేహితుల్లో ఒక్కళ్లన్నా ఆదుకుంటారా? అసలు వాళ్లకి స్నేహితులే వుండరేమో....! ఇన్ని ఆలోచనలు ఒక్కసారి పెల్లుబికివచ్చి ఆగలేక అతి కుతూహలంతో వెంజనే నిన్ను వెంబడించాను. ఆ రాత్రి నువ్వు ఇంటికి జేరుకునేదాకా నిన్ను నీడలా అనుసరించా - ఆ ఆ గ్లాసిలా ఇస్తావా దయచేసి.

గజ : [అవ్యక్తంగా చూస్తూ గ్లాసు ఇస్తాడు)

ఫణి : థేంక్యూ. థేంక్యూ సోమచ్. అప్పట్నుంచీ నిన్ను వెంబడిస్తూనే వున్నాను.

గజ : ఎందుకు?

ఫణి : (గజపతి గ్లాసు శుభ్రంగా తుడిచి బల్లమీద పెడ్తూ) ఏముందీ - ఎప్పుడో ఓసారి ఏంచేస్తానో నాకు దొరికి పోకపోవు. దాంతో నేను-

గజ : నన్ను బ్లాక్ మెయిల్ చెయ్యవచ్చుననా?

ఫణి : అబ్బే - కాస్త పొత్తిడి పెట్టడానికి అవకాశం వుంటుందనీ!.... ఒకటి రెండు వారాలయ్యేసరికి నీ దినచర్య అంతా తెలిసిపోయింది నాకు.

గజ : పాపం - వృధా ప్రయాస!

ఫణి : అఁ హఁ- అలాఅనకు - కష్టానికి తగ్గ ఫలితం లభించింది. ఒక్కొక్కసారి నువ్వు పూర్తిగా నా వాడివే నా చేతిలో కీలుబొమ్మవే ననిపించేది.

గజ : అఁ హోఁ?!

ఫణి : ప్రతి సోమవారం గురువారం రేస్కోర్సులు - వున్నట్టుండి రవీంద్రం పేరుమార్చి బాబూరావువి కావడం - బీబీనగర్ కిల్లీకొట్లో గంజాయి వ్యాపారం - మారేడుపల్లి విశ్వబ్రాహ్మణ విశ్వస్త ఇంట్లోంచి అదృశ్యం కావడం - చివరికి రాయ్‌ఘర్‌లో నారాయణబాబుగా అవతరించడం - నిజంగా నేనే ఓ రచయితనైతే నీ ఎడ్వెంచర్సు అన్నీ ఓ పుస్తకంగా రాసి పారేయ్యాలనివుంది.

గజ : (భయపడ్డాడు. ఐనా వెకిలిగా చిన్ననవ్వు నవ్వుతూ) అఁ? అంత బాగుందా నా బయాగ్రఫీ? (అంటూ హ్విస్కీబోటిల్ అందుకోబోతాడు)

ఫణి : వుండు బ్రదర్ - ఇంకో గుక్క కావాలంటే ఆ చేతిరుమాలు అడ్డంపెట్టుకుని పుచ్చుకుందూ నీ వేలిముద్రలు తుడవలేక చస్తున్నాను మధ్య నేను.

[గజపతి ఆ రుమాళ్ళవంక చూస్తాడుగాని వాటిని ముట్టుకోడు]

రాయ్‌ఘర్‌లో కుసుమయ్య శెట్టిగార్ కోటలో పాగావేశావని తెలుసుకున్నాను. ఆ ముసలాడి పడుచుపెళ్ళానికి నువ్వు జ్ఞానోపదేశం చెయ్యడం - అది ప్రతి రోజూ సాయంత్రంపూట క్రమం తప్పకుండా దేవాలయానికి బయలుదేరడం - వూరిబయట 'నల్ల తుమ్మ చెట్లకాడ' 'ముసిరిన చీకట్లలో' మీ యిద్దరూ....పాపం నిన్ను నిజంగానే ప్రేమించిందనుకుంటాను....పిచ్చిముండ! ఆండాళ్లుకదూ దానిపేరు?

గజ : ఓ! చాలా తమాషాగానే వుందే! ఊఁ - కానీ.

ఫణి : ఆ పట్టుపట్టూ మూణ్ణెల్లు - జులై, ఆగస్టు, సెప్టెంబరు - దివ్యంగా గడిచిపోయాయి. జేబులు కాస్త బరువెక్కంగానే మళ్ళీ ఫారన్ వైట్‌హార్స్ హ్విస్కీ. లైవ్‌హార్స్ రేసులూ కావాల్సివచ్చి చాటుమాటుగా హైద్రాబాదుకు మళ్ళీ రాకపోకలు సాగించావు....నిజంగా అదృష్టం అంటే నీదేనోయ్! నీమానాన నువ్వు పబ్లిక్ గార్డెన్స్‌లో తాగి పడివుంటే అసలీ మా బీబీ నీకోసమే వెదుక్కుంటూ వచ్చిందా అనిపించింది. నీ రొట్టె తిరిగి నేతిలో పడింది. ఆవిడ కారేగా పాపం పదిరోజులమట్టీ అమ్మెయ్యాలని నానా తంటాలు పడుతున్నావ్!

గజ : ఆవిడే అమ్మిపెట్టమంది.

ఫణి : అవున్నాకు తెలుసాసంగతి. నువ్వొచ్చేముందే ఆవిణ్ణికూడా ఫోనులో పిలిచి మాట్లాడాను, కాని ఆవిడేం అత్యాశకు పోవడం లేదు. రెండువేలు వచ్చినా చాలంటోందాకారుకి.

గజ : (బాగా తేరుకుని. నెమ్మదిగా) ఇక్కడ దగ్గర్లో పోలీస్‌స్టేష నెక్కడ ?

ఫణి : మసీదుకి సరిగ్గా ఎదురుగ్గా వుంది. రెండే రెండు నిముషాలనడక।

గజ : నే నక్కడికి వెళ్తాననుకో యిప్పుడు ।

ఫణి : ఊఁ - వెళ్ళి ఏంచేస్తావ్ ?

గజ : అంతానూ.

ఫణి : అంతానా ? నీ దశావతారాల సంగతి కూడా ।

గజ : నువ్వు నన్ను బెదిరించి బ్లాక్ మెయిల్ చేసి నీ....

ఫణి : ఊఁ - నా——?

గజ : నీ భార్యను ఖూనీ చెయ్యమని బలవంతం చేస్తున్నావని చెప్తాను.

ఫణి : (విరగబడి నవ్వి) నువ్వు నిజంగా ఆపని చెయ్యగలిగినా బాగుం డును. ఇది మా ఆవిడ విన్న తర్వాత ఇద్దరం త్రుళ్ళి త్రుళ్ళి నవ్వుకుంటాం. కరువుతీరా కడుపునిండా నవ్వుకుని ఎన్నాళ్ళ యిందో కూడానూ.

గజ : నువ్వు నీ వైఫ్‌ని ఆ శంకరం గదికి ఎలా వెంబడించిపోయిందీ అక్కడ వాళ్ళిద్దర్నీ ఏ పరిస్థితుల్లో సువ్వు చూసిందీ అదంతా కూడా పోలీసులకు చెప్తాననుకో——

ఫణి : నువ్వే వెంబడించి వెళ్ళావనుకుంటారు.

గజ : నేనా ? నేనెందుకు వెంబడించాలి ? నాకేం అవసరం ?

ఫణి : నువ్వు దాని హేండ్‌బ్యాగ్ ఎందుకు దొంగిలించాలి ? ఆ ఆకాశ రామన్న వుత్తరం యెందుకు రాయాలి ? నువ్వు రాయలేదని నిరూపించగలవా ? నేను రాశానని అసలే ప్రూవ్ చెయ్యలేవు. నీమాట నువ్వు చెప్తావ్ - నా మాట నేను చెప్తాను అంతే ।

గజ : నువ్వేం చెప్తావ్ ?

ఫణి : ఏం చెప్తానా ? తాగి తందనాలాడుతూ నువ్వీ అర్ధరాత్రివేళ ఇక్కటికొచ్చావని చెప్తాను. మనిద్దరి కాలేజీ పరిచయాన్ని పురస్కరించుకుని నన్ను డబ్బు అప్పు అడిగావని చెప్తాను. నేనివ్వననే సరికి నా పెళ్ళాం తాలూకు ఉత్తరమేదో నీ దగ్గరున్నదనీ డబ్బివ్వకపోతే అది అందరికీ చూపి నానా అల్లరీచేసి మా పరువు తీస్తానని బెదిరించావనీ చెప్తాను. అప్పుడు విధిలేక డబ్బిచ్చి ఆ వుత్తరం పుచ్చుకున్నానని చెప్తాను. దానిమీద నీ వేలిముద్రలుకూడా పడ్డాయి ఇందాక. జ్ఞాపకం వుందా? (జేబులోంచే పర్సు తీసి చూపుతాడు) అదీగాక - ఇందులో ఇంకెన్ని గొడవలున్నాయో నీకెంత బాధో కాస్త ఆలోచించు. మనిద్దరి బొమ్మలుకూడా పేపర్లో పడతాయి. నాకేం ఫరవాలేదు. వ్యాళ్లో ఇళ్లద్దెకిచ్చుకున్న ఆసామీలు చాలా మంది ఓ సంఘంగా ఏర్పడి ఇడుగో ఈ పెద్దమనిషే మాకు అద్దెలు అప్పులు ఎగ్గొట్టి పోయి నాయన అని పోలీసులకో మహజరు పెట్టుకుంటారు. నీ పూర్వ చరిత్ర అంతా బైటపడిపోతుంది!

గజ : ఊఁ. చాలాదూరం ఆలోచించావ్. నీకు తెలియని విషయమే లేనట్లుందే!

ఫణి : అట్టే పొగడకు. నేను మొహమాటస్థుణ్ణి. నే చెప్పిందానికి నువ్వు ఒప్పుకుతీర్తావనికూడా తెలుసు నాకు.

గజ : ఓ! ఎందుకని ఒప్పుకుతీర్తానోకూడా శలవిస్తావా?

ఫణి : అదేమిటోయ్ వెట్టివాడా! ముందు జనపకట్ట పెట్టి వెనక ముల్లుకట్టకూడా పట్టుకునుంచుంటే ఎద్దు ఎప్పుడూ ముందుకుపోతుంది గాని వెనక్కు తిరుగుతుందా?

గజ : ఆఁహాఁఁ సరే - జనపకట్ట సంగతికూడా చెప్పుచూద్దాం.

[ఫణి గజపతివంక సూటిగా చూస్తాడు. ఇద్దరి చూపులూ కలుసుకుంటాయి.]

ఫణి : ఐదువేలు ....రొక్కం!

గజ : ఒక మనిషి ప్రాణాలు తీసినందుకా?

ఫణి : కొద్ది నిముషాల పనికోసం. అంతే అది. ప్రమాదం ఏమీలేదు. అందుకు నా హామీ. ఐనా ఇప్పటికే నీ పీకలదాకా వచ్చింది—

గజ : నా పీకలమీదకేం వచ్చింది?

ఫణి : ఏం వచ్చిందో నీకు బాగా తెలుసు, ఆ మధ్య పేపర్లనిండా ఆ గొడవేకదా. రాయ్‌ఘర్‌లో జేబులు నింపుకుని ఆ ఆండాళ్ళమ్మ వొంటిమీది బంగారం అంతా వొలుచుకుని నువ్వు మాయమై పోయిన మర్నాడు దాని శవం వూరిబయట దొరకలా? దాని కడుపులో కనిపించిన పాయిజన్ ఎక్కడిదో ఏమిటో ఎవళ్ళకీ తెలీదు—నీకూ నాకూ తప్ప! పాపం-పిచ్చిముండ ఆండాళ్లు!

[గజపతి చాలా వ్యగ్రుడైనాడు. కొంచెం దీర్ఘ నిశ్శబ్దం. ఈసారి మాట్లాడేటప్పుడు ఫణి కంఠస్వరం మారింది.]

అవును. ఈ పరిస్థితుల్లో నువ్వీ వూళ్ళో వుండటం ఏం మంచిది కాదు. ఉరిశిక్షకన్నా, ఆజన్మాంతం ఖైదుకన్నా సలీమాబీబీ తోటి చాటుమాటు సంసారంలోనే కాస్త ఎక్కువ సుఖం వుంటుంది. నే నిచ్చే ఐదువేలూ చేతబట్టుకుని దాన్ని గుట్టు చప్పుడు కాకుండా లేవదీసుకుని ఎటో అటు వుడాయించెయ్. చేతిలో కాస్త పైకం అంటూ వుంటం ఎందుకైనా మంచిది కూడా చూడు.

గజ : ఆ ఐదువేలూ ....

ఫణి : ఒక చిన్న తోలుపెట్టెలో చాలా భద్రంగా వుంచాను.

గజ : అది—?

ఫణి : అది ఒకానొక బ్యాంకు డిపాజిట్ రూంలో వుంది.

గజ : ఎక్కడ ?

ఫణి : హైద్రాబాదులోనేలే. అన్నట్టు-మనం మళ్ళీ కలుసుకోం. నువ్వు నా- అదే నీపని ఫైసలు చేసెయ్యంగానే డిపాజిట్ రూం రసీదు, లెదర్ కేస్ తాళంచెవీ పోస్టులో పంపుతాను.

[ఫణి డ్రాయరు తెరిచి, చేతిరుమాలు అడ్డంపెట్టుకుని, రూపాయి నోట్ల కట్టలు మూడు తీస్తాడు. అక్కణ్ణుంచే సోఫాలో పడేట్లు విసిరేస్తాడు.]

ఇదుగో ఈ మూడువందలూ ముందు దగ్గరుంచుకో.

[గజపతి డబ్బువంక చూస్తాడుగాని దాన్ని ముట్టుకోడు]

గజ : (లేచి టేబులుకేసి వెళ్తూ) ఆ లెదర్ కేస్‌లో డబ్బుందని నాకు నమ్మకం ఎలా ?

ఫణి : నామాట.

గజ : ఇదెప్పుడు జరగాలి ?

ఫణి : రేపు రాత్రికి పని పూర్తి కావాలి.

గజ : రేపా ? ఇంపాస్సిబుల్. నేను కొత్త ఆలోచించుకోవాలి.

ఫణి : రేపే జరిగితీరాలి. అవసరమైన ఏర్పాట్లన్నీకూడా అలాగేచేశాను.

గజ : ఎక్కడ ?

ఫణి : ఇక్కడే. ఇప్పుడు నువ్వెక్కడ నుంచున్నావో అక్కడ.

గజ : ఊఁ.... ఎలా ?

ఫణి : రేపు రాత్రికి శంకరమూ నేనూ నాటకానికి వెళ్తున్నాం. నా వైఫ్ మటుకు ఇక్కడే వుంటుంది. సరిగ్గా 10-35కి-అంటే 11 గంటలకీ ఇంకా 25 నిముషాలు వుండనంగా నువ్వు వీధిలోంచి వచ్చి ఈ లోపలికి ప్రవేశించాలి. తాళంచెవి ఇదుగో ఈ మెట్లమీద తివాసీకింద వుంటుంది.

[ఫణి హాలు తలుపు బార్లగా తీస్తాడు. వరండాలో ఎవరైనా వున్నారేమోనని అటూ ఇటూ చూచి గుమ్మంలోంచి చాలా క్లియర్‌గా కనుపించే ఓ మెట్టు చూపుతాడు మళ్ళీ లోపలకువచ్చి తలుపువేస్తాడు.]

గజ : ఐదో మెట్టు.

ఫణి : ఆఁ ఐదోమెట్టు లోపలకువచ్చి సరాసరి ఆ కటకటాల తలుపు దగ్గరకు వెళ్ళి తెరల వెనక దాక్కో. అది తోటలోకిదారి. సరిగ్గా పదకొండుకు ఇంకా 20 నిమిషాలుందనగా థియేటరులో మా ప్రొప్రయిటరుకు ఫోను చెయ్యడం కోసం ఫోను ఎత్తుతాను. కాని పొరబాటున రాంగ్ నంబరు- ఈ నంబరు- రింగ్ చేస్తాను. నేను చేసేదల్లా అంతే. పద్మ ఆ గదిలో పడుకొనుంటుంది. అదిలేచి ఫోను దగ్గరకి వచ్చేదాకా మాత్రం నువ్వేం చడీచప్పుడూ చెయ్యకూడదు. తర్వాత పనికాగానే ఫోనెత్తి సన్నగాఒక ఈల వెయ్యి అంతే. ఫోన్‌దించేసేయ్ ఏం మాట్లాడవద్దు, తెలిసిందా? నేనూ ఏంమాట్లాడను. నీ విజల్ వినంగానే నేను ఫోను దించేసి మళ్ళీ డయల్ చేస్తాను. ఈసారి కరెక్టుగా మా ప్రొప్రయిటర్ గారి నంబరే రింగప్ చేస్తాను. ఆయనతో ఏదో మాట్లాడి ఏం ఎరగనట్టు మళ్ళీ హాల్లోకివెళ్ళి కూర్చుంటాను.

గజ : తర్వాత ?

[ఫణి గోడ ప్రక్కనున్న సూట్‌కేసును చూపుతాడు]

ఫణి : ఆ సూట్‌కేసు అక్కడే వుంటుంది. నా మాసిన గుడ్డలేవో అందులో వుంటాయి. అవి కింద పారేసెయ్.

[సూట్‌కేసు తీసి ట్రోఫీలు, ప్రైజులువున్న అల్మైరా క్రింద తెరచి ఉంచుతాడు.]

ఆ కప్పులూ కాస్కులూ ఆ టేబులుమీద వెండి సిగరెట్ కేసూ అన్నీ ఇందులో పెట్టి మూతవేసెయ్. తర్వాత దాన్ని అక్కడే వొదిలేసెయ్.

గజ : ఎవడో దొంగతనానికి వచ్చినట్టూ - ఆవిడ కేకలెయ్యబోగా ఆ హడావుడిలో చంపేసినట్టూ - ఎక్కడివక్కడ వొదిలేసి పారిపోయినట్టూ !

ఫణి : అద్దదీ ఐడియా ! ఇక తోటవాకిలి సంగతి-అది ఓరవాకిలిగా తెరిచి వుంచు. ఆ తర్వాత సరిగ్గా ఎల్లా వచ్చావో అలాగే వెళ్ళిపోవాలి నువ్వు.

గజ : (హాలు గుమ్మం చూపుతూ) ఆ వాకిలిగుండానా ?

ఫణి : అవును. వెళ్ళేటప్పుడు తాళంచెవి నువ్వెక్కణ్ణుంచి తీశావో మళ్ళీ అక్కడే పెట్టేసెయ్యాలి. అది చాలా ముఖ్యం. మర్చిపోరాదుసుమా !

గజ : మెట్లమీద తివాసీకింద-ఐదో మెట్టుమీద !

ఫణి : యస్. ఐదో మెట్టుమీద.

గజ : అసలు నేను తోటలోంచే వస్తే యేం ?

ఫణి : రావడానికి వీల్లేదు అటుపక్క ఎత్తైన గోడవుంది. అది దూకేటప్పుడు ఎవరైనా చూస్తే ?

గజ : ఊఁ....(హాలు గుమ్మంవైపు తిరుగుతూ) ఇటునుంచి వరండాలోకి వెళ్ళి తాళంచెవి ఐదోమెట్టు తివాసీకింద వుంచి వీధిగేటులోంచి రోడ్డెక్కి వెళ్ళిపోవాలన్నమాట !....అవునూ-వీధిగేటు లోపలపక్క వేసి వుంటుందనుకో అప్పుడు నేనసలు లోపలికే రాలేనే !

ఫణి : దానికి గడియ లేదు. ఎప్పుడూ దగ్గిరికి జేరవేసే వుంటుంది.

గజ : తర్వాత నువ్వెప్పుడొస్తావ్ ఇంటికి ?

ఫణి : ఏ పన్నెండుకో ఒంటిగంటకో వస్తాను. శంకరాన్నికూడా నాతో తీసుకొస్తాను. ఇద్దరం కలిసే ఈ దారుణం చూస్తాం. అంతకు ముందు ఇంట్లోంచి వెళ్ళిపోయిన దగ్గర్నుంచీ అతనితోనే వున్నాను గనక నామీద ఎవరికీ ఏ అనుమానం కలగదు.
[గజపతి హాలంతా కలయజూస్తాడు-సన్నివేశం ఆకళింపు జేసుకోవడానికి. నెమ్మదిగా హాలు గుమ్మందగ్గరకు వెళ్ళి ఆ తలుపు కొద్దిగా తెరిచి మెట్లకేసి ఓ క్షణం చూసి మళ్ళీ తలుపువేసి ఫణి వైపు తిరుగుతాడు]

గజ : నువ్వో విషయం మర్చిపోయావు.

ఫణి : ఏమిటి ?

గజ : ఆ శంకరంతో తిరిగివచ్చినప్పుడు నువ్వు లోపలి కెలావస్తావ్ ?

ఫణి : ఆ తలుపు తీసుకుని !

గజ : మరి నీ తాళంచెవి మెట్లమీద వుంటుంది. అది తీస్తుంటే అతను చూస్తే ? నాటకమంతా బైటపడిపోదూ ?
[ఫణి మాట్లాడుతూ హాలుగుమ్మందగ్గరకు పోయి తలుపు నాబ్ మీద గజపతి చేతిముద్రలూ అవీ తుడిచేసి టేబులుకేసి వచ్చి అదికూడా తుడిచేస్తాడు—]

ఫణి : ఊఁహూఁ. అక్కడ వుండేది నా తాళంచెవికాదు. నేను వెళ్లే ముందు నా భార్యదే సంగ్రహించి అక్కడ పెడతాను. పద్మ బైటకు వెళ్ళాల్సిన అవసరం వుండదు గనక తాళంచెవికోసం చూసుకోదు శంకరంతో తిరిగివచ్చినప్పుడు నా తాళంచెవితో లోపలకు వస్తాను. తర్వాత సమయం చూసి పోలీసులు రాక ముందే ఆ రెండోతాళంచెవి తీసి పద్మ హాండ్ బాగ్‌లో పెట్టేస్తాను.

గజ : దీని కెన్ని తాళంచేతులున్నయ్ ?

ఫణి : మావి రెండే.

[టెలిఫోను మోగుతుంది. ఆన్సర్ చేద్దామా వద్దా అని ఫణి ఓ క్షణం తటపటాయించి బల్లదగ్గరకు వెళ్ళి గజపతివైపు తిరిగి ఫోన్ ఎత్తాడు. ఫణి మాట్లాడుతూండగా గజపతి లేచి హాలంతా తిరుగుతాడు-సోఫామీద వున్న చేతిరుమాళ్ళు తీసుకుని అవి అడ్డం పెట్టుకుని ముందు పడకగది తలుపు తెరిచి తొంగి చూస్తాడు. లోపల లైటు స్విచ్‌వేసి హాలు లైటు స్విచ్ దగ్గరకు వచ్చి అది ఆఫ్‌చేసి చూస్తాడు. హాల్లో ఇప్పుడు పడకగదిలోంచి వచ్చిన వెల్తురుమాత్రం వుంది. గజపతి వెనక్కువచ్చి తోట వాకిలి తెరలు ఒత్తిగించి చూసి తెరలు వెనక్కి లాగుతాడు. గడియ తీసి తలుపులు తీసీవేసీ రెండుసార్లు చూస్తాడు కిఱ్ఱుచప్పు డేమైనా అవుతుందేమోనని. మళ్ళీ గదిలో లైటువేసి పడక గదిలో దీపం ఆర్పి ఆ తలుపు వేసేస్తాడు సోఫాదగ్గరకు వెళ్ళి అందులో పడివున్న నోట్లకట్టకేసి చూస్తాడు. చూస్తూండగా ఫణి ఫోను దించేస్తాడు.
రిసీవరులోంచి పద్మ గొంతు వినిపిస్తుంది. చాలా ఉత్సాహంగా ఉల్లాసంగా వున్నట్టుంది.]

ఫణి : హలో-?

పద్మ : (ఫోనులోంచి) నేనండీ పద్మని!

ఫణి : (బ్రహ్మానందం పడ్డట్టు) హలో డార్లింగ్! ఎలావుంది సినిమా?

పద్మ : వండర్‌ఫుల్! ఎంత బాగుందో చెప్పలేను. అనుక్షణం ఎంజాయ్ చేస్తున్నాం. మీపని ఎందాకా వచ్చింది?

ఫణి : ఇంకా పూర్తికాలేదు. నిద్ర ముంచెత్తుకొస్తోందీ——

[పడకగది గుమ్మంలో నిలబడ్డ గజపతిని చూస్తాడు]

ఫ ణి

ఓ-డార్లింగ్-ఒక్క-క్షణం వుండు—

[ఫోను చేత్తోమూసి-]

జాగ్రత్తోయ్ బాబూ-ఆ బెడ్‌రూం కిటికీలోంచి ఎవరికైనా కనిపించగలవ్....సారీ డార్లింగ్-ఎవరో పిలిచినట్లైందీ-ఎవరూలేర్లే.

పద్మ : సినిమా అయిపోయేముందు ఫోన్ చేస్తాను. వచ్చేస్తారుకదూ ?

ఫణి : అదే కుదిరేట్టులేదు పద్మా.

పద్మ : (నిజంగా నిరుత్సాహపడి) అబ్బ ఏమిటండీ-ఎప్పుడూ ఇంతే కదా !

ఫణి : ఈసారికి....

పద్మ : ఐతే నేనూ ఇంటి కొచ్చేస్తాను. ఇక తాజ్ హోటల్‌లేదు - ఏం లేదు.

ఫణి : ఆఁ హఁ- పాపం శంకరం ఏమైనా అనుకుంటాడేమో.

పద్మ : అందుకని మీరు లేకుండా అర్ధరాత్రిపూట హోటళ్ళ చుట్టూ తిరగమంటారా యేమిటండీ ?

ఫణి : అదేమిటి పద్మా. మనమంతా సివిలైజ్‌డ్ ! మరీ అంత చాదస్తం పోతావేమిటి ? నాకు ఆకలిగాకూడాలేదు. మీరు హోటలుకువెళ్ళి భోంచేసివచ్చేయండి.... సరేనా ?

పద్మ : సరే—

ఫణి : అచ్చా. అలా వుండాలిమరి. ఇంటర్వెలా ఇది. ?

పద్మ : ఆఁ.... అదుగో బెల్ అవుతోంది. నేవెళ్తున్నా.

ఫణి : ఓ కే. ఎంజాయ్ యువర్ సెల్ఫ్.

[ఫోను దించేసి గజపతివంక చూస్తాడు.]

ఫ ణి

ఏంవోయ్ ?

[గజపతి సంశయిస్తూనే నెమ్మదిగా వంగి సోఫాలోని నోట్ల కట్టలు తీసుకొని పేకిదస్తా కలిపినట్టు కలుపుతాడు.

తలయెత్తి ఫణివంక ఓక్షణం చూసి తర్వాత జేబులో పెట్టుకుంటాడు. ఫణి పెదవులమీద చిరునవ్వు వెలుస్తుంది.]

[తెర]

రెండో అంకం

రంగం : అదే.

సమయం : గురువారం రాత్రి సుమారు 8 గంటలు.

గదిలో లైట్లు వేసివున్నాయి. బయటమాత్రం చీకటిగావుంది. సూట్ కేస్ వెనకటిలాగే గోడవారేవుంది. ఫణి షేర్వాణీ కోట్ స్టాండుకు తగిలించివుంది. శంకరంకోటు కుర్చీమీద పడివుంది. పద్మ, శంకరం చెరో సోఫాలో కూర్చొని వున్నారు. ఆల్బం చూపుతోంది పద్మ అతనికి. టేబుల్‌మీద ఇంకాకొన్ని మడత పెట్టిన పాతన్యూస్ పేపర్లు వున్నాయి. తెర లేచేసరికి అందరూ నవ్వుకుంటూ వున్నారు.

ఫణి : అంతే— ఆ తర్వాత ఇంకేముంది— నోట్లోంచి ముక్క పెగల్లేదు వెధవకి ?

పద్మ : ఐనా పాపం అతని డైలాగ్ పూర్తికాకుండానే మీరందుకోవడం బాగుందా యేమిటి ?

ఫణి : అదేమిటి-నేను డైరెక్టర్ని. మొదట్నుంచీ నాటకం అంతా నానా చావూ చచ్చి ప్రాక్టీస్ చేసి చేయించినవాణ్ణి. ఆ డైలాగ్ అలా మధ్యలోనే కట్ చేస్తే బాగుంటుందని స్పాంటేనియస్‌గా తోచింది-అలా చేశాను !

పద్మ : పోదురూ అతనేదో ఆడియన్స్ అప్లాజ్ తింటున్నాడని మీగోడు! అసలా వేషం అంత మంచిదని ముందే వూహించ గలిగితే మీరు వొదిలిపెట్టేవారా యేమిటి!

ఫణి : ఇల్లానే వుంటాయి మీ ఆడవాళ్ళ తెలివితేటలు! వీళ్ళెవరూ నన్నర్థంచేసుకోలేరు మిస్టర్ శంకరం! అప్పుడు మా సమాజంలో కూడా అంతే. ఏం చేసినా స్వార్థంతో చేశాననేవాళ్ళు. సరైనవాళ్ళెవరూ లేరు కనక పెద్దపెద్ద వేషాలన్నీ నేనే ఉేకప్ చెయ్యాల్సి వచ్చేది. చేసినందుకు-అదుగో చూశావా మా కెవళ్ళకీ ఛాన్సు ఇవ్వడంలేదు అని తర్వాత దొబ్బు! అందుకే విసుగెత్తి రెండునెలలు ఎడంగా వుండి చూశాను. దాంతో క్లోజ్! నేను వున్నప్పుడేం నాటకాలు వేశామో అంతే! మళ్ళీ నే వెళ్ళి అడుగు పెడితేగాని సమాజం బూజుకూడా దులపలే దెవరూ.

[శంకరం ఆల్బం మూసి పద్మ చేతికిస్తాడు. ఆమె ఉేబులుమీది కాగితాలన్నీ మడతపెట్టి అందులో పెడుతుంది.]

శంక : (ఆల్బం ఇస్తూ, ఫణివైపు తిరిగి) అబ్బ ఎన్నివేషాలు వేశారు! ఎన్ని రూపులు మార్చారు!....మీ అనుభవాలన్నీ ఓ పుస్తకం ఎందుకు రాయకూడదండీ మీరు?

పద్మ : మీ రిద్దరూ కలిసి జంటకవిత్వం చెయ్యండి. పోనీ-నాటకాలు బాక్ గ్రౌండ్‌గా తీసుకుని ఓ డిటెక్టివ్ నవల-'రంగంమీద రక్త ఖూనీ'!

[ముగ్గురూ నవ్వుకుంటారు. ఒక్క-క్షణం అవకాశం]

ఫణి : పర్‌ఫెక్ట్ మర్డర్‌లో మీకేమైనా నమ్మకం వుందా శంకరంగారూ?

శంక : ఇప్పటికి లక్ష పర్‌ఫెక్ట్ మర్డర్లు ప్లాట్ చేశాను. కాని వాస్తవిక జీవితంలో అవ్వి అంత జయప్రదంగా జరగడం అసంభవం!

ఫణి : ఎందుకనంటారు ?

శంక : ఎందుకంటే-కథల్లో సంఘటనలు రచయిత తిప్పినట్టు తిరుగుతాయి. వాడు నడవమన్నట్టు పాత్రలు నడుస్తాయి. కాని నిత్య జీవితంలో అలా ఎన్నడూ జరగదు! నెవ్వర్! భగవంతుడి చిద్విలాసం అంటారు చూడండి—

ఫణి : నాన్సెన్స్!

శంక : నో - ఇట్స్‌నాట్ - ఎంత నిర్దుష్టంగా ఆలోచించి మర్డర్ చేసినా ఏదో తప్పు-ఏదో బుద్ధితక్కువ పొరబాటు చేస్తాడు హంతకుడు. వీధిలో నలుగురూ నిలబడి అతన్ని ఎగాదిగా చూసేవరకూ తను చేసిన పొరబాటు తెలుసుకోనేలేడు.

[ఫణి నవ్వి గడియారం వంక చూస్తాడు]

ఫణి : ఊఁ - ఇహ మనం బయల్దేరితే బాగుంటుందనుకుంటాను. అన్నట్టు పద్మా - నా తాళంచెవిగాని నీకిచ్చానా ? ఎక్కడా కనిపించడంలేదు.

పద్మ : (లేస్తూ) రెండూ నా బ్యాగ్‌లోనే వున్నాయేమో చూస్తాను.

[పద్మ పడకగదిలోకి వెల్తుంది. ఫణి తోట గుమ్మందగ్గరకు వెళ్ళి గడియ తీసి తలుపు తెరిచి బైటికి తొంగిచూస్తాడు]

ఫణి : వర్షం దయచేసేట్లుంది. త్వరగా బయలుదేరాలి మనం.

[అంటూ శంకరం ఇటు చూస్తున్నాడేమోనని క్రీగంట చూస్తాడు. శంకరం అటు తిరిగివుండే కోటు తొడుక్కుంటున్నాడు. ఫణి ఓ తలుపు కొద్దిగా తెరిచివుంచి, తెరలు లాగుతాడు. పద్మ చేతిలోని హ్యాండ్‌బేగ్ తెరుస్తూ వచ్చి ఒక తాళంచెవి బైటకు తీస్తుంది.]

పద్మ : నా దగ్గర ఒకటే వుందండీ మీ జేబుల్లోనే ఎక్కడన్నా పెట్టుకున్నారేమో !

ఫణి : చూశాను కనిపించలేదు. పోనీ ఆ తాళంచెవి నాకియ్యి.

పద్మ : మరి నాకు ?

ఫణి : నీకెందుకు ?

పద్మ : కాస్సేపు సరస్వతమ్మగారింట్లో కూర్చుని వద్దామనుకుంటున్నా.

ఫణి : ఇప్పుడా ? 'ఆప్ కీ ఫర్మాయిష్' వినవూ ? ఇవ్వాళ గురువారం,

పద్మ : నే కోరిన పాట ఒక్కటీ పెట్టడం లేదీపూట వాళ్ళు.

ఫణి : ఓహో ! (స్టాండుదగ్గరకు వెళ్ళి షేర్వాణీ తీసుకుంటూవుంటాడు)

పద్మ : నేనెక్కడికి పోయినా మీకంటే ముందే వచ్చేస్తాను కదండీ. మీరు రాగానే నేతీస్తాను తలుపు.

[ఫణి టేబులుమీద వున్న తన పర్సు తీసుకుని జేబులో పెట్టుకుంటాడు. ఆ పక్కనే వున్న చేతిరుమాలు తీసుకుని మొహం తుడుచుకోబోతూ విదిలిస్తాడు, తాళంచెవి అందులోంచి కింద పడుతుంది అది తీసి పద్మకు చూపి షేర్వాణీ జేబులో పెట్టుకుంటాడు]

ఫణి : ఇదుగోనట్టా ఇక్కడేవుంది వెధవ తాళంచెవి !

పద్మ : ఇహ గొడవేలేదు (తన తాళంచెవి పర్సులో పెట్టి, అది బేగ్‌లో వుంచి, టేబులుమీద పడేస్తుంది.)

ఫణి : సరస్వతమ్మగారూ వాళ్ళు ఫస్టుషోకి ఏదో సినిమాకి వెళ్ళినట్టున్నారిందాక ?

పద్మ ; ఐతే సరళగారింటికి పోతాను.... అబ్బ-నన్నొక్కత్తెనీ మగ్గి చావమనకండీ ఈ కొంపలో. పనీ పాటా లేకుండా నాకసలేం తోచదు కూడాను.

ఫణి : పనేం లేకపోవడమేమిటి - ఈ కట్టింగ్సన్నీ తీసి ఆల్బంలో అతికించి పెడ్తానన్నావుగా మధ్యాహ్నం :

పద్మ : ఆఁ - చాలా గొప్పపని లేద్దురూ మీరిద్దరూ హుషారుగా జల్సాగా షికార్లు కొట్టటమూ నేనేమో ఈసురోమంటూ ఈ కట్టింగ్స్ అతికిస్తూ కూర్చోటమూనా ?

ఫణి : ఐతే సరే - మేమూ వెళ్ళం.

[షెర్వాణీ గుండీలు ఊడదీస్తూ కోట్ స్టాండ్ కెసి నడుస్తాడు]

పద్మ : (ఆశ్చర్యంతో) అదేమిటి ?

ఫణి : నీతోబాటే ఇక్కడ కూర్చుంటాం ఊఁ - ఏంచేద్దాం - పేకాట నాచేతకాదు. ఐతే పచ్చీసాడుకుంటాం పట్టండి.

పద్మ : సర్లెద్దురూ మీరుమరీనూ.........

ఫణి : అవును మేం నాటకానికి వెళ్ళడం నీకిష్టంలేదని తెలుస్తూనే వుందె !

పద్మ : అబ్బ మీరెళ్ళండి బాబూ. మరీ పసిపిల్లల్లా ఏమిటా మంకుపట్టు ? కట్టింగ్స్ తీసి అతికిస్తాలేండి ఇక్కడే కూర్చుని.

ఫణి : అంత ఇష్టంలేకపోతే ఎందుకులేద్దూ.

పద్మ : ఇష్టంలేదన్నానా యేమిటి నేను ?

[పద్మ ఆల్బం, న్యూస్ పేపర్లు, పాత కట్టింగ్స్ టేబులుమీద పెట్టుకుంటుంది.]

కత్తెరెక్కడో వుండాలి.........

[ఫణి అల్మైరాలోంచి పద్మ అల్లిక దారాల బుట్టతెచ్చి అందులో అడుగున వున్న కత్తెర తీస్తాడు. పద్మ డ్రాయర్లోంచి జిగురు సీసా తీస్తుంది]

శంక : (అదిచూసి) అరె-అది ఖాళీ సీసా !

[ఫణి పద్మచేతిలోవున్న ఖాళీ సీసావంక తెల్లబోయి చూస్తాడు. తన ముఖంలో రూపొందిన విసుగునూ కోపాన్నీ దాచుకోలేక పోతాడు చేతిలోవున్న కత్తెర టేబులుమీద పడేస్తాడు]

పోనీ కాస్త మైదాపిండి వుడికించరాదూ-ఎంతసేపు ?

ఫణి : ఔను. స్టౌమీద ఎంతోసేపు పట్టదుకూడానూ.

పద్మ : ఆ(-స్టౌ ఫ్యూజ్ పోయింది. బాగుచెయ్యమంటే నాలుగురోజు ల్నుంచీ చేశారుకారుగాని—

శంక : ఎక్కడది ? ఓ క్షణంలో సెట్‌రైట్‌చేసి పెడతాను. నాకు చూపించండి.

ఫణి : నువ్వైనా నిలబెట్టుబాబూ మన జాతి పౌరుషం !

పద్మ : ఇలారా చూపిస్తాను

[పద్మ, ఆమె వెనకే శంకరం లోపలికి వెళ్తారు. లోపల ఇద్దరూ ఏదో మాట్లాడుకుంటున్నట్టు ఇవతలకి వినిపిస్తూనే వుంటుంది. ఫణి టేబులుకేసి వెళ్తాడు. ఓసారి వంటయింటికేసి చూసి టేబులుమీదనున్న హ్యాండ్‌బాగ్‌లోని పర్సు తెరిచి తాళంచెవితీసి టేబులుమీద పెట్టి హ్యాండ్‌బాగ్ మళ్ళీయథాప్రకారం యథాస్థానం లో వుంచుతాడు. తాళంచెవి తీసుకుని హాలు తలుపు బార్లగా తెరిచి వరండాలోకి వెళ్ళి అటూ, యిటూ, మెట్లపైకి చూసి ఎవరూ చూడటంలేదనే నమ్మకానికివచ్చి గబగబా మెట్లమీద తివాసీ యెత్తి ఐదో మెట్టుమీద ఆ తాళంచెవి వుంచుతాడు సరిగ్గా ఆ సమయంలో వంటయింట్లోంచి పద్మ సోల్లాసపు నవ్వుతెరలు వినిపిస్తాయి. ఫణి కొద్దిగా ఉలిక్కిపడి వెనక్కుతిరిగి చూసి

మళ్ళీ హాల్లోకి వస్తాడు. వెంటనే వంటయింట్లోంచి శంకరం, అతనివెనకే పద్మ వస్తారు.]

పద్మ : (ఫణితో) ఈమాత్రం భాగ్యానికి నాలుగురోజుల్నుంచీ వాయిదా లేస్తున్నారు. ఇప్పుడైనా మీ ఆల్బంకోసంగాని లేకపోతే—

ఫణి : పోనీలే ఈ రూపంగానైనా అది బాగుపడినందుకు సంతోషించు.

శంక : (భార్యాభర్తల కీచులాటకి కాస్త మొహమాటపడి చిన్నగా నవ్వుతూ) వెల్-గుడ్‌నైట్ పద్మగారూ. మాకు టైం అవుతోంది

పద్మ : మంచిది వెళ్ళిరండి.

ఫణి : మేం వచ్చేదాకా మేలుకుని వుంటావా ?

పద్మ బాబోయ్-నే పడుకుంటాను· నన్ను మటుకు లేపకండి. మీ తాళంచెవి మీకుందిగా !

ఫణి : ఆల్‌రైట్.

[ఫణి, శంకరం వరండాలోకి వెళ్తారు. ఫణి తనవెనకే హాలు తలుపు మూసేస్తాడు.

పద్మ టేబుల్‌లైట్ ఆన్‌చేసి బ్రాకెట్‌లైట్స్ ఆఫ్‌చేసి టేబులు ముందు కూర్చుని తప్పదురా భగవంతుడా అన్నట్టు ఆ న్యూస్ పేపరు ముక్కలవంక ఓ క్షణం చూస్తుంది.

ఒక కాగితంమడతతీసుకుని కత్తెరతో కత్తిరిస్తూండగా—]

లైట్స్ ఫేడౌట్

లైట్స్ ఫేడిన్

[ఈలోగా సుమారు రెండుగంటలు గడిచాయి. పద్మ కట్టింగ్స్ అన్నీ ఆల్బంలో అతికించడం పూర్తి అయిపోయింది. అల్బం టేబులుమీదనే తెరిచివుంది. దానిపక్కనే కొన్ని న్యూస్ పేపరు ముక్కలు, కత్తెర పడివున్నాయి. టేబులుకింద చిత్తుకాగితాల బుట్టకూడా న్యూస్ పేపరు కత్తిరింపులతో నిండిపోయి వుంది. పద్మ హేండ్ బ్యాగ్ ఇంకా టేబులుమీదనే వుంది.

లైట్లు ఫేడిన్ అయ్యేసరికి (తెరలేచి వుంది) హాలులో ఓపక్క గోడకు తగిలించివున్న జీరోవాట్ ట్రాన్స్‌ఫార్మర్ బల్బుమాత్రం వెలుగుతూంటుంది. కొద్ది క్షణాల అవకాశంతో హాలు తలుపులో తాళంచెవి చాలా నెమ్మదిగా తిప్పిన శబ్దం - తలుపు నెమ్మదిగా రెండంగుళాల మేరకుమటుకు తెరుచుకుంటుంది- ఎవరో పొంచి వింటున్నట్టు. మరో నాలుగు క్షణాల తర్వాత తలుపు ఇంకా స్త తోసుకుని గజపతి ప్రవేశిస్తాడు· గుమ్మంలోనే నిశ్చలంగా నిలబడి మరికొంచెంసేపు చెవి యొగ్గి వింటాడు. రెయిన్‌కోటు, చేతులకి గ్లోవ్స్ వేసుకుని వున్నాడు. తాళం పడేటప్పటి క్లిక్‌తప్ప మరేం చడీచప్పుడూ లేకుండా తలుపు వేస్తాడు. హాలు మధ్యలోకి వస్తూ మెడలోని సిల్కు నెక్‌టై తీసి కొంచెం ఎడంఎడంగా రెండు ముళ్ళు వేస్తాడు.

గజపతి తోటవాకిలి కేసి పోతూండగా టెలిఫోను మోగుతుంది. గబగబా ముందుకు పోయి తోటవాకిలి తెరలవెనక దాక్కుంటాడు. టెలిఫోను మళ్ళీ మోగుతూండగా పడకగదిలో లైటు వెలుగు

తుంది. మరో క్షణంలో పద్మ ఆ గదితలుపులు తెరుచుకుని నిద్ర కళ్ళతో బద్ధకంగా హాల్లోకి వస్తుంది. బల్ల ఆ చివరకు వెళ్ళి తోట గుమ్మానికి వెన్నిచ్చి నుంచుని రిసీవరు తీసుకుంటుంది.]

పద్మ : హలో... (రెండు సెకండ్లు ఆగి ఇంకొంచెం బిగ్గరగా) హల్లో !

[తెరల్లోంచి నెమ్మదిగా ఇవతలకు వచ్చిన గజపతిని పద్మ గమనించలేదు. నెక్టై రెండు చివర్లూ చెరోచేత్తో పట్టుకునివున్నాడు. పద్మ ఎడంచేత్తో రిసీవరు పట్టుకుని వుంది, కుడిచేత్తో ఫోను జిగిల్ చేస్తూండగా గజపతి నెక్టైని ఆమె తలమ్మీదగా విసిరి కంఠానికి తగిలించి తనవైపు లాక్కుంటాడు. గొంతులోనే అణగారిపోయిన మూలుగుతో పద్మ చేతిలోని రిసీవరు వదిలేస్తుంది. గజపతి ఆమెను తన దగ్గరకు లాక్కుని తన వక్షస్థలంతో ఆమెను అదుకుని నెక్టై బిగించి పీక నొక్కేస్తూంటాడు. పద్మ నెక్టై పట్టుకుని పీకి అవతల పారెయ్యడానికి ఊపిరి తిరగని ప్రయత్నం చేస్తోంది. ఇద్దరూ ఒక్క క్షణం పెనుగులాడుకుంటారు. గజపతి ఎడమచేత్తో నెక్టైని ఆమె మెడమీద నుంచి చుట్టుతూండగా పద్మ హఠాత్తుగా అతని కభిముఖంగా తిరిగిపోతుంది. గజపతి ఆమెను వెనక్కు నెట్టుకుంటూపోయి టేబులుమీద ఆ చివరకు తోసి ఆమె తల టేబులుమీద ఆనించి నొక్కి నెక్టై బిగిస్తూంటాడు. పద్మ ముఖం వికృతంగా సంకుచిస్తూ ప్రేక్షకులకు తలక్రిందులుగా కనిపిస్తుంది.

పద్మ గిలగిల్లాడిపోతుంది. ఆమె చేతులు అటూ యిటూ కొట్టుకోవడంలో కుడిచెయ్యి టేబులుమీద వున్న కత్తెరమీద పడుతుంది. వెంటనే పద్మ కత్తెర అందుకుని కొనతో గజపతి వీపులో ఒక్కటేపోటు పొడుస్తుంది. గజపతి దుర్బలంగా ఆమె మీదపడి నెమ్మదిగా టేబులు ఆచివరకు దొర్లి నేలకు జారి భయంకరంగా మూలిగి వెల్లికిలా పడిపోతాడు. పద్మ వంట్లోసత్తువ

అంతా ఉడిగిపోయి మరోక్షణంసేపు అల్లానే టేబులుమీద పడిపోయి వుంటుంది. తర్వాత ఎలాగో లేచి వూపిరికోసం కొట్టుకులాడుతూ పడిపోకుండా నిలదొక్కుకుంటుంది, మెడకి చుట్టుకుపోయిననెక్లైలాగి పారేస్తుందిగాని అది ఆమె బుజాల మీదనుంచి వ్రేలాడుతూంటుంది. వెంటనే టేబులుమీద పడివున్న రిసీవరు అందుకుని ఏదో మాట్లాడబోతుందిగాని గొంతు పెగ లక మాటలు సరిగా రావు.

రిసీవరులోంచి తీవ్రంగా 'హలో' అని ఫణి గొంతు విని పిస్తుంది.]

ఫణి : హలో !

పద్మ : పోలీస్-త్వరగా పోలీస్‌స్టేషను కావాలి—

ఫణి : పద్మా !

పద్మ : ఎవరు ?-ఎవరు మాట్లాడేది ?

ఫణి : పద్మా ! నేను-నేను పద్మా-ఫణిని !

పద్మ : హమ్మ ! మీరా ! ఏమండీ—త్వరగారాండీ

ఫణి : ఏమిటి ? ఏమైంది ?

పద్మ : (మళ్ళీ భయం ముంచెత్తుకొచ్చి వణికిపోతూ) నేనిప్పుడు చెప్ప లేను-తొందరగా ఇంటికి వచ్చెయ్యండీ బాబూ—

ఫణి : (చిరాకేసి) ఏమిటే ఆ గొడవ ? సంగతేమిటో చెప్పరాదూ ?

పద్మ : ఎవడోనండీ - ఎవడో నా మీద పడ్డాడు- నా గొంతుక పిసికెయ్య బోయాడు.

ఫణి : పారిపోయాడా ?

పద్మ : లేదు-చచ్చిపోయాడు-వాడు చచ్చి పోయినట్టున్నాడు....ఏఁవండీ-ఏఁవండీ-వున్నారా లేరా అక్కడ మీరు ?....

ఫ ణి

ఫణి : (నిర్ఘాంతుడై) పద్మా!

పద్మ : ఊఁ.

ఫణి : నే చెప్పేది జాగ్రత్తగా విను—

పద్మ : చెప్పండీ—

ఫణి : నీ చేత్తో నువ్వేదీ ముట్టుకోవద్దు· ఒక్క నిముషంలో వచ్చేస్తాను. ఏదీకూడా తాకవద్దు. తెలిసిందా?

పద్మ : సరే.

ఫణి : ఏం ముట్టుకోవద్దు-ఎవర్నీ పిలవొద్దు - ఎవళ్ళతోనూ ఏం మాట్లాడొద్దు.

పద్మ : సరే - మీరు మటుకు—

ఫణి : ఎవర్నీ కేకెయ్యవుగా?

పద్మ : (భయం-కోపం) సరేలేండి బాబూ-ముందు మీ రొచ్చెయ్యండీ.

[రిసీవరు క్రేడిల్ మీద పెట్టేస్తూండగా మళ్ళీ పద్మకు కంపం పుట్టుకొచ్చి ఏడుస్తుంది. తూలుతూపోయి తోట వాకిలి తలుపులు బోర్లగా తోసి అవతలకు వెళ్తుంది. కొద్ది క్షణాల్లో తిరిగి వచ్చే సరికి ఆమె బుజాలమీద నెక్లైస్ వుండదు. హాలులో పడిపోయి వున్న శవాన్ని చూడంగానే హాలు వాకిలికేసి పరుగెత్తబోయి, ఆగి, సోఫాలో కూలబడి మళ్ళీ వెక్కి వెక్కి ఏడుస్తుంది. అంతలోనే లేచి పడక గదిలోకి పరుగెత్తుకు వెళ్ళి తలుపు వేసేసుకుంటుంది. కొద్ది క్షణాల అవకాశం.........

ఎక్కడో చర్చిలో కొడుతున్న గంటలు వినిపిస్తాయి....మళ్ళీ కొద్ది క్షణాల అవకాశం.........

బైట వీధిగేటు దభాల్న తెరుచుకున్న కిర్రుచప్పుడు - వరండాలో పరుగెత్తు కొస్తున్న అడుగుల చప్పుడు - తాళంలో చెవిపెట్టి

తిప్పిన శబ్దం - హాలు తలుపు తెరుచుకుంటుంది. ఫణి లోపలి కొచ్చి బ్రాకెట్ లైట్స్ స్విచ్ ఆన్‌చేసి హాలంతా కలయజూస్తాడు. నేలమీద పడివున్న శవంకేసి - టేబులుమీద hand bag కేసి- మళ్ళీ శవంకేసి చూస్తాడు. తలుపుకు వున్న తాళంచెవి తీసి తన షేర్వాణీ జేబులో వేసుకుంటాడు. నెమ్మదిగా తలుపు మూసేసి గజపతిని సమీపించి ఎలా చచ్చిపోయాడా అని పరిశీలించి చూస్తూ శవాన్ని కొద్దిగా దొర్లిస్తాడు. వీపుమీద బాగా దిగబడి పోయిన కత్తెర కనిపిస్తుంది. తన చేతుల కేమైనా రక్తం అయిం దేమో చూచుకుని పడక గదికేసి చూసి, గజపతి జేబులు వెదుకు తాడు తాళంచెవి కోసం. కాని అది దొరకదు. పడక గదిలో చప్పుడు-ఫణి లేచి నిలబడతాడు. పడక గది తలుపులు తెరిచి పద్మ అతన్ని చూసి పరుగెత్తుకుంటూ వచ్చి అతన్ని కావలించు కుని ఏడుస్తుంది.]

ఫణి : (సముదాయిస్తూ) మరేం ఫరవాలేదు - నే వచ్చాగా-వూరుకో.... వూరుకోమరి....ఏం జరిగిందసలు ?

[భయపడ్డ పసిపిల్లలా పద్మ అతన్ని ఇంకా గట్టిగా కౌగలించు కుంటుంది. ఆమె ముఖం కనిపించేట్లు ఫణి గడ్డం పట్టుకు కొద్దిగా ఎత్తుతాడు]

పద్మ : నా మెడచుట్టూ ఏదో చుట్టాడు....రిబ్బనులా-సన్నగా—

ఫణి : రిబ్బనా ?....ఏదీ నన్ను చూడనీ—

[ఆమె కంఠం పట్టుకు చూస్తాడు. పద్మ బాధతో ముఖం అటు తిప్పుకుంటుంది]

డాక్టర్ని పిలవనా ?

పద్మ : (అంటానికూడా భయమేసి) వాడు....వాడు - చచ్చిపోయా డండీ !—

ఫణి : (శవంకేసి చూసి) అవును కింద పడినప్పుడు కత్తెర బాగా దిగబడిపోయి వుంటుంది.

[పద్మ చూడలేక గభాల్న అటు తిరిగి మొహం చేతుల్తో కప్పుకుని వెక్కి వెక్కి యేడుస్తుంది]

ఇప్పుడే వస్తానుండు పద్మా !

[గబగబా పడకగదిలోకి వెళ్తాడు. పద్మ చేతుల్తో తల పట్టుకు ఒత్తుకుంటుంది. కళ్ళు తుడుచుకుని ఇటు తిరిగి హాలంతా కలయజూసి టేబులుమీద వున్న hand bag చూసి అందుకుని తెరిచి దేనికోసమో వెతుకుతూంటుంది.

ఫణి పడకగదిలోంచి దుప్పటీ ఒకటి తీసుకుని హాల్లోకి వచ్చి పద్మ చేస్తున్న పని చూసి ఠక్కున ఆగిపోతాడు]

ఏమిటది ? ఏమిటి వెతుకుతున్నావ్ ?

పద్మ : (ఏస్పిరిన్ బైటికితీసి) తల బద్దలుకొట్టుకు పోతోంది - కాసిని నీళ్ళు తెచ్చిపెట్టండి.

[Hand bag మళ్ళీ టేబులుమీద పడేస్తుంది. ఫణి వంటయింట్లోంచి గ్లాసుతో నీళ్లు తెచ్చి యిస్తాడు. పద్మ ఏస్పిరిన్ వేసుకుని నీళ్ళు తాగుతుంది. ఫణి తను తెచ్చిన దుప్పటీ గజపతిమీద కప్పుతాడు·]

పద్మ : ఆ తలుపు వేసెయ్యండి,

ఫణి ; ఉఁహుఁ - పోలీసులు వచ్చేదాకా మనం ఏమీ ముట్టుకోరాదు, (తెరిచివున్న తోట తలుపులకేసి చూస్తూ) గడియ బద్దలుకొట్టుకు వచ్చి వుండాలి ! (హాలంతా ఓసారి కలయజూసి) ఏం ఎత్తుకు పోదామని వచ్చాడో ! (వెండికప్పులు, షీల్డులవంక చూసి) వాటికోసమై వుంటుంది !

పద్మ : పోలీసు లెప్పుడొస్తారు ?

ఫణి : (ఉలిక్కిపడి) పిలిచావా వాళ్ళనప్పుడే ?

పద్మ : లేందే. ఎవర్నీ పిలవవొద్దన్నారుగా మీరు! వెంటనే పిలవడం మంచిదేమో·

ఫణి : అవును వెంటనే పిలుస్తాను గాని నువ్వు ముందు కాస్త నిద్ర పోవాలి. వాళ్ళని పిలిచి వాళ్ళకొక్కావాల్సిందంతా నే చెప్తాలే.

పద్మ : అదికాదండీ—

ఫణి : ఏదీకాదు పద్మా - ముందు నువ్వు కాస్సేపు నిద్రపో. ఈ గొడవంతా కాస్సేపు మర్చిపో....ఉఁ - పద—

[పడకగదికేసి పద్మని నెమ్మదిగా నెట్టుతాడు· పద్మ గుమ్మందాకా వెళ్ళి వెనక్కి తిరుగుతుంది]

పద్మ : అవునూ—

ఫణి : ఏమిటి ?

పద్మ : మీరెందుకు నాకిందాక ఫోన్ చేశారు ?

[ఫణి తెల్లబోయి జవాబుచెప్పే ముందు ఆమెకేసి కనీసం రెండు సెకనులసేపు చూస్తాడు]

ఫణి : ఆఁ ?....ఆఁ....తర్వాత చెప్తాలేగాని ఆసంగతి - (విషయం మారుస్తూ) వాడు - ఏమిటీ - రిబ్బనా నీమెడచుట్టూ బిగించాడన్నావ్— ?

పద్మ : రిబ్బనే అయివుండాలి - లేకపోతే అలాంటిదే ఏ గుడ్డపీలికో మరి - ఇక్కడలేదూ అది ?

ఫణి : (చుట్టూ చూస్తూ)లేదు....ఐనా కనిపించక ఎక్కడికి పోతుందిలే. ఊఁ - ఇహ నువ్వెళ్ళి పడుకో నేను పోలీసులకి ఫోన్‌చేస్తాను.

[పద్మ లోపలకు వెళ్ళి తలుపు వేసుకుంటుంది. ఫణి గజపతి దగ్గరకు వెళ్ళి, దుప్పటీ తొలిగించి, మళ్ళీ తాళంచెవి కోసం జేబులు వెదుకుతాడు. చివరికో జేబులో అది దొరుకుతుంది. అది తీసి పెద్ద భారం దిగినట్టు నిట్టూర్చి టేబులుమీద hand bag లోంచి జిప్ పర్సు తీసి అందులో తాళంచెవి (తుడిచి) జాగ్రత్తగా పెట్టి hand bag మూసి మళ్ళీ టేబులుమీద పెడ్తాడు. మళ్ళీ శవం దగ్గరకు వచ్చి మోకరిల్లి తన పర్సు తీసి అందులోంచి, చేతి గుడ్డ అడ్డంపెట్టుకుని, (శంకరం పద్మకు రాసిన) వుత్తరం గజపతి జేబులో దోపి, దుప్పటి శవం మీద కప్పేస్తాడు. గది అంతా మళ్ళీ ఓసారి కలయజూస్తాడు. చివరికి తోట గుమ్మం అవతలికి వెళ్తాడు. వంగి నేలమీద నుంచి ఏదో తీసి మళ్ళీ గదిలోకి వస్తాడు. రెండు చేతులతో గజపతి నెక్టై రెండు చివర్లూ పట్టుకుని వున్నాడు. ఆలోచనా పూర్వకంగా పద్మ అల్లికదారాల బుట్ట దగ్గిరికి పోయి అందులో వెతికి రెండు రిబ్బన్లు తీసి టైతో పోల్చి చూస్తాడు. చివరికి ఆ రిబ్బన్లు కలిపి నెక్ టైకి వున్నట్లే రెండు ముళ్ళువేసి టేబులు కింద పడేసి, టై తన జేబులో పెట్టుకుంటాడు. ఫణి ముఖం సంతృప్తితో పైశాచికంగా వికసిస్తుంది. చిరునవ్వుతో మరోసారి హాలంతా పర్యాలోకించి పడక గది వైపొకసారి చూసి రిసీవరు యెత్తి నంబరు డయల్ చేస్తూంటాడు. ఇంతలో పద్మ పడకగది తలుపు తెరుచుకుని అక్కణ్ణుంచి అడుగుతుంది—]

పద్మ : శంకరం ఏదండీ ?

ఫణి : (ఉలిక్కిపడతాడు-అంతలోనే సర్దుకుని) ఆఁ ? ఓ-అతన్ని వాళ్ళ రూముకి వెళ్ళిపొమ్మన్నాను...హలో-ఆపరేటర్-ఆఁ- ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ కావాలి-త్వరగా....

పద్మ : అతనికి చెప్పారా ఈ సంగతి ?

ఫణి : లేదు-అసలేం జరిగిందో నాకు సరిగా తెలవందే. అందుకని నాకు ఒంట్లో యేం బాగాలేదని చెప్పి వచ్చేశాను.... అబ్బ-నిన్ను కాస్సేపు విశ్రాంతి—

[పద్మ లోపలకు వెళ్ళి తలుపు వేసుకుంటుంది.
రిసీవరు లోంచి పోలీసు కంఠస్వరం వినిపిస్తుంది—]

పోలీస్ : ఖైర్‌తాబాద్ పోలీస్ స్టేషన్.

ఫణి : పోలీస్ ? ఇక్కడ చాలా దారుణమైన ఏక్సిడెంట్ (accident) ఒకటి జరిగిందండీ....

లైట్స్ ఫేడౌట్

లైట్స్ ఫేడిన్

శుక్రవారం ఉదయం సుమారు 9 గంటల సమయం. గుమ్మాల తెరలు పక్కలకు లాగివున్నాయి. బైట ఎండ కాస్తోంది.

చిత్తుకాగితాలబుట్ట ఖాళీచేయబడింది. గజపతి శవాన్ని తీసుకువెళ్ళిపోయారు గాని అతన్ని కప్పిన దుప్పటీ సగానికి మడతపెట్టి అతను పడిన స్థలంలో రక్తపుమరకల్ని కప్పి వుంచడంకోసం పడేసివుంది.

టేబులుమీద కాఫీకప్పు, సాసరు వున్నాయి.

తెర లేచేసరికి పద్మ సోఫాలో కూలబడి వుంటుంది. రాత్రంతా నిద్ర లేనట్లుంది - మనిషి సగమైపోయినట్లు కనిపిస్తోంది. ఫణి నెక్టై బిగించుకుంటూ పడకగదిలోంచి వస్తాడు.

ఫణి : చూశావా - ఆ కాఫీ ఇంకా అలాగే వుంచేశావ్ - తాగు పద్మా.

పద్మ : నా కొద్దండీ.

[ఫణి కాస్త విసుగుతో ఆమెవంక చూస్తాడు]

ఫణి : నువ్వా గొడవ మర్చేపోవాలి పద్మా. అనవసరంగా బాధపడి ఏం ప్రయోజనం ?

పద్మ : ఎంత వొద్దనుకున్నా కళ్ళకుగట్టినట్టుంది ! తలుచుకుంటే కళ్ళు తిరిగిపోతున్నాయి.

ఫణి : ఇంకా నయం - ఆ సార్జెంటక్కనట్టు పక్కన కత్తెర లేకపోతే శాశ్వతంగా కన్ను మూసేదానివి !

పద్మ : ఈ పాతకం కంటే అదే మేలనిపిస్తోంది।

ఫణి : ష్ పద్మా—।

పద్మ : నేనీ వేదన భరించలేనండీ.

ఫణి : ఏం పరవాలేదు పద్మా. నువ్వు చేసినదాంట్లో లా ప్రకారంకూడా ఏం తప్పులేదు - ఆత్మరక్షణకోసం చెయ్యాల్సివచ్చింది-అంతే। రాత్రి పోలీసులుకూడా నీ ధైర్యానికీ సమయస్ఫూర్తికీ ఎంత మెచ్చుకున్నారనుకున్నావ్।

పద్మ : ఇంకేమన్నారు వాళ్ళు ?

ఫణి : ఏంవుంది అంటానికి - ఇల్లూవాకిలీ అంతా తిప్పి చూపించాను. ఇహ మీ అవసరం ఏంవుండదు - మీరెళ్ళి పడుకోండి - మాకు చాలా పని వుంటుందన్నారు. అన్నదే చాలని నేనూ వెళ్ళి పడుకున్నాను.

పద్మ : అవును - మీకు బాగానే నిద్ర పట్టింది....

[ఒక్కక్షణం నిశ్శబ్దం]

ఫణి : అన్నట్టు పద్మోయ్- } [ఇద్దరూ ఒక్కసారిగా]
పద్మ : అసలు రాత్రిమీరు- }

ఫణి : ఏమిటి ?

పద్మ : మీరేమిటి చెప్పబోయారు ?

ఫణి : ఏంలేదు - మళ్ళీ నే మర్చిపోతానేమో-నువ్వు పోలీసుల్ని వెంటనే ఎందుకు పిలవలేదని అడిగాడు రాత్రి సార్జెంట్.

పద్మ : ఎలా? మీరున్నారాయె ఫోనుమీద—।

ఫణి : అదే - నేను ఫోను చేస్తాననుకుని నువ్వు చెయ్యలేదని చెప్పాను.

పద్మ : అసలు మీరొచ్చేదాకా ఎవరితోనూ మాట్లాడవద్దని చెప్పారు గదండీ.

ఫణి : అవును-నీ కంగారు విని నాకూ కంగారెత్తింది. అసలు నువ్వేం మాట్లాడుతున్నావో నాకర్థం కాలేదు. అందుకని ఇక్కడకొచ్చి సంగతేమిటో తెలుసుకుని ఫోన్ చేద్దామనుకున్నాను.

పద్మ : ఆ మాటే చెప్పొచ్చుగా వాళ్ళకి.

ఫణి : చెప్పాలే. నేనలాగే చెప్పాను. జరిగిందే అంతగదా అసలు!

[తలుపుతట్టిన చప్పుడు]

ఆ వచ్చింది శంకరం అనుకుంటాను. తలుపు తియ్యి పద్మా-న్నేప్పుడే వస్తాను.

[అంటూ పడకగదిలోకి వెళ్తాడు. పద్మ లేచివెళ్ళి హాలుతలుపు తెరుస్తుంది.

డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జాఫర్ బైట నిలబడి వున్నాడు]

జా : (hat తీస్తూ) నమస్తే.

పద్మ : (గుండెలు ఒక్కసారి నోట్లోకి వస్తాయి) ఓహ్-నమస్తే.

జా : పద్మావతిదేవిగారు మీరే ననుకుంటాను—

పద్మ : ఆఁ....అవును....

జా : నేను డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ని—

పద్మ : లోపలకు రండీ....(గాభరాగా) వారితో చెప్తాను మీరొచ్చారని....

[పద్మ పడకగదిలోకి వెళ్తుంది. ఇన్స్పెక్టరు టోపీ ఎక్కడ పెడదామా అని చుట్టూ చూసి కోట్‌స్టాండ్‌కు తగిలిస్తాడు హాలు మధ్యదాకా వచ్చి చుట్టూ కలయజూస్తాడు - దుప్పటి - కిటికి - టెలిఫోను - పడకగది గుమ్మం - ఒకదాని తర్వాత ఒకటిగా అన్నిటివంకా క్రీగంట మాస్తాడు కాస్సేపు. మళ్ళీ గదిఅంతా కలయజూస్తాడు. ఈసారి పద్మ అల్లికదారాల బుట్టమీద పడుతుంది అతనిదృష్టి. పడకగదిలోంచి ఫణి, పద్మ వస్తారు]

ఫణి : గుడ్‌మార్నింగ్.

జా : గుడ్‌మార్నింగ్. సర్. నేను ఈ డివిజన్ సి. ఐ.డి. ఇన్స్పెక్టర్ని. నా పేరు జాఫర్. రాత్రి ఇక్కడకు వచ్చాగాని నే వచ్చేసరికి మీరు నిద్రపోయారు.

ఫణి : ఓ-అలాగా, కాని .... మా రిపోర్టంతా రాత్రే మీ సార్జంటు కిచ్చేశాం....

జా : ఆఁ- అవున్ట. ఐనా కొన్ని విషయాలు సరాసరి మీ నుంచి తెలుసుకోవాలని వచ్చాను. మా సార్జెంటు మీతో అట్టేసేపు మాట్లాడలేదు. (గబిక్కిన పద్మ వైపు తిరిగి) కదండీ ?

పద్మ : అవును.... నేను....

ఫణి : రాత్రంతా ఆ షాక్‌తో చాలా బాధపడింది లేండి.

జా : అవును పాపం. వెరీ నాస్టీషాక్ (Very nasty shock)....
[పద్మ చాలా కంగారు పడుతోంది. నేలమీద పడివున్న దుప్పటీ వైపు తిరిగి దానివంక ఓ క్షణం చూస్తుంది. తర్వాత నెమ్మదిగా సోఫా దగ్గరకు వెళ్ళి అందులో కూర్చుని కణతలు ఒత్తుకుంటుంది.]

ఫణి : అసలు వాడు రాత్రి ఇంట్లోకి ఎలా జొరబడ్డాడో ఏమిటో మాకేం అంతుపట్టకుండా వుందండీ.

జా : ఊఁ.... అసలు సమయానికి మీ రిక్కడ లేరటగా !

ఫణి : అవును. నేషనల్ థియేటర్‌లో నాటకం ఒక టుంటేనూ అది చూడటానికి వెళ్ళాం నేనూ ఇంకో ఫ్రెండూనూ.

జా : ఇక్కడికి దగ్గిరేకదూ నేషనల్ థియేటర్ ?

ఫణి : అదే దగ్గర-ఓ ఫర్లాంగు పైన వుంటుంది. తమాషా చూడండి-సరిగ్గా అప్పుడే పద్మకి నేను ఫోన్ చేస్తున్నా !

జా : అవునట. అప్పుడు టైం ఎంతయిందో ?

ఫణి : అప్పుడా ?....సారీ సర్, నే గమనించలేదు.

జా : మీరేమైనా చెప్పగలరా ?

పద్మ : ఉఁ హుఁ-

జా : (ఫణితో) మీరు పోలీస్ స్టేషనుకు రిపోర్ట్ చేసినప్పుడు సరిగ్గా 11-13 అయింది.

ఫణి : ఓహో....ఐతే....అంతకు ముందే - పదినిముషాలు-పావుగంట క్రితం జరిగివుండొచ్చు. అన్నట్లు నిలబడేవున్నారేం? కూర్చోండి. [ఇన్స్పెక్టరు సోఫాలో కూర్చుంటాడు. ఫణి, పద్మ తమకు దగ్గరగా వున్న కుర్చీల్లో - ఇన్స్పెక్టరుకి ఇద్దరు చెరో పక్కగా - కూర్చుంటారు.]

జా : (కూర్చుంటూ) థేంక్స్.

ఫణి : వాడెవడో ఏమైనా తెలిసిందాండీ ?

జా : అతని బస, అదీ కనుక్కున్నాం. కాని అతని పేరు విషయం యం లోనే చాలా గంద్రగోళంగా ఉంది. చాలా పేర్లు వున్నట్టున్నాయి మనిషికి. (హఠాత్తుగా పద్మ వైపు తిరిగి) మీ రతన్ని అంతకు ముందెప్పుడైనా యెరుగుదురా ?

పద్మ : (అయోమయమై) ఆఁ ? అఁహుఁ-లేదు—

[ఇన్‌స్పెక్టర్ జేబులోంచి నోట్‌బుక్ తీసి అందులోంచి రెండు వేర్వేరు సైజుల ఫొటోలు తీసి ఆమెకు ఒకదాని తర్వాత ఒకటి అందిస్తాడు. ఆమె చూసి అతనికి తిరిగి యిచ్చేస్తున్నంత సేపూ ఇన్స్పెక్టరు ఆమెవంకే పరిశీలనగా చూస్తుంటాడు.]

ఇతనే....అతనా ?

జా : అవును. గుర్తుపట్టారా అతన్ని ?

పద్మ : లేదు. అసలు అతన్ని నే నెప్పుడూ చూచి యెరగను!

జా : రాత్రి ?

పద్మ : ఉహుఁ- వెనకపాటుగా వచ్చి కలియబడ్డాడు. అదీగాక గది చీకటిగా వుంది· నాకు కనిపించనే లేదతను!

జా : (మందహాసంతో) మొదట్లో· మీరు అతన్నెప్పుడూ చూడలేదన్నారు. మరి - రాత్రికూడా అతన్ని చూసేవుండకపోతే, అంతకుముందు అతన్ని చూసిందీ లేనిదీ ఎలా చెప్పగలరు ?

పద్మ : (గందరగోళపడి) నాకేం అర్థం కావడంలేదు....

జా : (నవ్వుతూ) పోనీలేండి ఫరవాలేదు. (ఫణితో) పోనీ మీరెప్పుడైనా చూశారా అతన్ని ?

ఫణి : లేదుసార్.

[ఇన్‌స్పెక్టర్ ఫణికి ఒక ఫొటో అందిస్తాడు]

(చూచి తిరిగి ఇచ్చేస్తూ) ఉఁ హుఁ.

[ఇన్‌స్పెక్టరు మరోటి అందిస్తాడు. అదికూడా చూచి——]

నో, సర్, (తిరిగి ఇవ్వబోతూ అంతలోనే వెనక్కు లాక్కుని ఇంకోసారి పరిశీలనగా చూస్తూ) ఆఁ- ? ఊఁ....

జా : యస్ ?

ఫణి : (అత్యాశ్చర్యపడి) మాకాలేజీమేట్ ఒకడు అచ్చు ఇలానే వుంటాడండీ!....కాని నే నెరిగినతనికి మీసం వుండేదికాదు మరి....

జా : అతని పేరేమిటి ?

ఫణి : (ఆలోచించి) సారీసర్. ఇప్పటిసంగతా - నేను కాలేజీ మానేసే పదిహేనేళ్ళయింది.

జా : అతనిపేరు గజపతా ?

ఫణి : నో,

జా : బాబూరావా ?

ఫణి : ఉఁ హుఁ—

జా : పోనీ....రవీంద్రం కావచ్చునా ?

ఫణి : ఉఁ హుఁ - ఆఁ ? రవీంద్రమా ? ఉండండి....
రవీంద్రం....యస్, దట్సిట్ ! (గోడకు తగిలించివున్న ఫొటో తెచ్చి చూపిస్తూ) ఇదుగో చూడండి. మా ఫస్ట్ ఓల్డ్ బోయిస్ మీటింగునాడు తీయించుకున్న ఫొటో యిది. ఇదుగో !....అరె- చాలా ఆశ్చర్యంగా వుంది ! రాత్రికూడా గుర్తు పట్టలేదు నేను !

జా : అతన్ని మీరు బాగా యెరుగుదురా ?

ఫణి : లేదు - నాకంటే సీనియర్.

జా : ఈ మధ్య ఎప్పుడైనా కలుసుకున్నారా అతన్ని ?

ఫణి : ఉఁ హూఁ....ఆఁ - ఆ మాటంటే జ్ఞాపకమొస్తోంది....కలుసు కోవడమంటూ లేదుగాని - ఆ మధ్య నోసారి చూశాను-దూరం నుంచి-అంతే.

జా : ఎప్పుడది ?

ఫణి : అవుతుందో యేడాది. ఏదో రైల్వేస్టేషనులో నండీ....కాచిగుడా? ....ఆఁ - అక్కడే చాలా కొత్తగా కనిపించాడు గాని కాస్సేపాగి మళ్ళీ అటు తిరిగి చూసేసరికి లేడు.

[ఒక్కక్షణం అవకాశం]

జా : (లేస్తూ పద్మవైపు తిరిగి) సరే - రాత్రి సరిగ్గా ఏం జరిగిందో ఓసారి చూపిస్తారా ?

[పద్మ భర్తవంక చూస్తుంది]

ఫణి : చూపించు పద్మా. పోలీసులకి మనం చేతనైనంత సాయం చేసి తీరాలి.

[పద్మను చెయ్యిపట్టుకు లేవదీస్తాడు, పద్మ మాట్లాడుతూ పడక గదిదగ్గరకు, మళ్ళీ సోఫా దగ్గరకు, ఫోను వెనక్కి నడిచి చూపుతుంది]

పద్మ : ఫోను మోగేసరికి నే పడుకునివున్నాను. వెంటనే లేచి ఇక్కడికి వచ్చాను.

జా : వచ్చి ఈ గదిలో లైటు వేశారా ?

పద్మ : లేదు. ఆ గదిలో లైటు వేసుకున్నాను,

జా : సరిగ్గా మీరెక్కడ నిలబడి వున్నారో చూపండి.

[పద్మ రాత్రిలాగే టేబులువెనక్కి వచ్చి తోట వాకిలివైపు సగం వీపుపెట్టి నిలబడుతుంది]

పద్మ : ఇక్కడ నుంచుని ఫోనెత్తాను.

జా : ఆ గుమ్మానికి వెన్నిచ్చి నిలబడ్డారా ?

పద్మ : అవును.

జా : ఎందుకని ?

పద్మ : ఎందుకనంటే ?

[ఇన్‌స్పెక్టరు టేబులు ముందు ఆ గుమ్మానికి ఎదురుగా నిలబడతాడు.]

జా : అఁహఁ- అలా చుట్టూ తిరిగి ఎందుకు వెళ్లాలి - మామూలుగా సరాసరి ఇక్కడికొచ్చి ఫోన్ తీసుకోవచ్చుగా !

[అంటూ కుడిచేత్తో రిసీవరు యెత్తి మళ్ళీ దించుతాడు]

ఫణి : మీ రనేదాంట్లో అర్థం లేకపోలేదు గాని-రాత్రి అవి ఎలా నుంచు న్నదీ దానికి తెలీదంటారా ?

జా : మీ రొక్క-క్షణం ఆగండి.

పద్మ : నే నెప్పుడూ ఇక్కడ నుంచునే ఫోన్ ఆన్సర్ చేస్తాను.

జా : ఎందుకని ?

పద్మ : మావారి కేదైనా కబురూ అదీ రాసుకోవాల్సి వస్తే ఇక్కడ కుర్చీలో కూర్చుని రాసుకోవచ్చు గనుక ! నా కదో అలవాటు !

జా : ఐ సీ (I see)....ఆల్ రైట్....తర్వాత ?

పద్మ : ఫోన్ తీసుకుని హలో అన్నాను. అంతలోనే వెనకనుంచి వచ్చి నన్ను ఎటాక్ (attack) చేశాడు. ఆ తెరల వెనక దాక్కుని వుంటా డప్పటిదాకా. ఏదో నా మెడ చుట్టూ వేసి—

జా : ఏదో అంటే ?

పద్మ : ఏమిటో మరి గుడ్డపీలికలా వుంది-రిబ్బనో నెక్టైయో—

జా : ఊఁ- సరే తర్వాత ఏమైంది ?

పద్మ : నన్ను టేబులు మీదకు తోశాడు. నేను గిలగిల కొట్టుకున్నాను. అప్పుడే నా చేతికి కత్తెర తగిలింది—

జా : మామూలుగా కత్తెర ఎక్కడ వుంటుందసలు ?

పద్మ : అ బుట్టలో. అందులో నా అల్లికదారాలు, కుట్టుపని సామాన్లతో బాటు వుంటుంది. రాత్రి న్యూస్ పేపర్ కట్టింగ్స్ తీసుకోడానికి తీసి ఇక్కడే వదిలేశాను.

జా : ఊఁ....అసలు మీ రీ గొడవ జరగంగానే మా కెందుకు ఫోన్ చెయ్యలేదండీ ?

[ఫణి పద్మ తనవంక క్రీగంటచూడటం చూస్తాడు; ఒక్కక్షణం ఇద్దరూ ఒకరి నొకరు చూసుకుంటారలా]

పద్మ : (ఫణి తన్ను చెప్పమన్న సంగతి గుర్తు చేసుకోవడానికి ప్రయత్నిస్తూ) చేద్దామనే నా వుద్దేశం. కాని లైనులో మా వారున్నారన్న సంగతి అర్థమైంది. వారు మీకు ఫోన్ చేస్తారు గదా అని నేను వూరుకున్నాను

[ఫణి నెత్తిమీద నుంచి ఓ భారం దిగినట్లయింది]

జా : పోనీ-అథమం ఓ డాక్టర్నైనా పిలుద్దామని మీ కనిపించలేదా ?

పద్మ : డాక్టరెందుకు ?

జా : ఆ మనిషికి గాయం అయిందికదా—

పద్మ : గాయమేమిటి-మనిషి చచ్చిపోతే !

జా : (నెమ్మదిగా) అతను చచ్చిపోయాడో లేదో అప్పుడే మీ కెలా తెలుసు ?

పద్మ : నేను....నాకు ...ఆ మాత్రం అర్థంకాదూ ?

జా : నాడి పట్టుకు చూశారా ?

పద్మ : లేదు.

జా : గుండెలమీద చెయ్యిపెట్టి చూశారా ?

పద్మ : (విసిగింది - కోపం వచ్చింది-అసహ్యం వేసింది) లేదు-ఎవళ్ళకైనా ఇట్టే అర్థమైపోతుంది అతను చచ్చిపోయాడని! మిడిగుడ్లుపడి రెప్ప ఆర్పకుండా చూస్తున్న ఆ కళ్ళవంక ఒక్కసారి చూస్తే చాలు —

జా : (నిందాగర్భితంగా) అంటే అతని మొహం చూశారన్నమాట మొత్తానికి మీరు !

పద్మ : (అసమర్థకోపంతో) అతని కళ్లే చూశాను. అతని మొహం నాకేం కనిపించలేదు.

ఫణి : ఇదుగో ఇన్‌స్పెక్టరుగారూ? నా వైఫ్ అతన్ని అంతకు ముందెప్పుడూ చూసి యెరగదన్నమాట ఖాయం. ఎందు కనవసరంగా దాన్నిలా ఉక్కిరిబిక్కిరి పెడతారు? ఇంకేమైనా అడగాల్సింది వుంటే అడుగుదురూ.

[ఇన్‌స్పెక్టరు ఒక్క క్షణం ఫణివంక, మరో క్షణం పద్మవంక చూస్తాడు. మళ్ళీ ఫణివైపు తిరుగుతాడు]

జా : ఆ మనిషి రాత్రి లోపలి కెలా ప్రవేశించాడని మీ అభిప్రాయం?

ఫణి ; ఇంకెలా వస్తాడు? హాలు తలుపు తాళంవేసి వుంది తోట తలుపు గడి యెలాగో తీసుకుని వచ్చివుండాలి.

జా : వాడు తోటలోంచి రాలేదు.

ఫణి : మరెలా వచ్చాడంటారు?

జా : వాడు ఈ గుమ్మంలోంచే వచ్చాడని మా నమ్మకం.

[హాలు తలుపు కొద్దిగా తెరిచి మళ్ళీ చిన్న క్లిక్‌తో మూసేస్తాడు]

ఫణి : కాని - ఆ తలుపు తాళంవేసి వుంది ఇన్‌స్పెక్టర్! నేనూ శంకరం రాత్రి నాటకానికి వెళ్తూ నేనే తాళంవేసి వెళ్ళాను.

జా : దీని కెన్ని తాళంచేతులున్నై?

ఫణి : రెండు. నాదగ్గరొకటీ నా భార్యదగ్గ రొకటీ వుంటుంది. (పద్మ వైపు తిరిగి) పోనీ నేవెళ్ళిన తర్వాత ఆ తలుపు నువ్వేమైనా తీసి మళ్ళీ తాళం వెయ్యడం మర్చిపోయావా?

పద్మ : లేదండీ నేనసలా చాయలకే పోలేదు.

ఫణి : (ఇన్‌స్పెక్టరుతో) అసలు వాడిటే వచ్చాడని మీకంత నమ్మకం ఎందుకనండీ?

జా : తోటవాకిలి బలవంతంగా తెరిచిన సూచనలేంలేవు. గడియ అసలే విరిగిపోలేదు. అదీగాక రాత్రి కొద్దిగా వాన కురిసింది. వాడు తోటలోంచి వచ్చివుంటే కాస్త కాకపోతే కాస్తైనా బురద అయి వుండాలి. కాని ఆ బురదమరకలు బైట వరండాలో మీ గుమ్మం ముందున్న పీచుమీద వున్నాయి. దానికితోడు ఆ పట్టాతాలూకు పీచు వాడి బూట్లకు కొద్దిగా అతుక్కుని వుంది కూడానూ.

ఫణి : ఐతేమటుకు-? పోనీ వాడు తాళంమటుకు ఎలా తీసుకురాగలడు? అది పగలగొట్ట లేదుగదా !.... Wait a minute ఇప్పుడర్థమైందనుకుంటాను (పద్మతో) నీ bag ఓసారి పోయింది - నీకు జ్ఞాపకం వుందా ?

పద్మ : అవునూ....

ఫణి : అప్పుడు నీ తాళంచెవికూడా ఆ bag లోనే వుందా ?

పద్మ : వుందిగాని మళ్ళీ దొరికినప్పుడు తాళంచెవితోబాటే దొరికిందిగా !

జా : (ఆ సక్తితో) ఏమిటది ? bag పోయి దొరికిందా? ఏం bag ?

ఫణి : Hand bag Sirమా పద్మ నాంపల్లి స్టేషన్లో పారేసుకుంది.

పద్మ : మళ్ళీ దొరికింది గదా !

జా : ఏమైనా పోయిందా ఆ bag లోది ?

పద్మ : అందులో వున్న డబ్బంతా పోయింది.

జా : ఇంకేమైనా ?

[ఫణి పద్మవంక చూస్తున్నాడు]

పద్మ : (కొంచెం సంకోచించి) ఇంకేం పోలేదు

జా : ఏమైనా కాగితాలుగానీ ఉత్తరాలు గానీ....?

పద్మ : ఉఁ హుఁ,

ఫణి

జా : (వున్నట్టుండి సూటిగా) బాగా జ్ఞాపకముందా మీకు ?

పద్మ : (నిశ్చయానికొచ్చి) బాగా జ్ఞాపకముంది

జా : అది పోయినప్పుడు మీ తాళంచెవి అందులోనే వుందన్నమాట !

పద్మ : వుందిగాని మళ్ళీ సంచీ వచ్చినప్పుడు తాళంచెవితో సహావచ్చింది.

ఫణి : కాని ఆ డబ్బు కాజేసిన వాళ్ళే మరో మారు తాళం చెవికూడా చేయించుకుని వుండవచ్చు.

జా : చివరికి సంచి ఎక్కడ దొరికింది ?

పద్మ : నాంపల్లి స్టేషనులోనే ! రైలుపట్టాల పక్కన దొరికిందట !

ఫణి : కాని చాలా రోజుల తర్వాత దొరికింది. ఆ లోగానే మారు తాళం చెవి చేయించి అసలు తాళంచెవి మళ్ళీ సంచీలో పెట్టేసి వుండొచ్చు.

జా : మారు తాళంచెవి చేయించినా వాడు దాన్ని తీసుకురాలేదండీ. తెచ్చేవుంటే అది వాడి జేబుల్లో మాకు దొరికే వుండాల్సిందిగా ! కాని అది కాదుగదా అసలేతాళంచెవీ వాడి జేబుల్లో దొరకలేదే మాకు !

ఫణి : ఐసీ....ఐతే మళ్ళీ మొదటికొచ్చా మన్నమాట !

జా : లేదులేండి· ఓ అడుగు ముందుకు వేశాం. ఇందాక ఎక్కడా మీ రతన్ని చూశానన్నారు-కాచిగుడాలోనా ?

ఫణి : అవును.

జా : నాంపల్లిలో కాదుగదా ?

ఫణి : (ఒక్క క్షణం ఆలోచించి) అయివుండొచ్చు. (ఏదోతట్టి తొందరగా భార్యవైపు తిరిగి) నీ bag ఎప్పుడు పద్మా పారేసుకున్నది? మనం ఏదో ఎక్స్కర్షన్‌కి వెళ్ళినరోజు కదూ ? అవును. ఆనాదే

అది నాంపల్లే. ఇప్పుడు జ్ఞాపకమొస్తోంది - నేను చూసినప్పుడు ప్లాట్‌ఫారం మీద టీ తాగుతూ నుంచొని వున్నాడు!

జా : (పద్మతో) మీ bag పోయింది కూడా అక్కడే గదూ?

ఫణి : అవునక్కడే! (పద్మతో) నేను నీతోకూడా అన్నట్టున్నానుకదూ పద్మా-మా కాలేజీమేట్ లాగా వున్నాడనో యేదో-

పద్మ : నాకు జ్ఞాపకం లేదు.

[ఫణి ఇన్‌స్పెక్టరు వంక చూస్తాడు. ఇన్‌స్పెక్టరు పద్మ వంక చూస్తున్నాడు.]

జా : మొత్తానికి hand bag కి వాడికీ ఏదో సంబంధం వున్నట్టే తోస్తోంది....ఆల్‌రైట్....అన్నట్టు-పంచాయితీ జరిగే లోపుగానే మీ యిద్దరూ అఫియల్‌గా వాఙ్మూలాలు ఇవ్వాలి స్టేషనిక్కడికి చాలా దగ్గర, ఓ సారి మీ రక్కడికి రావాల్సి వుంటుందిప్పుడు.

[హాలు తలుపు తట్టిన శబ్దం. ఫణి వెళ్ళి తలుపు తీస్తాడు. శంకరం వస్తాడు.]

శంక : గుడ్‌మార్నింగ్ మిష్టర్ ఫణి! హలో పద్మా! (ఇన్‌స్పెక్టర్ని చూస్తాడు) ఏమిటి వూరంతా గగ్గోలుగా ఉంది—?

ఫణి : గుడ్‌మార్నింగ్ శంకరం. (ఇన్‌స్పెక్టర్ని చూపుతూ) వీరు ఇన్‌స్పెక్టర్ జాఫర్. ఇన్‌స్పెక్టర్ meet my Friend Sankaram, a Famous writer. ఈయనా నేనూ కలిసే రాత్రి నాటకానికి వెళ్ళింది!

[శంకరం, ఇన్‌స్పెక్టరు కరస్పర్శ చేసుకుంటారు. ఇన్‌స్పెక్టరు శంకరాన్ని కాస్త విచిత్రంగా చూస్తాడు]

జా : ఓ! మీరా శంకరం గారంటే!....మీరు రాత్రి ఫణి గారితోనే వున్నారు గనుక మీరు కాస్త సాయం జెయ్యగలరను కుంటాను మాకు. వీరు ఫోన్ చెయ్యడానికి వెళ్ళినప్పుడు టైమెంత అయిందో చెప్పగలరా ?

శంక : (ఒక్క క్షణం ఆలోచించి) ఓయస్ టెన్ ఫార్టీ. (Ten-forty)

జా : అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలరు ?

శంక : నాటకం రెండోసీను జరుగుతోందప్పుడు చాలా డల్ (dull)గా వుంది. టైం చూసుకుని ఇంకెంతసేపు పడుతుందిబాబూ అని ఫణిగార్ని అడిగాను. ఆ వెంటనే ఫోన్ చేసి వస్తానని వెళ్ళారు.

ఫణి : అవును అప్పుడే వెళ్లాను.

జా : థేంక్యూసర్ ఆ ఫోన్‌కాల్ ఆన్సర్ చెయ్యడానికి ఈవిడగారు హాల్లోకి రాంగానే ఎవరో ఎటాక్ చేశారీవిణ్ణి పాపం.

శంక : అంటే....(ఫణితో) మీరు రాత్రి ఫోన్ చేసింది ఇంటికా ?

ఫణి : అవును.

శంక : అదేమిటి - నాతో అంటం మీ ప్రొప్రయిటరు గారికి ఫోన్ చేసి వస్తాననికదూ ?

పద్మ : (వున్నట్టుండి ఫణివైపు తిరిగి) ఆఁ- అవునండీ - ఇందాక మిమ్మల్ని అడగబోయి మర్చిపోయాను కూడానూ - ఇంతకీ రాత్రి మీరెందుకు ఫోన్ చేశారు ?

[అందరూ ఫణివంక తిరుగుతారు]

జా : (ఫణికేసి వస్తూ) Now Just a moment లేకపోతే తర్వాత confuse అవుతాము - 10-40 కి మీ ప్రొప్రయిటరుకు ఫోన్ చెయ్యడానికి వెళ్ళారు కదూ మీరు ?

ఫణి : అవును హాలుముందున్న పబ్లిక్ ఫోను దగ్గిరికెళ్ళాను.

జా : ఐతే మీరు ఇంటికి ఫోన్ చేసేముందు మీ ప్రొప్రయిటరుతో ఎంతసేపు మాట్లాడారు ? గజపతి మరణించిన కరెక్ట్ టైము తెలుసుకోడానికి అడుగుతున్నాను——

ఫణి : నిజానికి నేనాయనకు ఫోన్ చెయ్యనేలేదసలు ఫోన్ చెయ్యబోయేసరికి నంబర్ గుర్తులేదు, అందుకని ఇంట్లో నా నోట్ బుక్‌లోనో డైరెక్టరీలోనో చూసి నంబరు చెప్పమని (పద్మవైపు తిరిగి) నిన్నడుగుదామని నీకు ఫోన్ చేశాను.

పద్మ : ఫోన్ నంబరుకోసమా నన్నర్ధరాత్రి పన్నెండింటికి నిద్ర లేపారు.

ఫణి : ఏం చెయ్యను మరి-ఆ టెలిఫోన్ బూత్‌లో డైరెక్టరీ లేదాయె ! అదీగాక నువ్వింకా నిద్రపోయి వుంటావనుకోలేదు నేను. (ఇన్‌స్పెక్టరుతో) ఆయనేమో ఇవ్వాళ తెల్లారంగానే ఢిల్లీకి ప్లేన్‌లో వెళ్తున్నాడు. ఒక సంగతి జ్ఞాపకం చెయ్యాల్సి వచ్చింది. చాలా అవసరమైన విషయం.

జా : ఐతే ఇంతకీ ఆయన కసలు ఫోన్ చెయ్యలేదన్నమాట !

ఫణి : లేదు. ఇక్కడ జరిగిన గొడవ వినంగానే ఇహ కాళ్ళూ చేతులూ ఆడలేదు, ఆ సంగతి పూర్తిగా మర్చిపోయాను.

జా : ఐసీ.... (శంకరంతో) ఆc- శంకరం గారూ ! మీ కిద్దరూ ఇప్పుడు వాఙ్మూలం ఇవ్వడానికి మా స్టేషనుకు వస్తున్నారు. (నోట్ బుక్ తీస్తూ) దయచేసి మీ అడ్రసు కాస్త ఇస్తారా-మళ్ళీ ఓసారి మిమ్మల్ని కలుసుకోవాలి.

[ఫణి హాలు గుమ్మంకేసి వెళ్తాడు.]

శంక : తప్పకుండానూ.

[పద్మ పడకగదిలోకి వెళ్తుంది]

నేను తాజ్‌హోటల్లో—

జా : (నోట్‌బుక్, పెన్సిలు అందిస్తూ) ఇందులో కాస్త వ్రాయండి అడ్రసు. దయచేసి ఫోన్ నెంబరుకూడా ఇవ్వండి. (శంకరం వ్రాయడం పరిశీలించి చూస్తూ) ఇంతకు ముందెప్పుడైనా ఈ వూరొచ్చారా సార్ మీరు ?

[ఆ ప్రశ్న ఎందు కడుగుతున్నాడో శంకరానికి బోధపడదు.]

శంక : (రాస్తూ) ఆఁ యేడాదిక్రితం ఓసారి వచ్చానండీ.

జా : ఐసీ.

[శంకరం తిరిగి యిచ్చిన నోట్‌బుక్, పెన్సిలు తీసుకుని అడ్రసువంక ఓసారి చూసి. జేబులో పెట్టుకుంటాడు. ఫణి మళ్ళీ హాల్లోకి వస్తాడు.]

ఫణి : ఏమండీ ఇన్‌స్పెక్టరుగారూ ! బైట జనం పోగైనారు వాళ్ళని పంపించేద్దురూ మీకు పుణ్యం వుంటుంది.

జా : పంపించినకొద్దీ పోగవుతారు వాళ్ళు. మనం ఇలా తోటలోంచి దొడ్డిగుమ్మాన వెళ్ళిపోదాం లేండి. అటువేపు గేటుందిగా ;

ఫణి : వుంది, కాని అది తాళంవేసుంటుందేమో. చూసి వస్తానుండండి

[ఫణి తోటలోకి వెళ్తాడు అతను వెళ్లేదాకా ఆగి ఇన్‌స్పెక్టర్ శంకరంవైపు తిరుగుతాడు]

జా : (కొంచెం దగ్గిరసా జరిగి) ఆయనకేమైనా తెలుసా - మీ యిద్దరి గొడవా ? మీకూ పద్మావతిగారికీ వున్న సంబంధం— ?

శంక : (ఉలిక్కిపడి) what ?

జా : మీరావిడ కొక ఉత్తరం రాశారు-మెడ్రాస్‌నుంచి.

[శంకరం తెల్లబోయి నిర్విణ్ణుడై అతనివంక చూస్తూ వుండిపోతాడు]

ఆ వుత్తరం రాత్రి ఇక్కడ చచ్చిపోయిన మనిషి చేబులో దొరికింది. ఫణిగారి కీ వ్యవహారం ఎంతవరకు తెలుసో నాకు తెలీక ఇప్పటిదాకా నేనా సంగతి యెత్తలేదు. ఆవుత్తరం అతని జేబులో కెలా వచ్చిందో మీ కేమైనా తెలుసా?

శంక : ఉఁ హుఁ.

[పద్మ పడకగదిలోంచి వస్తుంది. తల కొద్దిగా సర్దుకుని వుంది. చేతిలో hand bag]

పద్మ : వారేరీ?

శంక : ఇప్పుడే అలా తోటలోకి వెళ్ళారు.

జా : ఏమండీ - మీరు bag పారేసుకున్నప్పుడు వుత్తరంకూడా ఏదైనా పోయిందా?

[పద్మ గబిక్కిన శంకరంవంక చూస్తుంది.]

పద్మ : లేదు.

శంక : అది ఆ చచ్చిపోయిన మనిషి జేబులో దొరికిందట!

జా : అది మీ bag లోంచే పోయింది-కదూ?

పద్మ : (ఏమీ చెప్పలేక నీరసంగా తల ఆడిస్తుంది)

జా : మరి ఇందాక అడిగినప్పుడెందుకు చెప్పలేదు.

పద్మ : మావారికేం తెలీదండీ ఆ గొడవ!

జా : వాడు మిమ్మల్ని బ్లాక్ మెయిల్ (black mail) చేస్తున్నాడు కదూ?

శంక : ఇంకేం దాచి లాభంలేదు పద్మా.

[తన జేబులోంచి కవరు తీస్తాడు. పద్మ అతనివంక భయావిష్ట నేత్రాల్తో చూస్తుంది.]

పద్మ : వొద్దు-వొద్దు శంకరం!

శంక : ఇంతకంటే చెయ్యగలిగిందేం లేదు. ఇన్‌స్పెక్టర్! పద్మ నేరాసిన వుత్తరం పారేసుకున్నాక ఇదుగో ఇది పోస్టులో వచ్చిందట!

జా : (ఉత్తరం తీసిచూసి తర్వాత కవరుమీది ముద్రలు చూసి) గత ఫిబ్రవరిలోనా! (పద్మతో) అప్పట్నుంచీ మీ దగ్గిరికి ఎన్నిసార్లు వచ్చాడీ మనిషి?

పద్మ : ఎప్పుడూ రాలేదు.

జా : నిజం చెప్పడం—

పద్మ : (కోపంవచ్చి) నేను నిజమే చెప్తున్నాను. వాడు నా దగ్గిరికి ఎప్పుడూ రాలేదు.

జా : మిస్టర్ శంకరం! మీరుకూడా మాతో ఇప్పుడే వస్తే బాగుంటుంది

శంక : ఓయస్. అలాగే. అసలు నేనూ వద్దామనే అనుకుంటున్నా.

జా : పద్మావతిగారూ! మీరు స్టేట్‌మెంట్ ఇచ్చేటప్పుడు మరికొందరు పోలీస్ ఆఫీసర్లుకూడా వుంటారు. మీకు ముందే హెచ్చరిక ఇస్తున్నాను-మీరు చెప్పే ప్రతిమాటా మావాళ్లు వ్రాసుకుని అవసరమైతే మీకు ప్రతిగా కోర్టులో ఉపయోగిస్తారు. ఇప్పటిదాకా మీరు నాతో మాట్లాడిందంతా మర్చిపోండి; నేనూ మర్చిపోతాను. ఇప్పటికైనా ఈ మనిషిని గురించి మీకు తెలిసిందంతా - రాత్రి అసలేం జరిగిందో అదీ వున్నదున్నట్టు చెప్పండి. మీరేదైనా దాచిపెట్టడానికి ప్రయత్నిస్తే అది బైట పడ్డప్పుడు మటుకు మీ పరిస్థితి చాలా విషమంగా వుంటుంది!

పద్మ : అసలు మీ వుద్దేశమేమిటో—

జా : చెప్తాను. ఈ మనిషిని చంపానని మీరు ఒప్పుకుంటున్నారు—

[ఫణి నిశ్శబ్దంగా తోటలోంచి వచ్చి వింటూ నిలబడతాడు]

ఆత్మరక్షణకోసం ఆ పని చెయ్యాల్సివచ్చిందని అంటున్నారు

మీరు. కాని దురదృష్టవశాత్తూ దానికి సాక్ష్యం ఎవరూలేరు. మీ వొక్కరిమాటే మేం నమ్మినా నమ్మకపోయినా!

ఫణి : ఇందులో అపనమ్మకానికి తావెక్కడుంది ఇన్‌స్పెక్టర్ ?

జా : వాడు దొంగతనానికి వచ్చినట్టు ఎక్కడా ఏ నిదర్శనమూ లేదు ఫణిగారూ. పైగా మీ భార్యని వాడు బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడంటానికి మటుకు కావాల్సినన్ని నిదర్శనాలున్నాయి.

ఫణి : బ్లాక్‌మెయిలా!

జా : తోటలోంచి వచ్చాడని మీరంటున్నారు. కాని వాడువరండాలోంచి ఆ సింహద్వారం గుండానే రైట్‌రాయల్‌గా లోపలికి వచ్చాడని మాకు ఖాయంగా తెలుసు.

పద్మ : (గుండెల్లో దడతో) అలా ఎలా రాగలడండీ ? తలుపు తాళం వేసి వుంది! వున్న తాళంచేతులు రెండు. (తన hand bag లో వెతుకుతూ) మావారి తాళంచెవి వారిదగ్గరుంది. నాది....ఇదుగో... నా bag లోనే వుందే!

[తీసి చూపుతుంది. ఒక్క క్షణం అవకాశం]

జా : అదే వచ్చినచిక్కు! హత్య జరిగేదాకా ఫణిగారు ఇక్కడికి రానేలేదుగదా. దానికి శంకరంగారే సాక్ష్యం! ఇహపోతే మీరే తలుపు తీసి అతన్ని లోపలకు రానిచ్చి వుండాలి!

ఫణి : అది రానిచ్చిందనా మీ అభిప్రాయం ?

జా : ప్రస్తుతానికి అంతకుమించి మరో మార్గాన వచ్చి వుంటానికి అవకాశాల్లేవు.

పద్మ : నా మీదపడి నా గొంతు పిసికెయ్యడానికి ప్రయత్నించాడన్నా కూడా మీరు నమ్మడంలేదా ?

[చేత్తో గొంతు తడుముకుంటుంది.]

జా : ఆ గాయాలు మీరే చేసుకోవచ్చు. రాత్రి ఆ తోట గుమ్మం అవతల టెర్రెస్‌లో రెండు రిబ్బన్లు మధ్య మధ్య ముళ్ళువేసి దొరికాయి మాకు.

పద్మ : దాంతోనే ననుకుంటాను నా కంఠం చుట్టూ చుట్టి నొక్కెయ్య డానికి ప్రయత్నించింది!

జా : ఆ రిబ్బన్లు మీవి! కదూ ?

పద్మ : (మనిషికి భయమేసింది) నో (no)!

జా : అవ్వి మీవని మాకు తెలుసు! ఒక రిబ్బను కొద్దిగా చిరిగివుంటే రంగు కలియని సిల్కుదారంతో కాస్త కుట్టివుంది కూడానూ. ఆ సిల్కుదారపు బంతి మీ అల్లికసామాన్ల బుట్టలో మాకు దొరికింది.

[పద్మ hand bag టేబులుమీద పడేసి గబగబా ఆ బుట్ట దగ్గరకు వెళ్ళి అందులో వెతుకుతుంది.]

పద్మ : (ఇంకా బాగా భయపడిపోయింది) ఏమండీ - ఇందులో రెండు రిబ్బన్లు వుండాలి-కనిపించవేం ?....

[ఫణి టేబులు దగ్గరకు వెళ్ళి హడావుడిగా ఒక నంబరు డయల్ చేస్తాడు.]

ఫణి : (డయల్ చేస్తూ) పోలీసులు తమ కేసులు నెగ్గడంకోసం వాళ్ళ కనుమానమున్నచోట డెలిబరేట్‌గా సాక్ష్యం పుట్టిస్తారని వింటమే గాని మన మెప్పుడూ చూసి యెరగం.

పద్మ : (అతని దగ్గరికి పరుగెత్తికెళ్ళి) రాత్రి తెల్లవార్లూ వాళ్ళిక్కడే వున్నారు. వాళ్ళే ఆ రిబ్బన్లు తీసి ఏం చేసినా చేసివుండొచ్చు.

ఫణి : అంతే అయివుండాలి. ఆ రవీంద్రం గాడి బూట్లు పీచుమీద తుడిచింది కూడా వీళ్ళే అయివుండాలి!

[పద్మ శంకరంవైపు తిరుగుతుంది. ఫోనులోంచి లాయరు రామనాథం గొంతు వినిపిస్తుంది.]

రామ : హలో-రామనాథం స్పీకింగ్.

ఫణి : హలో రామూ! నేను ఫణిని. రాత్రి మా యింట్లో ఒక దొంగ జొరబడ్డాడు. పద్మని ఎట్టాక్ చేశాడుకూడానూ.

రామ : పద్మనా ?ప్రమాదమేం జరగలేదుగాదా?

ఫణి : లేదు. అది బాగానేవుందిగాని ఆ దొంగ మట్టుకు చచ్చిపోయాడు. పోలీసులు ఇక్కడే వున్నారు. వాళ్లేమో-పద్మ వాళ్ళని చంపాలని చంపిందంటున్నారు—

జా : (మధ్యలో) చాలా తొందరపడి మాట జారుతున్నారు మీరు!

రామ : What ?

ఫణి : ఆశ్చర్యం వేస్తోందిగదూ ?....సరే....మమ్మల్ని ఇప్పుడు స్టేట్మెంట్ ఇవ్వడానికి ఖైర్తాబాద్ పోలీస్ స్టేషనుకు రమ్మంటున్నారు. మా లాయరువి నువ్వు వచ్చేదాకా ఏ స్టేట్మెంటూ ఇవ్వమని చెప్తాను. సరాసరి నువ్వక్కడికి వచ్చేస్తావా ?

రామ : ఐదు నిముషాల్లో వచ్చిపడతాను. పద్మ నేం భయపడొద్దని చెప్పు.

ఫణి : థేంక్స్. గుడ్బై.

[ఫణి ఫోను దించేసి పద్మకేసి వెళ్తాడు.]

జా : మీరు చాలా తొందరబాటు మనుషులు. నా సంగతి మీకు తెలీదు. ఇంకో ఇన్స్పెక్టరైతే రాత్రే మీ భార్యని ఎరెస్ట్ చేశుండేవాడు!

ఫణి : మీరా మాత్రం నిదానించినందుకు చాలా కృతజ్ఞుణ్ణి. (పద్మ బుజంమీద చెయ్యివేసి) మరేం ఫరవాలేదు పద్మా. మన రామనాథం కూడా పోలీస్ స్టేషనుకు వస్తున్నాడు.

జా : మిస్టర్ ఫణీ! మీకు నేనో సలహా ఇస్తానూ—

ఫణి : థేంక్స్. మా క్కావాల్సిన సలహాలన్నీ మా లాయరు ఇవ్వగలడు లేండి.

[ఫణి, పద్మ తోటవైపు గుమ్మంలోంచి బైటకు వెళ్ళబోతారు. శంకరం టేబులుమీద hand bag చూస్తాడు.]

శంక : నీ hand bag పద్మా !

పద్మ : ఓ !

[శంకరం అందించిన bag తీసుకుని ఓ సారి అయోమయంగా గది అంతా కలయజూసి తోటలోకి వెళ్తుంది. ఫణి ఓ అడుగు వెనకౌతాడు. శంకరం ఆమె వెనకే వెళ్తాడు.

ఇన్స్పెక్టరు కూడా వెళ్ళబోతూ ఆగి ఫణివైపు తిరిగి అడుగుతాడు.]

జా : మీరుకూడా వస్తున్నారుకదు సార్....

ఫణి : మరి ? తప్పకుండా వస్తున్నా నిన్స్పెక్టర్ !

జా : (తనలో తాను గొణుక్కుంటున్నట్లు) ఊఁ- ఐసీ - అవును - అఁహఁ-నేననుకున్నానూ....

[ఇన్స్పెక్టర్ బైటికి వెళ్తాడు. ఫణి ఓ సారి గిరుక్కున గది అంతా చూసి కోటు జేబుల్లో చేతులు పెట్టుకుని ఇన్స్పెక్టరు వెనకాల బైటికి వెళ్ళి తలుపులు దగ్గిరగా లాగి మూసేస్తాడు.]

— తెర —

మూడో అంకం

రంగం : అదే

సమయం : కొన్ని నెలలు గడిచాయి.

ఒకరోజు మధ్యాహ్నం సుమారు మూడు గంటల తర్వాత. బైటబాగా వానకురుస్తోంది. హాలులో ఫర్నిచరు కాస్త అటూయిటూ మారింది. గుమ్మాలకి తెరలు ఒత్తిగించి వుంటాయి. టేబులుమీద హ్విస్కీ-బోటిల్, ఒక గ్లాసు-చిత్తుకాగితాల బుట్టనిండా నానాచెత్త-నలిపిపారేసిన న్యూస్‌పేపర్లు - ఒకమూల స్టాండుమీద చిన్న రేడియో వుంటాయి.

ఇప్పుడు హాలులో ఒక మంచంకూడా వుంది. దానిమీద పక్క నలిగిపోయి దుప్పట్లూ అవీ దులపకుండా వుంటుంది. సోఫామీద మాసినగుడ్డలు పడేసి వుంటాయి. తెర లేచేసరికి తలుపులన్నీ వేసివుంటం మూలాన హాలు అర్ధాంధకారంలో వుంటుంది. బైట వరండాలో అడుగుల చప్పుడు - తలుపులో తాళంచెవి పెట్టి తిప్పిన శబ్దం—

ఫణి ప్రవేశిస్తాడు - రెయిన్‌కోటు వేసుకుని వుంటాడు - చేతిలో చిన్న లెదరుకేస్ - నీలంరంగుది - వుంటుంది - తలుపులోంచి తాళంచెవి తీసి కోటుజేబులో వేసి, కోటు విప్పి సోఫామీద పడేస్తాడు. లెదర్‌కేస్ మంచంమీద పడేసి రిస్ట్‌వాచీ చూసుకుని రేడియో దగ్గరకు వెళ్ళి స్విచ్ ఆన్‌చేసి తిరిగి మంచం దగ్గరకు వచ్చి కేస్ తెరిచి అందులోంచి నోట్లకట్ట ఒకటి తీస్తాడు. అందులో నూరు రూపాయినోట్లు వుంటాయి. అవ్వి జేబులో

పెట్టుకుని మళ్ళీ తాళంవేసి ఆ తాళంచెవి చొక్కా జేబులో వేసు కుంటాడు తర్వాత నీరసంగా వెళ్ళి సోఫాలో కూలబడతాడు. ఫోన్ బెల్ మోగుతుంది. ఫణి రేడియో ఆఫ్‌చేసి రిసీవరు నెత్తుతాడు. ఫోనులోంచి 'నైట్‌క్వీన్' పత్రిక ఎడిటర్ కంఠ స్వరం వినిపిస్తుంది.

ఫణి : హలో ?

ఎడిటర్ : ఫణిగారేనా ?

ఫణి : యస్ ?

ఎడి : నేను 'నైట్‌క్వీన్' ఎడిటర్‌ని—

ఫణి : ఓ-గుడ్ ఆఫ్టర్‌నూన్.

ఎడి : ఆ వుత్తరాల విషయం డిసైడ్ చేశారా ?

ఫణి ; డిసైడ్ చేసుకున్నాను సార్. ఈ కోర్టు వ్యవహారాలు మనల్ని బాగా ముంచేశాయి. మీకా వుత్తరాలు కావాలంటే అధమం రెండు వందలైనా అడగాల్సి వస్తోంది నేను.

ఎడి : రెండువందలా ?....మైగాడ్ ! నేనడిగిందల్లా ఆవిడ వుత్తరాలు

ఫణి : అదంతా బాగానే వుంచండీ - కాని మీ భార్యకే ఎవడైనా ప్రేమః లేఖలు రాశాడనుకోండి-అవ్వే దేశమంతా చదువుతుంటే మీకెలా వుంటుంది ?

ఎడి , యాభై రూపాయలిస్తామండీ —

ఫణి : నో. అయామ్‌సారీ. రెండు వందలకి దమ్మిడీ తగ్గను.

ఎడి : కాస్త టైమిస్తారా కొంచెం ఆలోచించి చెప్తాను ?

ఫణి ; బై ఆల్‌మీన్స్- ఆలోచించండి. రేపు కోర్టులో జడ్జిమెంటిస్తారు. ఆ తర్వాత త్వరలోనే నేను ఇక్కణ్ణుంచి మకాం ఎత్తేస్తున్నాను. ఈలోగా మీ యిష్టం,

[ఎవరో హాలుతలుపు తట్టుతారు, గొంతుతగ్గించి—]

ఎక్స్క్యూజ్ మీ. మీకు మళ్ళీ ఫోన్ చేస్తాను.

[ఫోన్ పెట్టేసి వెళ్ళి తలుపు తీస్తాడు. గుమ్మంలో శంకరం నిల బడి వుంటాడు, టకప్ చేసుకుని వున్నాడు. ఒక్కక్షణం ఇద్దరూ ఒకరివంక ఒకరు నోటమాట లేకుండా చూసుకుంటారు]

శంక. హలో ఫణీ!

ఫణి : హలో,

శంక : లోపలికి రావచ్చునా ?

ఫణి : ఆఫ్‌కోర్స్. ఎక్కడా కనిపించడమే లేదసలు నువ్వు.

శంక : (లోపలికొస్తూ) అయామ్‌సారీ. సంగతంతా తెలిసింతర్వాత నువ్వేమనుకుంటావో యేమిటో అని....

ఫణి : దట్స్ ఆల్‌రైట్ - ఫర్గెటిట్.(That is- all right forget it) రా-ఇలావచ్చి కూర్చో-

[పక్కమీద లెదర్‌కేస్ చూసి గబిక్కన ఆగిపోతాడు. అంతలోనే నిలదొక్కుకుని—]

: ఈ సోఫాలో కూర్చో.

[సోఫాలో పడివున్న బట్టలు తీసి యదాలాపంగా పడేసినట్లు కేస్ కనిపించకుండా మంచంమీద పడేస్తాడు.]

ఈమధ్య నేకూడా అందర్నీ తప్పించుకునే తిరుగుతున్నాను.

శంక : ఇవ్వాళ రాకుండా వుండలేకపోయాను. నేను చేయగలిగిం దేమైనా....

ఫణి : (తాపీగా) ఎవళ్లు చేయగలిగిందీ ఏమీలేదు శంకరం రేపు ఫైనల్ హియరింగ్....మన లాయరు రామనాధం తన శక్తంతా ధార పోసి ఆర్గ్యూ చేశాడు....కాని నిజాన్ని కాదనడం ఎవరితరం....

శంక : ఐనా ప్రయత్నం మానరాదు. అప్పుడే ఇంకా ఏమైందని ?

ఫణి : కావాల్సిందంతా ఐపోయింది (మంచంమీద కూర్చుంటాడు) నా చేతనైందంతా చేశాను....'దోషి'అని కోర్టు తీర్పు చెప్పకముందే ఓసారి చూసివద్దామని జైలుకెళ్ళా నివ్వాళ ఉదయం. కాని పద్మ నాకు కనిపించలేదు. మొహం చూపించలేక పోయిందను కుంటాను పాపం....ఓ విధంగా అదీ నయమేననిపించింది .... కాని....ఇక కనిపించదుగదా పద్మ మనకి !....నా పద్మ నా కిక దక్కే ఆశ లేదుగదా....

శంక : ఫణీ !....పద్మని రక్షించడానికి నువ్వేం చెయ్యాల్సి వచ్చినా చేస్తావు గదూ ?

ఫణి : (నీ కా అనుమానం ఎలా వచ్చిందని ఆశ్చర్యపడ్డట్టు తలయెత్తి చూచి) తప్పకుండానూ !

శంక : నాలుగేళ్ళు నువ్వు జైల్లో వుండాల్సి వచ్చినా ?

ఫణి : (ఒక్క క్షణం అవకాశంతో) అది నాకు దక్కాలేగాని దాని కోసం ఏం చెయ్యమన్నా చేస్తాను.

శంక : అవును. నువ్వు చెయ్యగలవ్ .... చేస్తావనే నా నమ్మకం. (నెమ్మదిగా)నువ్వకనక పోలీసులకి జరిగినయదార్థం చెప్పేస్తే....

ఫణి : యదార్థమా ?

శంక : అవును ఫణీ. నెల రోజులనుంచీ ఈ విషయంలో నా బుర్ర బద్దలుగొట్టుకొంటున్నాను. ఇంతకు మించి మరి అవకాశం లేదు పద్మకి.

ఫణి : నీ వుద్దేశమేమిటో సరిగా చెప్పు.

శంక : పద్మని హత్య జెయ్యడానికి నువ్వే గజపతిని పంపినట్టు పోలీసు లకి చెప్పాలి నువ్వు.

[ఫణి నివ్వెరబోయి శంకరం వంక ఓ క్షణంసేపు చూస్తాడు.]

ఫణి : నువ్వేం మాట్లాడుతున్నావో నీకు తెలుసా ?

శంక : నాకు బాగా తెలుసు ఫణీ. ఈ క్రైం స్టఫ్ (crime stuff) నేను కొన్ని సంవత్సరాలనుంచీ రాస్తున్నా. నేనేం మాట్లాడుతున్నానో నాకు బాగా తెలుసు. 'పద్మ దోషి-గజపతిని ఉద్దేశపూర్వకంగానే హత్య చేసింది' అని ఎందుకని అనుకుంటున్నారందరూ ? అది చెప్పిన సంగతి ఎవరూ నమ్మలేదు గనక ! అది అబద్ధం మీద అబద్ధం ఆడుతోందని పోలీసులు కేసు తయారుచేశారు గనక ! అది జూరీ కళ్ళుమూసుకు నమ్ముతోంది గనక ! కాని పోలీస్‌కేసు ఒక్కసారి పరిశీలించి చూడు. వాళ్ళకున్న పాయింట్లు మొత్తం మూడే మూడు ! ఒకటి : నే రాసిన వుత్తరం; రెండు : దాని రిబ్బన్లు; మూడు : గజపతి జేబుల్లో ఏ తాళంచెవీ లేదు గనక ఆమే అతన్ని లోపలికి రానిచ్చిందన్న అభిప్రాయం ! ఇప్పుడు గజపతి చచ్చిపోయాడు. కనక నువ్వెలాంటి కాకమ్మకథ చెప్పినా ఫరవాలేదు. అతన్ని నువ్వెరుగుదువనీ ప్లానంతా మీ రిద్దరూ ఆలోచించి వేశారనీ చెప్పొచ్చు. పోతే బ్లాక్‌మెయిల్ సంగతి- రెండు కారణాలవల్ల మాత్రమే గజపతి పద్మని పీడించుకు తింటున్నాడని అనుమానం - నా వుత్తరం అతని జేబుల్లో దొరికింది గనకా; పద్మ hand bag పోయిన రోజున అతనక్కడ కనిపించాడని నువ్వు చెప్పటంవల్లానూ. అంతేకదూ ?

ఫణి : ఊఁ ఊఁ - తర్వాత ?

శంక : ఇప్పుడు నువ్వెళ్ళి అసలానాడు నాంపల్లిలో అతన్ని చూడనే లేదనీ, అదంతా వుత్తరంతో గజపతిని ముడిపెట్టడానికి నువ్వు కల్పించినకల్పన అనీ పోలీసులకి చెప్పవచ్చు.

ఫణి : కాని వుత్తరం అతని జేబులోనే దొరికింది !

శంక : నువ్వే పెట్టావ్ గనక !

ఫణి : అంటే....నువ్వనేది....నేను పద్మ hand bag దొంగిలించానన్నా ?

శంక : అవును నువ్వే దొంగిలించి వుండొచ్చు. అందులో కష్టమేముంది?

ఫణి : అసలెందుకు దొంగిలించాలి నేను ?

శంక : వారం వారం ఆమెకు వుత్తరాలు రాస్తున్నదెవరో తెలుసుకోడానికి! నా వుత్తరం చదవంగానే పిచ్చెక్కిపోయి దానికో గుణపాఠం నేర్పాలని నువ్వనుకున్నావ్!

ఫణి : మరి - ఆ ఆకాశరామన్న వుత్తరం సంగతి ? అదెవరు రాశారని?

శంక : అదీ నువ్వే రాశావ్. కాదంటానికి మటుకు నిదర్శనం ఏం వుంటుంది? ఎవళ్ళనగలరు నువ్వు రాయలేదని ?

[ఫణి ఒక్క క్షణం ఆలోచిస్తాడు]

ఫణి : ఊఁ - సరే- దాని hand bag నేనే దొంగిలించాను. ఆవుత్తరం రాసిందికూడా నేనే. ఊఁ - తర్వాత ?

శంక : ఇన్నాళ్ళూ ఆ వుత్తరం నీ దగ్గరే పెట్టుకుని గజపతి చచ్చిపోయిన తర్వాత అతని జేబులో పెట్టేశావు.

ఫణి : ఆగాగు - అలా పెట్టడానికి నా కవకాశం ఏది ? ఎప్పుడు పెట్టి వుంటాను ?

శంక : డ్రామానుంచి తిరిగి వచ్చాక - పోలీసులు ఇంకా రాకముందు! అప్పుడే పద్మ రిబ్బన్లుకూడా నువ్వే తెచ్చి గజపతి ఉపయోగించిన దాని బదులు అక్కడ పడేశావు!

[ఫణి మళ్ళీ కాస్త ఆలోచిస్తాడు]

ఫణి : నీ ఉద్దేశమైతే చాలా మంచిది శంకరం. పద్మ నెలాగైనా రక్షిద్దామని నీ తాపత్రయం, కాని....ఈఅభూతకల్పన ఎవళ్ళూ నమ్మరు శంకరం.

శంక : అందరూ నమ్మేలాగా చెప్పాలి ఫణీ! అది నువ్వు చెప్పడంలో వుంటుంది.

ఫణి : ఏమో - ఏంచెప్పాలో ఎలా చెప్పాలో నాకేం అంతుపట్టడంలేదు. నువ్వూ రా నాతో.

శంక : నో-నో్న. నే రాకూడదు. నేనో రచయితననీ నే రాసేవన్నీ డిటెక్టివ్ నావెల్సనీ వాళ్ళకి తెలుసు. ఈ ప్లాను మనిద్దరం కలిసి ఆలోచించామని వాళ్ళ కే మాత్రం అనుమానం తట్టినా ఇదేం వినిపించుకోరు. అసలు నేనిక్కడి కొచ్చి నీతో మాట్లాడినట్టు కూడా వాళ్ళకి తెలీరాదు.

ఫణి : But - this is uidieulous. అసలు పద్మని చంపించాల్సిన అవసరం నా కేముంది శంకరం ?

శంక : అవసరానికేం - అన్నిటికీ మూలకారణం డబ్బు! పద్మ బాగా ఆస్తిపరురాలు కదూ ?

ఫణి : ఐతే ?

శంక : దాని తదనంతరం నీకేగా ఆస్తి చెందేది ?

ఫణి : ఐతే ?

శంక : ఇంకా ఐతే యేమిటి-ఆస్తికోసమే దానిప్రాణాలు తీశావ్ నువ్వు !

ఫణి : కాని లోకంలో ఆస్తిపరులైన భార్యాభర్తలు చాలా మంది వున్నారు. వాళ్ళెవరూ ఒకర్నొకరు హత్యలు చేసుకోవడం లేదే !....ఈ కట్టుకథలో ఒక్క ముక్క కూడా నమ్మరు పోలీసులు. పెళ్ళాన్ని రక్షించడానికి పాపం నానా పాట్లూ పడుతున్నాడని ఓ చిరునవ్వు నవ్వి వూరుకుంటారు. అంతే నాకు తెలుసు.... ఐనా అసలు నేనడిగితే మటుకు పద్మని చంపడానికి గజపతి ఎందుకొప్పుకోవాలి ?

శంక : డబ్బిస్తానని ఆశపెట్టినట్టు చెప్పాలి మరి నువ్వు.

ఫణి : డబ్బా! నా దగ్గరేం వుందని ?

శంక : పద్మ ఆస్తి నీకే సంక్రమిస్తుందిగా.

ఫణి ; ఆ ఆస్తి మన చేతుల్లోకి రావడానికి అధమం ఆరు నెలలయినా పడుతుంది. అదీగాక అరువుకి హత్య లెవరు చేస్తారోయ్!

శంక : పోనీ ఓసారి ప్రైచేసి చూడడానికేం ? జరగని హత్య చేద్దామని ఆలోచించినంత మాత్రానికి వాళ్ళు నిన్నేం వురి దీయలేరు! ప్రయత్నించి చూడు - మహా ఐతే ఐదారేళ్లు జైల్లో పెడతారు అంతేగా!

ఫణి : థేంక్యూ వెరీమచ్.

శంక : ....పద్మ బతికి బైట పడుతుంది. దాన్ని రక్షించినవాడ వౌతావ్.

ఫణి , నిజంగా ఈ సలహా నువ్వివ్వడం చాలా బాగుంది శంకరం! అసలు నీ మూలాన కాకపోతే పద్మ కింత ప్రమాదం తటస్థించేదేనా ? నీతో రంకుతనం చేసినందుకు కదూ దానిమీద జూరీకి జడ్జీకి వున్న రవ్వంత జాలికూడా పోయింది ? నా పెళ్లాన్ని మలినంచేసి దాన్ని ఉరికంబానికెక్కించి ఇంకా నన్నుకూడా జైలుకు పంపాలని ప్రయత్నం చేస్తున్నావా ? ఎందుకు నీకింత కక్ష మామీద ? మేం నీ కేం అపకారం చేశామని ? ఎందుకు మమ్మల్నిలా సర్వనాశనం చెయ్యడం ? నా పద్మని నేను చంపించడానికి ప్రయత్నించడం సంగతి అబద్ధమైనా ఈ ఘోరానికి ఒడిగట్టిన నీ పీక నులిమెయ్యాలని మటుకు నిజంగా వుంది నాకు. నీరక్తం కళ్ళచూడాలని వుంది. నిన్ను నా కాలరాచిపారెయ్యాలని వుంది.

Out-get out-get out of my sight-you-you blundering blabbering idiot of on ass–

[నిశ్చేష్టుడై గభాల్న నిలబడిపోయిన శంకరం మీదికి దూకి అతని కంఠం నిజంగా నులిమేయబోతున్నట్లు ఫణి రెండడుగులు వేసి,

ఆగి, ఒక్క క్షణం అతనివంక చూచి, సోఫాలో కూలబడి రెండు చేతులా తల పట్టుకుంటాడు.

ఒక్క క్షణం అవకాశం.

ఫణి తలయెత్తి సజల నయనాలతో శంకరం వంక చూస్తాడు—]

క్షమించు శంకరం. నిన్నేం అనవద్దనుకున్నాను. అనకూడదనుకున్నాను. మా బంగారం మంచిది కాదంటే....ఏదో ఉద్రేకం పట్టలేక పోయాను....అయామ్ టెర్రిబ్లీసారీ....నువ్వల్లిన కథ ఎవరూ నమ్మరు. ఇంకేదైనా ఆలోచించాలి.

శంక : (తనుకూడా సర్దుకుని) ఆలోచించాలి .... ఏదో ఒకటి ఆలోచించాలి....తీర్పు చెప్పడం రేపేగా ?

ఫణి : (ఆ మాటలు ఉచ్చరించలేనట్లు) అవును....రేపు....రేపే నా అమాయక పద్మ హంతకురాలుగా....

[వరండాలో అడుగుల చప్పుడు....హాలు తలుపు తట్టిన శబ్దం.]

శంక : ష్ !

[ఇద్దరూ ఆగి ఎవరో తలుపు తట్టడం వింటారు. ఒకరివంక ఒకరు చూచుకుంటారు. ఫణి లేచి తలుపు తెరవడానికి వెళ్ళబోతూండగా శంకరం చిటికెవేసి అతన్ని ఆగమని తను వంట యింట్లోకి వెళ్తాడు.

ఫణి తలుపు తెరిచేసరికి గుమ్మంలో ఇన్‌స్పెక్టర్ జాఫర్ నిలబడి వుంటాడు. చేతిలో రెండు, మూడు ఫైల్స్, చేతిమీద రెయిన్ కోటు వుంటాయి.]

ఫణి : ఓ ! హలో ఇన్‌స్పెక్టర్ !

[ఇన్‌స్పెక్టరు లోపలకు రాగానే ఫణీ మళ్ళీ తలుపువేసి కాస్త ఆదుర్దాగా—]

ఏమండీ-మా....పద్మ సంగతేమైనా కొత్తగా—?

జా : (జాలితో) సారీ సర్. ఏమీలేదు. ఐనా అందుగురించి కాదు నే వచ్చింది.

ఫణి : (ఆశ్చర్యపడ్డట్టు) మరి ?

[ఇద్దరూ మాట్లాడుకుంటూండగా ఇన్‌స్పెక్టరు తన hat కోట్ రాక్‌కు తగిలించి వచ్చి చేతిలోని ఫైల్స్ ఫణి రెయిన్‌కోటు వున్న సోఫాలో పడేస్తాడు. తన కోటుకూడా అదే సోఫాచేతి మీద పడేస్తాడు. ఇద్దరికోట్లూ చూట్టానికి ఒక మోస్తరుగానే వుంటాయి.]

జా : రెండు వారాలక్రితం ఈ ప్రాంతాల్లో దొంగతనం ఒకటి జరిగింది సార్. ఆ విషయం దర్యాప్తు చేస్తున్నానిప్పుడు....

ఫణి : దానికి మీ కిప్పుడేనా టైం దొరికింది ? అసలే నేను....

జా : క్షమించండి సార్. మీ పరిస్థితి నాకు తెలుసు. మీకు జరిగిన ఈ ఘోరానికి నేనూ చాలా చింతిస్తున్నా....

ఫణి : (కటువుగా) ఆల్‌రైట్ ఇన్‌స్పెక్టర్-మీదర్యాప్తుకు నేనే విధంగా సహాయపడగలనో చెప్పండి.

జా : ఇక్కడికో ఫర్లాంగు దూరంలో మెర్రీబార్ (Merry Bar) అనే బ్రాందీషాపు వుంది మీరెరిగే వుంటారు. దాని కాషియరు బ్యాంకులో కట్టడానికి డబ్బు తీసుకెళ్తుంటే దోవలో ఇద్దరు మనుషులు అటకాయించి డబ్బంతా తీసుకుపారిపోయారు. చాలా పెద్దమొత్తం. అన్నీ రూపాయినోట్లేనట.

ఫణి : ఐతే-? నాకూ దానికీ యేమిటి సంబంధం?

జా : ఇల్లాంటి చోరీలు జరిగినప్పుడల్లా టౌన్ పోలీస్ స్టేషన్లన్నీ కూడా కాస్త విచ్చలవిడిగా డబ్బు ఖర్చుపెట్టేవాళ్ళందర్నీ ఓకంట కనిపెట్టి చూస్తూండాలని మాకు ఇన్‌స్ట్రక్షన్స్ (Instructions).

[ఫణి ఏదో అంటాడని ఆశిస్తున్నట్టు ఓ క్షణం ఆగుతాడు]

ఫణి : ఐసీ.

జా : మీరీమధ్య రొక్కానికి ఏదైనా విలువగల వస్తువు అమ్మేశారా అనుకున్నాను.

ఫణి : ఎందుకని అనుకున్నారలా?

జా : మా సి. ఐ. డీ.లు దర్యాప్తు చేస్తుంటే ఈమధ్య మీరు తుక్కాజీస్ బార్‌లో బాకీ ఒకటి తీర్చారని తెలిసింది - (నోట్ బుక్‌లో చూసి) ఎనిమిది వందలట!

ఫణి - అవును. అప్పుడు నాదగ్గర కొంతడబ్బు వుంటంవల్ల బాకీ చెల్లించాను.

జా : ఐసీ! మీరు బ్యాంక్‌లోంచి డ్రా చేశారా ఆ డబ్బు?

ఫణి : (జాగ్రత్తగా) మీరు మా బ్యాంక్‌కు వెళ్లేవచ్చినట్టున్నారు?

జా : (చిరునవ్వుతో) నిజం చెప్పాలంటే వెళ్లేవచ్చాను. కాని వాళ్లేం చెప్పలేదు. కస్టమర్సు ఖాతాలన్నీ చాలా రహస్యంగా ఉంచుతారు వాళ్లు. (మనలోమాట అన్నట్టు) ఎక్కడిది మీకా డబ్బు?

ఫణి : మీకు చెప్పాల్సిన అవసరమేమైనా వుందా?

జా : అది దొంగసొమ్మే అయితే నేను తెలుసుకోవాల్సిన అవసరం తప్పకుండా వుంది. (జేబులోంచి పైప్‌తీసి)

ఫణి : May I? Sure! Sure! (నవ్వుతూ) కొంపతీసి నేనే ఆ దొంగనని అనుకోవడం లేదుగదా మీరు?

జా : (తనూనవ్వుతూ) అది మీకెక్కడిదో చెప్పేదాకా ఏమనుకోవాలో నాకే తెలీదు .చూడండి.

[ఇద్దరూ నవ్వుకుంటారు. ఇన్‌స్పెక్టరు జేబులో తడుముకొని, చివరికి రెయిన్‌కోటు దగ్గిరకెళ్ళి ఆ కోటు జేబుల్లోంచి టుబాకో టిన్ తీసుకుంటాడు]

ఆ డబ్బు మీరెరగని మనిషిదగ్గర్నించికనక మీకు వచ్చివుంటే.... ఆ మనిషే మాక్కావలసినవాడు కావచ్చు! అరె—

[ఇన్‌స్పెక్టరు వంగి నేలమీద పడిపోయివున్నదేదో తీస్తాడు] ఇది మీదాండీ?

[నేలమీదనుంచి తీసిన తాళంచెవి చూపుతాడు]

ఫణి : (దగ్గరకొస్తూ) ఏమిటది ?

జా : ఎవరిదో తాళంచెవి అనుకుంటాను. ఇదుగో ఇక్కడ నేలమీద పడివుంది.

[ఫణీ తన కోటుజేబుల్లో తడుముకొని తన తాళంచెవి తీసి చూపుతాడు]

ఫణి : అది నాదికాదు. నా దిదుగో ఇక్కడే వుంది.

[అప్పుడే ఇన్‌స్పెక్టరు తన చేతిలోని తాళంచెవి తలుపుకు పెట్టి చూస్తాడు గాని అది పట్టదు]

జా : కాదులేండి. ఇది మీదికాదు.

[ఫణి తన తాళంచెవి తిరిగి తన కోటుజేబులో పెట్టుకుంటాడు] బహుశా నాదే అయివుంటుంది.(తన కోటుజేబులో వెతుక్కొని) ఆఁ-నాదే. ఇదుగో ఈ జేబుకి చిన్న చిల్లివుంది. చూసుకోనేలేదు నేను.

[తాళంచెవి చేతబట్టుకుని దానివంకే చూస్తూ హాలు మధ్యకు వస్తాడు]

ఈ ఎపార్ట్‌మెంట్ హౌస్ కీస్‌తో వచ్చేబాధే యిదండీ. అన్నీ ఒఖమోస్తరుగా వుంటాయి చూట్టానికి.

[చాలా జాగ్రతగా తాళంచెవి తన లాగూ పక్కజేబులో పెట్టుకుంటాడు. ఇంతలో శంకరం వంట యింట్లోంచి వస్తాడు]

జా : ఓ! శంకరంగారా! గుడీవెనింగ్‌సర్. మీ రింకా వూళ్ళోనే వున్నారా ?

శంక : వున్నాను సర్.

జా : (ఫణితో) ఆఁ- ఏమిటి చెప్తున్నారు ?

ఫణి : నేనా ?....నేనేం చెప్పడంలేదే ...

జా : ఆఁ ఆఁ- ఆ దబ్బుసంగతి! అది మీ కెక్కడిదో చెప్తే చాలా సంతోషిస్తాను. పదిహేనొందలు ఎప్పుడూ జేబులో వుండవు చూడండి సామాన్యంగా ఎవరిగ్గానీ.

ఫణి : ఎనిమిది వందలన్నారిందాక ?

జా : అన్నానా ?....ఆఁ అవును. కాని మా సి. ఐ. డీ ఇంకో సంగతి కూడా రిపోర్ట్ చేశాడు — ఇందాక చెప్పడం మర్చిపోయాను. తారాచంద్ రామ్‌చంద్ అనే మార్వాడీకి మీరున్న బాకీ నాలుగు వందల యాభై కూడా వడ్డీతోసహా తీర్చేశారటగా !

ఫణి : పాపం చాలా కష్టపడ్డాడు మీ సి.ఐ.డీ. సరాసరి నా దగ్గరకే వచ్చి అడిగుంటే నేనే చెప్పేవాణ్ణి. మీతోకూడా మనలో మాటగా వుంచుతానంటే చెప్తాను—అసలిలాంటివి మీ పోలీసులకి చెప్ప రాదు-మా క్లబ్బులో పేకాటలో గెల్చాను.

శంక : పేకాటలోనా ?

జా : పదిహేను వందలూనా ?

ఫణి : వచ్చినా పోయినా వేలమీద నడిచే ఆటల్లేవు సర్ ? మీకు తెలియందేముంది ?

జా : ఐసీ!

శంక : నువ్వు పేకాట ఆడతావని నాకు తెలీదే!

జా : (ఓసారి శంకరంవంక చూసి, మళ్ళీ ఫణితో చిరునవ్వుతో) మరి ఆ మాట ఇందాకనే ఎందుకు చెప్పారుగారండీ ?

ఫణి : నామోషీ! ఓ చెంప నా భార్య జైల్లోపడి చావు బతుకుల మధ్య వుంటే నే నింకా క్లబ్బులకీ పేకాటలకీ వెళ్తున్నానని మీరేమైనా అనుకుని పోతారని!

శంక : కాని-నువ్వు వేలు గెలిచే ఆట ఎప్పుడు నేర్చావ్ ఫణీ ? పద్మ కూడా అంటూండేది నీకు లేని వ్యసనాల్లో అదొకటని!

[ఫణి ఇరకాటంలో పడ్డాడు. విసుగుతో, ఏదో భయంతో అతని ముఖం కాస్త సంకుచిస్తుంది. ఓసారి శంకరం వంక కాస్త చుర చుర చూసి శుష్క-హాసం చేస్తాడు]

ఫణి : హుఁ! వ్యసనా లెంతసేపు శంకరం. వ్యథ మర్చిపోవడానికేదో వ్యసనంలో పడాలిగదా!

జా : (జాలిగా) ప్చ్-నిజమే సార్. ఏదో వ్యాపకం అలా కల్పించుకుంటే ఈ బాధ కాస్త మర్చిపోవచ్చు....వెల్-అంతేగా !? ఇహ వస్తాను. క్షమించండి-ఇలాంటి టైంలో పాపం మిమ్మల్ని—

ఫణి : అఁహఁ - దానికేంలేండి. మీ డ్యూటీ మీది! మరేం ఫర్వాలేదు. [అంటూ ముందు వెళ్ళి హాలు తలుపు తియ్యబోతూండగా ఇన్‌స్పెక్టర్ hat తీసుకుని అటు తిరుగుతాడు.]

శంక : ఒక్క క్షణం ఇన్‌స్పెక్టర్‌గారూ! మీరు వెళ్ళకముందే ఫణి మీతో ఓ విషయం చెప్పాలనుకున్నాడు—.

జా : ఆఁ హాఁ—?

ఫణి : అదేమిటి?....(నవ్వుతూ) ఓ! ఇంకా గుర్రం దిగలేదన్నమాట నువ్వు! (ఇన్‌స్పెక్టరువైపు తిరిగి) ఏంలేదు ఇన్‌స్పెక్టర్! మీరు వచ్చేముందు ఇక్కడో బ్రహ్మాండమైన నాటకానికి రిహార్సల్సు జరిగాయి. నేను మీదగ్గరకొచ్చి ఎవరూ ఎన్నడూ కనీ వినీయెరుగని అభూతకల్పన ఒకటి సృష్టించి చెప్పాలట! నేనట-నా భార్య ఆస్తికోసం-ఎక్కడైనా తప్పుచెప్తే సరిదిద్దు శంకరం-నా భార్యని హత్య చేయించడానికి గజపతిని పంపించానట! అంతేకాదు-ఈ పెద్దమనిషి రాసిన ఉత్తరం మీకు జ్ఞాపకం వుందికదూ - అది దొంగిలించింది గజపతి కాదట. ఆ ఆకాశరామన్న వుత్తరం కూడా నేనే రాశానట. చివరికా దాచిపెట్టిన వుత్తరం తెచ్చి నే చచ్చిపోయిన గజపతి జేబులో వుంచానట!....

శంక : (ఇన్‌స్పెక్టరుతో) ఆ దొరికిన రిబ్బన్లుకూడా—

ఫణి : ఆఁ ఆఁ-రిబ్బన్లు. ఆ హంతకుడు ఉపయోగించిన ఉరితాదేదో మాయంచేసి వాటి స్థానంలో ఆ రిబ్బన్లు నేనే పెట్టానట! (శంకరంవైపు తిరిగి) అంతేకదు శంకరం? (ఇన్‌స్పెక్టరువైపు తిరిగి) ఎలావుంది ఇన్‌స్పెక్టర్ నా వాఙ్మూలం?....ఏం శంకరం ఇంకేమిటి?

[శంకరం హాలు తలుపుకేసి వెళ్ళి అది తెరుస్తాడు.]

శంక : (ఇన్‌స్పెక్టరుతో) తాళంచెవి ఈ బైటే ఎక్కడో పెట్టిపోతానని కూడా గజపతికి చెప్పాడండీ ఇతను!

[కిందా పైనా చూసి, తలుపు అంచులుకూడా తడిమిచూస్తాడు.]

ఇదుగో బహుశా ఈ ద్వారబంధంమీద పెట్టివుంటాడు. దాంతో గజపతి తలుపు తెరుచుకుని లోపలకొచ్చి ఆ తెరలవెనక దాక్కు న్నాడు. టైం చూసుకుని ఫణి థియేటరునుంచి ఫోన్ చేసి పద్మని పడక గదిలోంచి ఇక్కడకు లాగాడు....

[ఫణి మంచంమీద కూర్చుంటాడు.]

జా : జస్ట్ఎ మినిట్. (Just a minute) గజపతి ఫణిగారి తాళం చెవితోనే లోపలకు వచ్చివుంటే అది అతని జేబుల్లోనే మాకు దొరికివుండాల్సిందిగా. అదేమైనట్టు ? అదీగాక ఫణిగారు థియేటర్ నుంచి వచ్చిన తర్వాత తాళంచెవి లేకుండా ఇంట్లోకి ఎలా వచ్చివుంటాడు ?

[కాస్త అవకాశం]

శంక : (చెప్పుకుపోతూనే ఆలోచిస్తూ, పద్మే తలుపుతీసి లోపలికి రానిచ్చి వుంటుంది. తర్వాత మీ రెవరూ రాకముందే గజపతి జేబు లోంచి తన తాళంచెవి తీసుకుని వుంటాడు.

జా : కాని ఆయన మీతో వెళ్ళేటప్పుడు తాళంచెవి తనతో కూడా తీసుకునే వెళ్ళారని కోర్టులో నిరూపించబడింది. మీరుకూడా అలానే సాక్ష్యం ఇచ్చారు. జ్ఞాపకంలే ?

[శంకరం పరాజితుడైనట్టు కనిపిస్తాడు.]

ఫణి : ఊఁ-ఎత్తునీదే శంకరం. కానీ.

[శంకరం మళ్ళీ వరండాలోకి వెళ్ళి ద్వారంపైన, పక్కన గూళ్ళు తడిమి చూస్తూ—]

శంక : (ఈ సారి ఆత్మ విశ్వాసం కాస్త సన్నగిల్లి) నేను చూడకుండా ఇక్కడెక్కడన్నా పెట్టి వుండొచ్చు. గజపతి దాంతో తాళం తీసి

హాల్లోకి రాకముందే మళ్ళీ తాళంచెవి అక్కడ పెట్టేసివుండొచ్చు గదండీ. అది తీసుకుని ఫణి—

జా : (విసిగినట్లు మధ్యలో ఆపుతూ) ఆల్ రైట్ - ఆల్ రైట్ మిస్టర్ శంకరం! వినడానికిదంతా చాలా బాగానే వుందిగాని మీ వన్నీ చాలా డొంకతిరుగుడు ఐడియాలు. పుస్తకాల్లో రాసినట్లు మాట్లాడ తారు. ఇంతకీ ఆ కేసు క్లోజయిపోయింది. నే వచ్చిన సంగతి మటుకు ఇంకా అగమ్యంగానే వుంది.

శంక ; కాని ఇది చావుబతుకుల సమస్యండీ బాబూ - కాస్త ఆలోచించి చూడండి—

జా : ఇప్పుడు నేనాలోచించాల్సిందల్లా ఫణిగారికా డబ్బు ఎక్కడిదన్న విషయం మాత్రమే! అది తేలిపోయింది! వెల్ - మిష్టర్ ఫణీ! ఐ విల్ గెట్ ఎలాంగ్ (I will get along]

[వెళ్లబోతూ ఆగి యదాలాపంగా అన్నట్లు-]

ఆఁ-అన్నట్టు....మీదగ్గర ఏదైనా బ్లాకలర్ లెదర్ కేస్ వుండేదా?

[దాంతో ఫణి తల్లకిందులైనాడు. కొన్ని సెకండ్లసేపు జవాబివ్వ లేదు. శంకరంకూడా ఏదో జ్ఞాపకం వచ్చి అంతలోనే మర్చి పోయి దేనికోసమో వెతుకున్నట్టు గది అంతా కలయజూస్తూం టాడు]

ఫణి ; మీకు దొరికిందా యేమిటప్పుడే?

జా : ఏం - మీరు పారేసుకున్నారా?

ఫణి : అవునండీ. ఎక్కడో మర్చిపోయాను. ఎవళ్ళ చేజిక్కిందో యేమిటో అదృష్టవంతులు! ....అది పోయినట్టు మీ పోలీసులకి నేనింకా రిపోర్టుఅయినా చెయ్యలేదు-అప్పుడే మీకెలా తెలిసింది?

జా : ఆతుకొక్కాజీస్ క్యాషియరు, మార్వాడీకూడా అన్నారట నేండి మీరందులోంచే డబ్బు తీసి యిచ్చారని!

శంక : Wait a minute inspector. ఆ పెట్టె ఎక్కడుందో నే చెప్పగలననుకుంటాను.

[శంకరం సోఫాదగ్గరకు వెళ్ళి అందులో బట్టలూ అవీ ఎత్తిచూసి ఫణివైపు తిరుగుతాడు.]

ఎక్కడపెట్టావ్ ఫణీ అది?

ఫణి : (అనుకోకుండానే మంచందగ్గరసాజరిగి) ఏమిటి?

శంక : (మంచంకేసివస్తూ) ఇందాక నే వచ్చినప్పుడు అలాంటిపెట్టె ఒకటి చూశానే ఇక్కడ!

[మంచంమీద పడివున్న గుడ్డల్ని తొలగిస్తాడు. లెదర్ కేస్ బైట పడుతుంది అది తీసుకువెళ్ళి టేబులుమీద పెట్టి తాళం తడిమి చూస్తాడు.]

తాళంచెవి వుందా ఫణీ ?

ఫణి : నీకేమైనా పిచ్చెక్కిందా యేమిటి ?

[శంకరం అల్మైరాలో వెదికి తీగెమేకు ఒకటి తెస్తాడు]

శంక : తాళంచెవి లేకపోయినా ఫర్వాలేదనుకో....

జా : (కటువుగా) పెట్టె ఎక్కడో మర్చేపోయా నన్నారు ?

[శంకరం తాళం తీసే ప్రయత్నంలో వున్నాడు.]

ఫణి : డోన్ట్ బీ యె ఫూల్ శంకరం! (జేబులు వెతుక్కుంటూ) తాళం చెవి ఇక్కడెక్కడో వుండాలి. ఇస్తానుండు.... పెట్టె నేనిక్కడికి తెచ్చిన సంగతి నాకు గుర్తేలేదు ఇన్స్పెక్టర్. మనిషిని తిరుగు

తున్నాను.మాట్లాడుతున్నానన్న మాటేగాని నావాళ్ళు నాకు తెలియ డం లేదు. రేప్పొద్దున పద్మ—

[తాళంలో మేకు బిగించి శంకరం గబిక్కన తిప్పుతాడు· తాళం విడిపడుతుంది.]

శంకరం :

[శంకరం పెట్టె తెరుస్తాడు, పైన పరిచి వున్న న్యూస్‌పేపరు తొలిగించి పెట్టెలోంచి ఇరవయ్యో ఇరవైమైదో రూపాయినోట్ల కట్టలు పైకి తీస్తాడు ఇన్‌స్పెక్టరు hat, ఫైల్సూ సోఫాలోకి విసి రేసి టేబులుదగ్గరకు వెళ్ళి వాటిని పరీక్షిస్తాడు]

జా : రెండువేల పైనే వున్నట్టున్నాయి. ఎక్కడివదండీ మీకీ డబ్బు? ఇదికూడా పేకాటలో గెల్చిందేనా ?

శంక : అసలతనికి పేకాట చేతరాదు సర్.

ఫణి : శంకరం !

శంక : ఈ డబ్బెక్కడిదో కూడా నేనిప్పుడు చెప్పగలను. అసలిది ఇక్కడ ఈ గదిలో పద్మను హత్యచేసిన తర్వాత ఆ గజపతి అనే హంతకుడికి ఇవ్వాల్సిన కిరాయి. కాని అనుకున్నది అను కున్నట్టు జరగలేదు, పద్మ బదులు గజపతి చచ్చిపోయాడు. ఇక గజపతి కివ్వాల్సిన అవసరం లేకపోయింది.

ఫణి : ఇప్పుడు నేను నవ్వాలో ఏడవాలో అర్థం కాకుండా వుంది ఇన్‌స్పెక్టర్ ! దయచేసి మీరీ న్యూసెన్స్ ఇక్కణ్ణుంచి తొలిగించ గలరా ?

శంక : (రేగిపోయి) నిజం చెప్పవోయ్ మరి ! పేకాట చేతకాని నీకు - కళ అనీ నాటకాలనీ పేరుకోసం వున్న పరువంతా పాడుచేసు కుని అప్పైనా పుట్టని నీకు ఎక్కణ్ణుంచి వచ్చిందింత డబ్బు ఒక్కసారిగా ?

ఫణి : నిజంగా నీకు తెలుసుకోవాలని వుందా శంకరం ? (అతనివంకే సూటిగా చూస్తూ పెదవులు బిగబట్టి) తెలుసుకున్నందువల్ల నష్టం చాలా వుంటుంది చెప్తున్నా.

శంక : (చాలా నీచంగా) కమాన్ ! (Come on)

ఫణి : (లేస్తాడు) సరే - కోరి కొరివితో తల గోకుతున్నావ్. పద్మ పరిస్థితి మరీఅర్థాన్నం చేస్తున్నావ్ !.... నేనారోజు రాత్రి ఇంటికొచ్చేసరికి పద్మ గజపతి పక్కన మోకాళ్ళమీద కూర్చుని అతని జేబులన్నీ గాలిస్తోంది. మాటిమాటికీ తనదేదో వాడిదగ్గరుందని అనటంసాగించింది. కాని అదేం దొరికినట్టులేదు. మనిషికి అప్పటికే బాగా పిచ్చెక్కిపోయినట్టుంది అందుకనే వెంటనే పోలీసులొచ్చినా వాళ్ళని దాంతో మాట్లాడనియ్యలేదు నేను. ఆ పరిస్థితిలో నోటికొచ్చిన అబద్ధమల్లా ఆడేసేది. ఆ మర్నాడు పొద్దున ఈ డబ్బు చూపించింది. చూపించి ఏమన్నదో తెలుసా ? పోలీసులు తన్ను పట్టుకెళ్ళడమే జరిగితే ఇదిమటుకు వాళ్ళకంట పడనియ్యవద్దంది దాన్ని అరెస్టుచేసిన తర్వాత ఈ పెట్టె అలానే తీసుకెళ్ళిపోయి నేషనల్‌బ్యాంక్ సేఫ్ డిపాజిట్‌లో పెట్టించాను. డబ్బవసరమైనప్పుడల్లా పెట్టె తీసుకుని కావల్సిన డబ్బు తీసుకుని మళ్ళీ మరో బ్యాంకులోనో ఏస్టేషను క్లోక్‌రూంలోనో దాచిపెట్టేవాణ్ణి. ఇలా పిల్లి పిల్లల్ని తిప్పినట్టు వూరంతా తిప్పా నీ పెట్టె. ఇది కనక మీకు కనిపిస్తే పద్మకి వున్న కాస్త ఛాన్సూకూడా పోతుందని తెలుసునాకు. ఆ రోజు ఎందుకనో వాణ్ణి పొడిచి చంపేసిందిగాని అసలా పూట ఈ డబ్బిచ్చి వాడి నోరు కట్టేద్దామని దాని వుద్దేశం ?

జా : ఐతే ఈ బ్లాక్‌మెయిల్ సంగతి మీ కప్పుడే తెలుసునన్నమాట !

శంక : ఎవరైనా ఈమాట నమ్ముతారనేనా నీ వుద్దేశం ?

ఫణి : చాలా తేలిగ్గా నమ్మతారు గనకనే ఇన్నాళ్ళూ చెప్పకుండా వూరుకున్నాను. అదీగాక ఆ సంగతి బైటపడితే. కట్టుకున్న మొగుణ్ణి నా కెంత అవమానం? ఆ పరిస్థితిలో వుంటే మీరైనా అంతే.!

జా : ఊఁ....కోర్టు తీర్పుకి అనుకూలంగానే వుంది మరి మీరుచెప్పేది,

శంక : ఇంతేనా మీ రనగలిగింది? రేపు పద్మని ఉరిదీసేస్తారండీ బాబూ!

జా : (విసుగ్గా) ఈ గొడవంతా నా చేతుల్లోంచి ఎప్పుడోదాటిపోయింది విచారణ జరుగుతోంది - డీఫెన్సు పెట్టుకున్నారు-

శంక : అవున్లేండి అసలుసంగతి బైట పడడం మీకూ మంచిదికాదు. అసలు ఖూనీకోరుని వదిలేసి మరో ఆమాయకురాలికి ఉరిశిక్ష వేయించారంటే మీకుమటుకు అప్రతిష్టకాదూ!

ఫణి : ఇదుగో-నువ్విహ నిక్కణ్ణుంచి దయచెయ్యడం మంచిదనుకుంటాను.

శంక : దయచెయ్యను మరీ!(గుమ్మందాకావెళ్ళి ఆగి) కాని- నువ్వొక్క పొరబాటు చేశావ్! ఈ డబ్బుసంగతి పద్మతో చెప్తే ఏంచేస్తుందనుకుంటున్నావ్?

ఫణి : ఏంచేస్తుంది? తనకేం తెలీదంటుంది.

శంక : తన వీలునామాకూడా మార్చవచ్చు.

[ఫణి నరాలన్నీ ఒక్కసారి బిగదీసుకుపోయి నట్లుంటుంది. శంకరం తలుపు తెరుస్తూ ఫణివంకే సూటిగా చూస్తూ—]

పాపం! ఈ దారుణమంతా వొత్తి పుణ్యానికి చేసినవాడవౌతావ్!

నిష్ప్రయోజనం నీ శ్రమంతా! బూడిదలోపోసిన పన్నీరు!

[తనవెనకాలే తలుపు ధడాల్ని మూసుకుని వెళ్ళిపోతాడు శంకరం. ఒక్కక్షణం అవకాశం. ఫణి ఇన్స్పెక్టర్ వైపు తిరుగుతాడు.]

ఫణి : ఆ పిచ్చిశంకరాయ్ చెప్పిన కథ నేను కోర్టులో చెప్తాననుకోండి.. ఎవరైనా నమ్ముతారంటారా ?

జా : నిజంచెప్పాలంటే నామటుకు నాకే నమ్మకంలేదుసార్. మీభార్యని రక్షించుకోడానికి మీరుపడే తాపత్రయంచూసి కోర్టు నవ్వుకుంటుంది. అంతే....పాపం - మిమ్మల్ని చూస్తుంటే మటుకు నాకు చాలా విచారంగా వుంది.

[ఫణి పక్కమీద కూర్చుంటాడు]

ఫణి : వాడిప్పుడు పద్మని చూడటానికి వెళ్తాడనుకోండి- లోపలికి పోనిస్తారా ? అది.... ఈ.... ఈ అంతిమసమయంలో.... దాని మనసు మరీ వేధపడటం నాకిష్టంలేదు.

జా : మీ లాయరుకి ఫోన్ చేసి చూడండి. అతను అడ్డుపడొచ్చు. (టేబులుమీదవున్న డబ్బుచూపుతూ) ఎక్కడో ఓచోట నిజంగా పారేసుకోకముందే ఆ డబ్బు మీరు జాగ్రత్తచెయ్యడం మంచిది.

ఫణి : థేంక్స్. చేస్తాను.

జా : (సోఫాలోంచి ఫైల్సు తీసుకుంటూ) అన్నట్టు - మీతో చెప్దామనుకున్నాను - పద్మావతిగారి వస్తువులు కొన్ని ఇంకా ఆ పోలీస్ స్టేషన్‌లోనే వుండిపోయాయి-

ఫణి : ఏం వస్తువులు ?

జా : ఏవో పుస్తకాలు- hand bag - అంతే ననుకుంటాను ఎప్పుడో అప్పుడు మీరువెళ్ళి తెచ్చుకోండి. వెంటనే ఇచ్చేస్తారు వాళ్లు.

[ఇన్స్పెక్టరు ఫైల్సు, hat. చేతబట్టుకుని సోఫామీదేవున్న ఫణి రెయిన్‌కోటు తీసుకుని చేతిమీద వేసుకొని ఫణిదగ్గరకు వచ్చి చెయ్యిజాపుతాడు.]

వెల్-గుడ్‌బై మిష్టర్ ఫణి. యిక మళ్ళీ మనం కలుసుకోమనుకుంటాను.

ఫణి : (కరసంచాలనంచేస్తూ)గుడ్ బై యిన్‌స్పెక్టర్ అండ్ థ్యేంక్యూ. [ఇన్‌స్పెక్టరు బైటికివెళ్ళిపోతాడు· వరండాలో అడుగులచప్పుడు కూడా వినిపించకుండా పోయేదాకా అలానే కూర్చునిపోయాడు ఫణి. ఆ తర్వాత గబగబా లేచి అల్మైరాలోంచి హ్విస్కీ-బోటిల్, గ్లాసు తీసి ఒకగుటక వేస్తాడు. నోట్లకట్ట ఒకటితీసి పేకముక్కల్లా కలుపుతాడు. లెదర్‌కేస్ తీసుకొని తాళం పరీక్షించిచూసి మళ్ళీ మంచంమీద పడేస్తాడు. నోట్లకట్టలన్నీ ఓ న్యూస్‌పేపర్లోచుట్టి పార్సిల్‌చేసి చంకన పెట్టుకుని హాలుగుమ్మందాకా వెళ్ళి తిరిగి వచ్చి, తనదే ననుకొని ఇన్‌స్పెక్టరుగారికోటు తీసుకుని చేతిమీద వేసుకొని వరండాలోకివెళ్ళి తలుపు వేసేస్తాడు. తాళం క్లిక్‌మని పడుతుంది·

వరండాలో దూరానికిపోతున్న అడుగుల చప్పుడు....

ఒక్క-క్షణం అవకాశం——

ఆ తలుపు తాళంలో చెవిపెట్టి తిప్పిన శబ్దం- తలుపు తెరుచుకుని ఇన్‌స్పెక్టరు లోపలికి వస్తాడు. గది అంతా ఓసారి కలయజూసి చేతిలోనికోటు,ఫైల్సు, hat మంచంమీదపడేసి టెలిఫోన్‌దగ్గరకు వెళ్ళి ఒకనంబరు డయల్ చేస్తాడు.]

పోలీస్: (రిసీవరులోంచి స్వరం వినిపిస్తుంది) ఖైర్‌తాబాద్ పోలీసుస్టేషన్‌।

జా : హల్లో గోవింద్‌సింగ్. జాఫర్ స్పీకింగ్ హియర్-

గో : జీ. హుజూర్.

జా : ఫణి ఇప్పుడే బైటికివెళ్ళిపోయాడు. నేనుమళ్ళీ లోపల ప్రవేశించాను. యెవళ్లుండాల్సినస్థానంలో వాళ్ళంతా వున్నారుగదూ?

గో : వున్నారు సర్.

జా : ఆల్‌రైట్, కేతిగాడెవడూ రంగంలోకిదూక్కముందే నీ పాత్రల్ని ప్రవేశపెట్టు. ఆట్టే టైమ్ లేదు. యు మస్ట్ యాక్ట్ వెరీ క్విక్ (you must act very quick)

గో : యస్ సర్.

ఇనస్పెక్టరు ఫోను దింపేస్తాడు· ఫణి బ్యాంకు పుస్తకం కోసం వెతుకుతాడు. చివరకు అవి డ్రాయరులో కని పిస్తుంది. అది తీసికొని అతను పరిశీలిస్తుండగా తెరవెనక తోట తలుపులు బలవంతంగా తెరుచుకున్న చప్పుడు వినిపిస్తుంది. ఇనస్పెక్టరు గబగబా వంటయింట్లోకి వెళ్తాడు. ఎవరో తలుపులు తోసుకుని తెరలు ఒత్తిగించుతారు. బైటి సూర్యకాంతి కొంత వెంటనే లోపలకు చంగున గంతువేసి వస్తుంది. దాంతోపాటు శంకరం ప్రవేశిస్తాడు. సరాసరి టేబులు దగ్గరకు వెళ్ళి దేని కోసమో గబగబా వెతుకుతాడు. ఇనస్పెక్టరు వంటయింట్లోంచి వస్తాడు.]

జా : వెల్ వెల్ మిస్టర్ శంకరం!

[శంకరం ఉలిక్కిపడి తలయెత్తి చూస్తాడు.]

శం : మీరా? మీరేంచేస్తున్నారింకా యిక్కడ?

జా : ఆ సంగతి మీ కనవసరం. ముందు మీరిక్కణ్ణుంచి వెళ్ళిపోవాలి. తక్షణం.

శం : (ఇనస్పెక్టరుచేతిలోని pass book చూసి, గభాల్న లాక్కొని) ఈ బ్యాంక్ ఎకౌంటు బుక్ కోసమే వచ్చాన్నేనూను.
[గబగబా పేజీలు తిరగేసి ఎంట్రీలు చూస్తాడు.
కొంచం ఆలోచనలో పడతాడు మనిషి.]

జా : ఏం? ఐదువేలు విత్‌డ్రా చేసినట్టు లేదని చూస్తున్నారా?

శం : (చివరి ఎంట్రీచూచి) ఆఖరుసారి డబ్బుతీసింది సెప్టెంబరు 27న. అంటే హత్య జరిగిన దానికి ముందు రోజన్నమాట ! ఆ తర్వాత మరి దమ్మిడీ విత్‌డ్రా చెయ్యలేదు....

[మళ్ళీ ఎంట్రీలు చూస్తూ, హఠాత్తుగా—]

కాని, ఈ పాయింటు గమనించారా మీరు ? ప్రతి వారం పది రోజులకీ ఓసారి నూరు నూటయాభై విత్‌డ్రా చేశాడు. అదంతా ఓచోట కూడబెట్టి వుండొచ్చు.

జా : అది జాయింట్ అక్కౌంట్. మీరు చెప్పిన పని పద్మావతిగారు చేసినా చేసివుండొచ్చు అసలు ముందు నిన్ను లాకప్‌లో వుంచి నోరు కట్టెయ్యాల్సింది నేను. ప్లానంతా నాశనమయ్యేది కాస్తైతేనూ—

శంక : ఏమిటండీ మీ ప్లాను—?

జా : ష్ !—

[వీధిగేటు తెరిచిన కిఱ్ఱు చప్పుడు....వరండాలో ఎవరో నడిచి వస్తున్న సవ్వడి—ఇన్‌స్పెక్టరు శంకరాన్ని నిశ్శబ్దంగా వుండమని సౌంజ్ఞ చేసి హాలు తలుపువైపు నిర్దేశిస్తాడు.
ఇద్దరూ గుమ్మంకేసే చూస్తూ నిశ్చలంగా నిలబడిపోతారు. ఎవరో తాళంలో చెవి పెట్టిన అలికిడి....ఒక్క క్షణం నిశ్శబ్దం....తలుపు ఎవరో తట్టుతారు ... ఒక్క రవ్వ అవకాశం .... మళ్ళీ తలుపు తట్టుతారు....శంకరాన్ని ఏమాత్రం కదలవద్దని ఇన్‌స్పెక్టరు చెయ్యెత్తి సూచిస్తాడు .... మళ్ళీ అడుగుల చప్పుడు దూరంగా వెళ్ళిపోతుంది. వీధిగేటు మళ్ళీ వేసిన కిఱ్ఱుచప్పుడు.
ఇన్‌స్పెక్టరు ఏదో భారం దిగినట్టు ఊపిరివదుల్తాడు]

శంక : ఏమిటండీ ఈ గొడవంతా ?

జా : (కడుపుమంటతీరా) నాలుగు పుస్తకాలు చదివి సినిమాలుచూసి మా కేసులు నాలుగు స్టడీచేసి మిడిమిడి జ్ఞానంతో తగుదునమ్మా అంటూ క్రైం డిటెక్షన్‌కి బయల్దేరే మీలాంటి గ్రంధారిగాళ్ళు మా వ్యవహారాల్లో వేలెట్టకుండావుంటే చాలు - మా విధులు మేం సక్రమంగానే నిర్వహించుకోగలం ఏ గొడవాలేకుండా !

[తెరిచి వున్న తోటగుమ్మందాకా వెళ్ళి అక్కణ్ణుంచి తోటలోకి చూస్తూ నిలబడతాడు. హఠాత్తుగా వెనక్కి తగ్గి శంకరాన్నికూడా పక్కకు తప్పుకోమని చేత్తో సౌజ్ఞలు చేస్తాడు. కొన్ని క్షణాల అనంతరం తోటలోంచి పద్మ ప్రవేశిస్తుంది. ఆమె వెనకనే యూనిఫారంలో వున్న పోలీస్ కాన్స్టేబుల్‌కూడా వస్తాడు.

పద్మ రెండో అంకంచివర ఏ దుస్తుల్లో వుందో అదేదుస్తుల్లో వుంటుంది. ఆనాటి చేతిసంచియే చేతిలోవుంది. లోపలున్న మనుషు లిద్దర్నీచూసి ఆమె గుమ్మంలోనే ఆగిపోతుంది. మనిషిని చూడగానే గత మూడు నాలుగు నెలల్లోనూ అమితంగా ధవ్య చెందినట్లు కనిపిస్తుంది. అంతా అగమ్యగోచరంగా - వున్నట్టు శూన్యంలోకి చూస్తున్నట్లు - ఆమె చూపులు అర్థవిహీనంగా ఏం అర్థంకానట్టుగా వుంటాయి]

పద్మ : శంకరం :

శం : పద్మా ! (ఆమెను సమీపిస్తాడు)

పద్మ : వా రేరీ ?

శం : అతను- అతనిప్పుడే ఎక్కడికో వెళ్ళాడు.

పద్మ : ఇప్పు డొచ్చేస్తారా మళ్ళీ ?

జా : ఖచ్చితంగా చెప్పలేం....ఆల్‌రైట్ జలాల్.

[జలాల్ శాల్యూట్‌చేసి వచ్చినదోవనే వెళ్ళిపోతాడు.]

ఇందాక తలుపు తట్టింది మీరేనా ?

పద్మ : నేనే. (ఆశ్చర్యంతో) అప్పుడు లోపలేవున్నారా మీరు ? తలుపు తియ్యలేదేం మరి ?

జా : మీ దగ్గర తాళంచెవి వుండాలిగా - అదెందుకని ఉపయోగించ లేదు ?

పద్మ : అది పెట్టి చూశానుగాని పట్టలేదు.

జా : ఎందుకని ?

పద్మ : ఏమోమరి-తాళమేమైనా మార్చారేమో.

జా : మీ bag ఓసారి ఇలా ఇస్తారా ?

[పద్మ ఇస్తుంది. ఇన్‌స్పెక్టర్ అందులోంచి పర్సుతీసి దాంట్లోంచి తాళంచెవి తీస్తాడు. దాన్ని ఆమెకు చూపుతూ—]
ఇది మీ తాళంచెవి కాదని మీకు తెలుసు. తెలీదూ ?

పద్మ : తెలీదే.

జా : (ప్రక్క-మీది లెదర్‌కేస్ తీసి చూపుతూ) మీ వారు దీని సంగ తంతా కూడా మాకు చెప్పేశారు. మీరుకూడా ఏం దాచకుండా చెప్పెయ్యడం మంచిది.

పద్మ : (అంతా అగమ్యంగా వుంది) ఏమిటిది ? ఏం చెప్పారు? .... ఎందుకు నన్నిలా....? నాకేం తెలీడంలేదు

జా : (మరోక్షణం ఆమెవంక నిశితంగా చూసి) అవును - నిజమే. మీకేం తెలీదు- (సానునయంగా) రండి-ఇలా కూర్చోండి.

[పద్మ సోఫా దగ్గరకు వెళ్ళి అందులో కూర్చుంటుంది. ఇన్‌స్పెక్టర్ తాళంచెవి మళ్ళీ పర్సులోపెట్టి hand bag లో పెడ్తాడు.]

శంక : ఏమిటండీ ఇదంతా ?

జా : (తోటగుమ్మం దగ్గరకు వెళ్ళి) జలాల్ !

జలాల్ : (తోటలోంచి) సార్ (వస్తాడు)

జా : ఈ సంచీ స్టేషనుకు పట్టుకెళ్ళు.

జ : జీ హుజూర్.

[సంచీ తీసుకు వెళ్ళిపోతాడు]

జా : దేఖో జలాల్....అది ఎవళ్ళకూ కనిపించకుండా....

[అంటూ తనుకూడా తోటలోకి వెళ్తాడు]

శంక : ఏమిటి పద్మా ఇదంతా ? అసలు నువ్వెందుకు వచ్చావిక్కడికి ! ఎలా వచ్చావ్ ?

పద్మ : (ఏదో స్వప్నంలో వున్నట్టు) నాకేం తెలీదు .... (నెమ్మదిగా) గంట కిందట జైలువార్డెను వచ్చి నన్ను ఇంటికి తీసికెళ్లా లన్నాడు. ఇద్దరు మఫ్టీలోవున్న పోలీసులు కార్లో తీసుకొచ్చి ఈ వీధి మలుపులో చాలాసేపు అట్టేపెట్టారు. చివరికీ ఆపోలీసు వచ్చి ఇహ నే వెళ్ళిపోవచ్చునని చెప్పాడు. తీరావస్తే తలుపు తాళంరాలే దెంతకీనూ. వెనక్కి తిరిగి వెళ్తుంటే ఇంకా వీధిలోనే నిలబడి వున్న ఆ పోలీసు ఇలా తోటలోంచి తిప్పి తీసుకొచ్చాడు.(లేస్తూ) ఫణి యేరీ ? ఇవ్వాళపొద్దున నన్ను చూడటానికి రావాల్సిందసలు. కాని రాలేదు. ఆయనకేం అపాయం సంభవించలేదు గదా ?

శంక : అతనికేం అపాయం ? పూలరంగడిలా వున్నాడు.

[ఇన్‌స్పెక్టరు తోటలోంచి వచ్చి తలుపు దగ్గిరసా వేస్తాడు.]

ఏమండీ ఇన్‌స్పెక్టరు గారూ-దయచేసి మీ మనస్సులో వున్నదేదో చెప్పండీ నా ప్రాణాలు కొట్టుకుపోతున్నాయి !

జా : నే చెప్పవలసిన విషయం పద్మావతిగారికి చాలా బాధ కలిగించ వచ్చు.

పద్మ : బాధ మర్చిపోయి చాలా రోజులైంది. చెప్పండి ఫర్వాలేదు.

జా : మాకు చాలా బలమైన నిదర్శనాలు కొన్ని దొరికాయి. వాటిని బట్టి చూస్తుంటే మిమ్మల్ని హత్య చేయించడానికి మీ భర్తగారు చాలా గట్టి ప్రయత్నం చేశారని నమ్మకంగా అనుమానించాల్సి వస్తోంది....

[పద్మ ఏం అర్థంకానట్టు ఇన్‌స్పెక్టర్‌వంక ఓ క్షణం నిశ్చలంగా చూస్తుంది. ఆ తర్వాత శంకరంవైపు తిరుగుతుంది. ఇప్పటిదాకా శంకరంకూడా ఇన్‌స్పెక్టరువంక చూస్తున్నాడు.]

శంక : అవున్నిజమే పద్మా-ఆ రాత్రి గజపతిని పంపింది అతనే. ఆ పంపించిందికూడా నీ ప్రాణాలు తీయించడానికే!

పద్మ : ఇది మీ కెప్పటిమట్టీ తెలుసు?

జా : (ఆశ్చర్యంతో) మీకూ ఈ అనుమానం కలిగిందా?

పద్మ : (మనస్సులో ఆకళింపు చేసుకుంటూ) లేదు- ఎప్పుడూ కలగ లేదు- కాని.... కాని.... (ఉన్నట్టుండి ఒక్కసారిగా గది అంతా కలయజూచి) ఏమిటిది-

శంక : (ఆమె నడుంమీదగా తనచేయి వార్చి పట్టుకుని) కంగారు పడకు పద్మా. నే వున్నాగా- మరేంభరవాలేదు. (ఆమెను నెమ్మదిగా సోఫాలో కూర్చోబెట్టి, ఇన్‌స్పెక్టరువైపు తిరిగి) ఇందాక నే నీ థియరీయే చెప్తే నాన్సెన్స్-నాదంతా చాలా డొంకతిరుగుడు ఆలోచన అన్నారు-

జా : లేకపోతే ఫణి గుట్టంతా తెలిసిపోయిందని అతని ముందే గుట్ట బయలు చేసి అతను మరి పట్టుబడకుండా జాగ్రత్త పడమని వార్నింగ్ ఇయ్యమంటారా నన్నుకూడా మీలాగా?

శంక : (తన తెలివి తక్కువకు విచారిస్తూ) అవును.... పద్మని గురిం చిన ఆందోళనతో ముందూ వెనకా ఆలోచించలేకపోయాను.... ఇంతకీ మీ రేలా పసిగట్టా రా విషయం?

జా : దీనికి మొదటి ఆధారం నాకు చాలా ఛాన్స్‌గా దొరికింది. (పద్మ వైపు తిరిగి) ఆయనీ మధ్య డబ్బు చాలా విరివిగా ఖర్చు పెడు తున్నాడని తెలిసింది. పెద్దపద్దులన్నీ కలిపిజూస్తే నిన్నటివరకూ పదిహేను వందలదాకా అయింది. మిమ్మల్ని అరెస్ట్ చేసినప్పటినుంచే ఆయన చేతుల్లో డబ్బు బాగా మెసుల్తోంది. ఇంతడబ్బు ఒక్కసారిగా ఎలావచ్చిందో ముందు తెలుసుకోవాలనుకున్నాను. అప్పుడు జ్ఞాపకం వచ్చింది-ఆ రోజు రాత్రి ఈ యిల్లు గాలిస్తుం డగా డ్రాయర్లో బ్యాంక్ అకౌంట్ పుస్తకం చూసినట్టు. వెంటనేవచ్చి వెరిఫై (veryfy) చేద్దామనుకున్నాను. అందుకని నిన్న జైలుకి వెళ్ళి మీ hand bag ఓసారి చూసి యిస్తానని తీసుకుని అందులోంచి తాళంచెవి సంగ్రహించాను. చాలా ఇర్రెగ్యులర్ (irregular) అనుకోండి- కాని దీని అంతేదో తేల్చు కోవాలని మొండి పట్టుదల ఆవేశించింది. ఏదో పొరబాటు చేసి నట్టు మనస్సులో ఏదో సంశయం బాధిస్తూండేది. ఇవ్వాళ పొద్దున ఫణిగారు ఇంట్లోలేనప్పుడు ప్యాస్‌బుక్ చూద్దామని వచ్చాను. కాని చూడనేలేదు. అసలు తలుపు తీసుకుని ఈ హాల్లోకికూడా రాలేక పోయాను. మీ సంచీలోంచి తీసిన తాళంచెవి ఈ తాళానికి పట్ట లేదు. అది దీనిదికాదు.

[మేడపై నుంచి సన్నగా పోలీస్ విజల్ వినిపిస్తుంది అంతా అటు చూస్తారు. ఇన్‌స్పెక్టర్ హడావుడిగా-]

ఫణి వస్తున్నట్టున్నాడు- ఎవళ్ళూ కదలరాదు- మెదలరాదు- చిన్న మెత్తుచప్పుడు కారాదు- జాగ్రత్త!

[వీధిగేటు తెరిచి మూసిన కిఱ్ఱుచప్పుడు- వరండాలో అడుగులు గుమ్మందాకా వచ్చి ఆగిపోతాయి. కాస్త దీర్ఘ నిశ్శబ్దం. మళ్ళీ అడుగులు వెనుదిరిగి దూరంగా సాగిపోతాయి. ఈసారి ఫణి తాళంచెవితో తాళం తియ్యడానికి అస లతనిదగ్గర తాళంచెవిలేదు. మళ్ళీ వీధిగేటు తెరుచుకుని మూసుకుంటుంది. కొద్ది క్షణాల తర్వాత ఇన్‌స్పెక్టరు హాలు తలుపు తెరిచి ఎవర్నో పిలుస్తాడు]
రామ్‌సింగ్ ?

రామ్‌సింగ్ : (మఫ్టీలోవున్న పోలీస్- మేడపైనుంచి మెట్లమీదకు దిగి) జీ హుజూర్ ?

జా : ఎవరది ?

రామ్ : ఫణిగారే సర్.

జా : ఎటువెళ్లాడు మళ్ళీ ?

రామ్ : పోలీస్ స్టేషనువైపుకు !

జా : అచ్ఛా (హాలుతలుపులువేసి, టెలిఫోన్‌దగ్గరకు వెళ్తూ-) అబ్బ- గుండె లాగిపోయినంత పనైంది నాకు-

(టెలిఫోను రిసీవరు యెత్తి నంబరు డయిల్‌చేసి-)

ఖైర్‌తాబాద్ పోలీస్‌స్టేషన్.... హలో గోవిందసింగ్ !

గోవిం: యెస్సార్-గోవిందసింగ్ స్పీకింగ్

జా : నేను జాఫర్ని. చూడు గోవింద్- రెయిన్‌కోటు మారుపడ్డట్టు ఇప్పుడే కనుక్కున్నాడు ఫణి తాళంచెవిగేక ఇంట్లోకి రాలేక పోయాడు. ఇక స్టేషన్‌కు రావచ్చు. Hand bag తీసుకుని జలాల్ వచ్చాడా ?

గో : వచ్చాడు సర్.

జా : గుడ్- ఆ. చూడు- ఫణి రాంగానే ఆ పుస్తకలు, hand bag ఇచ్చేసెయ్యండి. Bag లోతాళంచెవి ఎలాగైనా అతని కళ్ళ బడేట్లు చెయ్యాలి మీరు. తన రెయిన్‌కోటే కాలంటాడనువా కొండి- ఆసంగతి మీకేం తెలీదనీ నేనెక్కడికో చాలాదూరం వెళ్ళేననీ సాయంత్రదాకా తిరిగి రాననీ బుకాయించెయ్యండి.

గో : ఆల్‌రైట్, సర్.

జా : అర్థమైంది గదూ ?

గో : ఎస్సార్.

జా : మళ్ళీ అతనక్కడ బయద్దేరగానే నాకు ఫోన్ చెయ్యి ?

గో : ఎస్సార్.

[ఈ ఫోను సంభాషణ జరుగుతున్నప్పుడు శంకరం మెల్లగా హాలు తలుపు తెరిచి ద్వారబంధంపైన. పక్కన గూళ్ళల్లోనూ ఆలోచనా పూర్వకంగా వెదుకుతాడు దేనికోసమో. గజపతి వచ్చి పడిపోయిన స్థలంకేసి కాస్సేపు చూసి అక్కణ్ణుంచే మళ్ళీ ద్వార బంధం పైకి చూస్తాడు. చేత్తో వెదుకుతాడు. ఏమీ దొరకదు - సమస్య తేలక అతని మొహం కుంచించుకుంటుంది. ఇన్‌స్పెక్టరు ఫోను దించేసి అంటాడు—]

జా : ఏమండీ ఔత్సాహిక పత్తేదారుగారూ ! అంతేమైనా చిక్కిందా ?

శం : పద్మ తాళంచెవి ఏమైనట్టండీ మరి ?

[ఇన్‌స్పెక్టరు వరండాలోకి వెళ్ళి మూడో మెట్టుమీద తివాసీకింద నుంచి తాళంచెవి తీసుకొచ్చి ఇద్దరికి చూపిస్తాడు]

జా : ఇదుగో మీ తాళంచెవి!

పద్మ : ఆదేమిటి-అది నాదెందుకౌతుంది ?

జా : అవును. మీదే ఇది!

[మళ్ళీ తాళంచెవి తీసికెళ్ళి ఇందాకటిచోట వుంచి తలుపేసి వస్తాడు.]

సరిగ్గా అరగంట తన్నుకు చస్తేగాని దొరికింది కాదది!

శంక: అది అక్కడేవుంటే - మరి....ఇప్పుడు ఫణి దాన్ని తీసుకుని ఎందుకు వాడలేదు?

జా : అదింకా అక్కడే వుందని అతను గుర్తించలేదు కనకనే! తన భార్య hand bag లో వున్నది అదేనని అతని అభిప్రాయం. మీరు చాలా వరకూ నిజమే వూహించారు. (పద్మవైపు తిరిగి) ఫణి గజపతితో చెప్పాడు-తను మీ తాళంచెవి ఆమెట్లమీద వుంచి వెళ్తాననీ గజపతి తిరిగి వెళ్ళిపోయేటప్పుడు ఆ తాళంచెవి మళ్ళీ అక్కడేపెట్టి వెళ్ళాలనీనూ. కాని అనుకోకుండా గజపతి చచ్చిపోయాడు. అందుకని తాళంచెవి ఇంకా అతని జేబులోనే వుందని ఫణి అనుకున్నాడు. అదే అతను పడ్డపొరబాటు. గజపతి సరిగ్గా శంకరంగారు ఊహించిన పనేచేశాడు. (అభినయించి చూపుతూ) అతను వచ్చి ఆ తాళం చెవితో తలుపు తెరిచాడు. తెరిచి లోపలికి రాకముందే తాళంచెవి మళ్ళీ మెట్టుమీద తివాసీకింద పెట్టేశాడు.

శంక: ఐతే ఆ తాళంచెవి అప్పట్నుంచీ అక్కడే వుందన్నమాట! మరి పద్మ bag లో తాళంచెవి—?

జా : అది గజపతి స్వంతం. అదే ఈ యింటిదనుకుని ఫణి అది తీసి bag లో పెట్టేశాడు! నాకూ తోచలేదప్పుడు. బహుశా ఈ యింటి తాళం మార్చాడేమోననుకున్నా. అసలు గజపతి జేబుల్లో ఏం తాళంచేతులూ లేకపోవడం మొదట్లోనే నన్నాశ్చర్యపరిచింది. సంసారమా పాడా వాడికి-ఒంటరిగాడు! బైటికొచ్చినప్పుడు తన

గదికి తాళం వేసుకునేరావాలిగా! అప్పుడొచ్చింది మనకి మెరుపులా ఐడియా? మీ hand bag లో తాళంచెవి తీసుకుని అతని లాడ్జికి వెళ్ళి ఆ తలుపుకి పెట్టి చూశాను. సరిగ్గా సరిపోయింది. ఇహ నక్కణ్ణుంచే స్టేషనుకు ఫోన్ చేశాను.

పద్మ : మరి-మరి నన్నెందుకు తీసుకువచ్చారిక్కడికి ?

జా : ఓ వేళ ఆ తాళంచెవి మీరే అక్కడ పెట్టారేమో! అందుకని అది అక్కడ వున్న సంగతి మీకు తెలుసో తెలీదో నిర్ధారణ చేసుకోవాలిగదా నేను!

పద్మ : నాకు తెలుసుననుకోండి —

జా : (చిరునవ్వుతో) అఁహఁ మీకు తెలీదుగా! తెలిసేవుంటే మీ bag లో తాళంచెవి ఎప్పుడైతే పట్టలేదో అప్పుడే అది మీరు తీసుకునేవారు!

పద్మ : నాకు వొళ్ళంతా తిరిగి పోతున్నట్టుంది. గది-గదిఅంతా గిఱ్ఱున-
[పడిపోబోతున్న పద్మని శంకరం పట్టుకుని నెమ్మదిగా సోఫాలో కూర్చోబెడతాడు. ఇంతలో ఫోను మోగుతుంది]

జా : (ఫోనులోకి) హలో....గోవింద్ ?

గో : (ఫోనులోంచి) యస్సార్. ఇప్పుడే ఫణిభూషణ్‌గారు స్టేషను వదిలి వెళ్తున్నారు.

జా : రైట్: (ఫోను దించేసి హాలు గుమ్మం కేసి వెళ్తూ) ఇంకో నాలుగు నిముషాలు....చాలా జాగ్రత్తగా వుండాలి ఈ కాస్సేపూ! (హాలు తలుపు తెరిచి) రాంసింగ్?

రాం ; (మెట్లమీదకు దిగివచ్చి) హుజూర్?

జా : అతను స్టేషనులో ఇప్పుడే బయల్దేరాడట. ఇటురాగానే సిగ్నల్ ఇస్తావుకదూ?

రాం : జీ

[ఇన్‌స్పెక్టరు తలుపువేసేసి తాళం సరిగా పడిందో లేదో చూస్తాడు. పద్మ చీర చెంగుతో కన్నీళ్ళు తుడుచుకుని వస్తున్న ఏడుపు దిగమింగు కుంటుంది.]

శంక : ఇప్పుడేం జరుగుతుంది?

జా : ఇప్పుడో ఇంకాస్సేపటికో ఇక్కడికొస్తాడు. అతని తాళంచెవి నేను దొంగిలించాను గనక hand bag లో తాళం చెవిపెట్టి చూస్తాడు. అదెప్పుడైతే పట్టదో అప్పుడు తెలిసొస్తుందతనికి తను చేసిన పొరబాటు! రెండూ రెండూ కలిపి చూస్తాడు - నాలుగొస్తుంది. వెంటనే మెట్లమీద తివాసీ యెత్తి చూస్తాడు - తాళంచెవి అక్కడే వుంటుంది!

శంక : కాని అతనలా చూడకపోతే? ఇదంతా మన వూహే అయిపోతుందే! అసలు నిజం అది అని ఎలా నిరూపించగలం?

జా : అది నిజమేననుకోండి....కాని (నెమ్మదిగా దృఢమైన స్వరంతో, హాలు తలుపువైపు తర్జనితో చూపుతూ) ఆ తలుపు అతను తెరిచి తీరాలి! అదెప్పుడైతే తెరిచాడో అప్పుడు స్వహస్తంతో వాఙ్మూలం రాసిచ్చినట్టే!

శంక ; అప్పుడేంజేస్తారు మీరు?

జా : వెంటనే స్టేషనుకు ఫోన్ చేస్తాను. అక్కడ నా ఫోన్‌కాల్‌కోసం కనిపెట్టుకునేవున్నారు మనుషులు సిద్ధంగా.

శంక : మరి-పద్మ-?

జా : ఇహ నావిడకేం ఫర్వాలేదు. ఈ న్యూ ఎవిడెన్స్ డిఫెన్సు లాయరుకు తెలియజేస్తాను రేపాయన కోర్టులో ఇంట్రడ్యూస్ చేస్తాడు—

[మేడమీదనుంచి సన్నంగా ఈల వినిపిస్తుంది. పద్మ, శంకరం గభాల్న లేచి నిలబడతారు. ఇన్స్పెక్టర్ వెంటనే ఓబులుదగ్గరకు వెళ్ళిహాలు గుమ్మంపైపుచూస్తూ ఫోనుపక్కనే నిలబడతాడు. వణికిపోతున్న పద్మ నడుంచుట్టూ చెయ్యివేసి దగ్గరగా తీసుకుంటాడు శంకరం. కాని ఆమె వదిలించుకుని కొంచెం ఎడంగానే నిలబడుతుంది. కాస్త దీర్ఘమైన నిశ్శబ్దం. తర్వాత వీధి గేటు తెరుచుకుని మూసుకున్న శబ్దం....హాలు వరండాలో అడుగుల చప్పుడు .... ఒక్కక్షణం అవకాశం. తాళంలో చెవిపెట్టి తిప్పిన శబ్దం....తాళంచెవి పట్టలేదు. ఐదారుక్షణాల అవకాశం.... మళ్ళీ వెనుదిరిగి వీధిగేటుకేసి పోతున్న అడుగులచప్పుడు....వీధి గేటు గభ్భున లాగి, వేసిన కిఱ్ఱుచప్పుడు....

శంకరం ఎగిరిపడతాడు. పడకగది తలుపులు తీసి అవతల కిటికీ లోంచి చూస్తాడు—]

జా : (గొంతెత్తకుండా) జాగ్రత్తయ్యా బాబూ!

శంక : అలా తోటలోంచి తిరిగివస్తాడేమో - ఈ తలుపు తీసివుంది!

జా : ష్!

శంక : (గొంతు తగ్గించి) లేదులేదు - మళ్ళీ తిరిగి ఇటే వస్తున్నాడు!

జా : ఇప్పుడు జ్ఞాపకం వచ్చిందన్నమాట మనిషికి!

[శంకరం పడకగది తలుపువేసి పద్మదగ్గరకొచ్చి నిలబడతాడు. వీధిగేటు మళ్ళీ తెరిచి మూసిన కిర్రుచప్పుడు - వరండాలో అడుగుల చప్పుడు - ఒక్క నిముషం అవకాశం - తాళంలో చెవిపెట్టి తిప్పినశబ్దం—

తలుపు తెరుచుకుని ఫణి గుమ్మంలో నిలబడతాడు. చేతిమీద ఇన్స్పెక్టరుగారి రెయిన్కోటు, చేతిలో పద్మ hand bag, కొన్ని పుస్తకాలు వుంటాయి. గుమ్మంలో ఛాయలా నిలబడి కాస్సేపు

తలుపుకు పెట్టిన తాళంచెవివైపు చూస్తాడు. ఆలోచనా పూర్వకంగా అది తీసిచేత బట్టుకుని దృష్టి దానిమీదనుంచి ఏదో మెట్టుమీదకు మళ్ళిస్తాడు. మళ్ళీ తాళంచెవివంక ఓ క్షణంచూసి గుమ్మందాటి లోపలకు అడుగేసి ప్రేక్షకులకు వెన్నిచ్చి తలుపువేసి మళ్ళీ వెను దిరిగి ముందుకొస్తాడు. నాలుగైదడుగులు వేసిన తర్వాత పద్మనీ శంకరాన్నీ చూస్తాడు. ఆగిపోయి పద్మకేసి ఒక దీర్ఘక్షణం నిశ్చలంగా చూసి చేతిలోని పుస్తకాలు, hand bag నేలమీద విడుస్తాడు.

అటు తిరగంగానే ఇన్స్పెక్టరు కనిపిస్తాడు. వెంటనే చేతిమీద నున్న రెయిన్కోటు విసిరిపారేసి ఏదో దయ్యాన్ని చూసిన మనిషిలా ఆకస్మికావిష్ట భయంతో హాలు గుమ్మంకేసి లంఘించి ఒక్క దూకులో తలుపు తెరుస్తాడు. తలుపు తెరవంగానే మఫ్టీలోవున్న రాంసింగ్ గుమ్మంలోపలికి అడుగు పెట్టి మార్గంలో అడ్డుగా నిలబడతాడు.

ఫణి వెనుదిరిగి రెండడుగులు వేసి పద్మవంక తేరిపార జూస్తాడు పద్మ ముఖం తిప్పేసుకుని కొద్దిగా అటు జరుగుతుంది.

ఇన్స్పెక్టరు ఫణిని ఆపాద మస్తకం ఓసారి చూసి చాలా నెమ్మదిగా ఫోనుయెత్తి పోలీస్ స్టేషన్ నంబరు డయిల్ చేస్తాడు.]

జా : (ఫోనులోకి) ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్.... ఆఁ. యస్.... వెంటనే బయల్దేరి వచ్చేయండి. వస్తూ వస్తూ డిఫెన్స్ లాయరు రామనాథంగార్నికూడా జీప్లో ఎక్కించుకు తీసుకురండి, ఫణి భూషణరావుగారు కొత్తస్టేట్మెంట్ ఒకటి ఇవ్వబోతున్నారు....

[ఫోన్ దించేస్తాడు] .

తెర

రచయిత

జననం: ప్రభవ ('27) కృష్ణాష్టమి; తెనాలితాలూకా-అనంతవరం

తండ్రి: శ్రీ విశ్వనాథం; తల్లి: కీ॥ శే॥ సుగంధి కుంతలాంబ

విద్యాభ్యాసం: బందరు. విజయవాడ..

చిన్నప్పటినుంచీ నాటకరంగంమీద ఆసక్తివున్నా 1948 లో శ్రీ నవ్య కళామండలి సంస్థాపనతో అది ఒకరూపందాల్చింది. 'జనవరి ముప్ఫయ్' నాటికా రచనతో ఆంధ్రనాటక ప్రేక్షకులకు ప్రథమంగా రచయితగా పరిచయమయ్యారు. తర్వాతి నాటకం 'కాళరాత్రి' 1955 అక్టోబరులో హైద్రాబాదులో జరిగిన ఆంధ్ర నాటక కళాపరిషత్తు పోటీల్లో ఉత్తమ ప్రదర్శనకు ఉత్తమ నటనకు ప్రథమ బహుమానం పొందింది.

ఈ 'ఫణి' నాటకం ఆంధ్ర పత్రిక సచిత్రవార పత్రికలో సీరియల్‌గా ప్రచురితమైంది.

ఈమధ్యనే 'మనిషిలో మనిషి' అని మరో కొత్తనాటకంపూర్తిచేశారు.

వీరి ఇతర రచనలు: 'దెయ్యం' (వ్యంగ్యనాటిక); 'ముళ్ళగులాబీలు' (నాటకం).

Check List

Book Number	AA/02C185	Date	30/9/2021
Front Cover	YES	Back Cover	YES
Blank Pages	CD, 121		
Missing Pages	NO		
Prepared	K. Amrutha	Scanned	Mounika
BOOK SIZE	H 7.3 W 4.8	Pages	130

Cutting

Daveed [M]